# దారి దీపం
## మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 2 - సంచిక 3 | డిసెంబరు 2023 | వెల : రూ.15

కాంగ్రెస్‌ది స్వయంకృత పరాజయం

కాంగ్రెస్ భవిష్యత్ ఏమిటి ?

ఏం చేస్తే 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' ?

రాజకీయ విరాళాలు ప్రజాస్వామ్యానికి హాని

పతన విలువలతో పరిమళిస్తున్న ప్రజాస్వామ్యం!

ఒకే దేశం - ఒకే ఎలక్షన్

మన కళ్ల ముందే కూలిపోతున్న ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామ్యం ?

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

రాజ్యాంగ రక్షణే దేశభక్తి

భారత రాజ్యాంగం : బాబ్రీ మసీదు : బాబా సాహెబ్

అసమానతల అంతమే అంబేద్కర్‌కిచ్చే నివాళి

మార్క్స్, అంబేద్కర్లవి కుల, వర్గ జమిలి సిద్ధాంతాలే

వైజ్ఞానిక స్వాప్నికుడు జవహర్‌లాల్ నెహ్రూ

జీవితమంటే పనేనా ?

క్రికెట్‌లో భారత్ ఓటమి నన్నేమీ బాధ పెట్టలేదు !

ఆకాశమంత అక్షరమూర్తి ఆవంత్స సోమసుందర్

ఉద్యమకారులకు మార్గదర్శి డా.చెలికాని

గురజాడను స్మరించుకుందాం

# అక్షర నీరాజనం




**(ఈ నెల 10వ తేదీన రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి విశేష సంచిక ఆవిష్కరణ సందర్భంగా)**

విశ్వ విద్యాలయాల నాలుగు గోడల మధ్య ఉండే తెలుగు అధ్యాపకులు సాహిత్యాన్ని అంగడి సరుకుగా మార్చి నాలుగు రాళ్లు సంపాదించుకోవడానికి అలవాటు పడి సాహితీ రంగంలో చెలామణి అవుతున్న వారి విషయం తెలియదు. కాని, సచేతనమైన సాహిత్యంతో సంబంధం వున్న వారందరికీ రాంభట్ల కృష్ణమూర్తి పేరు పరిచయమే. 2020 మార్చి 24 నాటికి రాంభట్ల శత జయంతి పూర్తి అయ్యింది. 2001 డిసెంబర్ 7న మరణించిన రాంభట్ల నాబోటి సాహితీ విద్యార్థులకు బాగా పరిచయం. 1943లో తెనాలిలో ఆవిర్భవించి 1955 దాకా అభ్యుదయ రచయితల సంఘం తెలుగు సాహితీ లోకంలో ప్రభంజనంలా సాగింది. ఆ తర్వాత సంఘంగా అభ్యుదయ రచయితల సంఘ కార్యకలాపాలు మందగించి ఉండొచ్చు. కానీ అభ్యుదయ రచనలు వస్తూనే ఉన్నాయి. 1970లో అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణ ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ ప్రయత్నాలు 1972 నాటికి ఓ కొలిక్కి వచ్చాయి. ఈ కృషిలో అభ్యుదయ రచయితల సంఘానికి రాంభట్ల కృష్ణమూర్తి చుక్కానిలా వ్యవహరించారు. గజ్జెల మల్లారెడ్డితో కలిసి రాష్ట్రమంతటా (మునుపటి ఆంధ్రప్రదేశ్) చుట్టి వచ్చి అభ్యుదయ రచయితల సంఘానికి పదిలమైన పునాది వేయడంలో రాంభట్ల పాత్ర అపురూపమైంది. ప్రగతిశీల సాహిత్యోద్యమ పునాది నిర్మాణంలో ఒక్కొక్క రాయి పేర్చినవాడాయన. రాంభట్ల శత జయంతి రెండు తెలుగు రాష్ట్రాలలోనూ నిర్వహించడానికి తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం ప్రతిపాదిస్తే ఆంధ్ర ప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఈ ఉత్సవాలకు అండగా ఉండడం తన బాధ్యతగా భావించింది. 2020 ఫిబ్రవరి 22న విశాఖపట్నంలో శతజయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కరోనా మహమ్మారి విశ్వరూపం చూపకపోతే ఆంధ్ర, తెలంగాణల్లో అనేక జిల్లాల్లో శతజయంతి సమావేశాలు జరిగేవి.


2020 మార్చిలో హైదరాబాద్లో శత జయంతి సమాపనోత్సవాలు భారీస్థాయిలో నిర్వహించాలనుకున్నాం. అదీ కుదరలేదు. అందు బాటులో లేని రాంభట్ల ముద్రిత రచనలను పునర్ముద్రించాలని అనుకున్నాం. జనకథ, వేదభూమి, వేల్పుల కథ, ఆయన ఆత్మకథ "సొంత కథ" పునర్ముద్రించాలనుకున్నాం. జనకథ, వేదభూమి ముద్రణ పూర్తయ్యింది. జనకథను మొదట విశాలాంధ్ర ప్రచురించింది. ఇప్పుడు నవచేతన పబ్లిషింగ్ హౌజ్ పునర్ముద్రించింది. విజయవాడ మిత్ర బృందం సహాయంతో వేదభూమి వెలువరించాం. అభ్యుదయ సాహిత్య ప్రచురణలో అద్వితీయమైన పాత్ర పోషిస్తున్న గుంటూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం వేల్పుల కథ పునర్ముద్రించింది. సొంత కథ, శశవిషాణం పునర్ముద్రణతో పాటు, అముద్రిత రచనలు సేకరించి ప్రచురించాల్సి ఉంది.

ఈనాడు జర్నలిజం స్కూలుకు రాంభట్ల మొదటి ప్రధానాచార్యుడు. ఆ మొదటి బ్యాచ్ జర్నలిజం విద్యార్థుల చేత వ్యాసాలు రాయించాలనుకున్నాం, అందరినీ సంప్రదించడం సాధ్యం కాలేదు. అందుబాటులోకి వచ్చిన వారు రాశారు. సాహిత్య రంగంలో రాంభట్ల సహచరులు, శిష్యులు అక్షర నీరాజనం అర్పించారు. ఇవన్నీ ఈ సంచికలో కనిపిస్తాయి. శత జయంతి సమాపనోత్సవం, గ్రంథాల పునర్ముద్రణ అనివార్య కారణాల వల్ల ఆలస్యమైంది. ఈలోగా అనాటి జాతీయ స్ఫూర్తి ప్రధాన సంపాదకులు డి.వి.వి. ఎస్.వర్మ సంస్మరణ సంచిక కోసం సిద్ధం చేసిన వ్యాసాలతో జాతీయ స్ఫూర్తి డిజిటల్ సంచిక తీసుకొచ్చారు ఇప్పుడు "దారి దీపం" సంపాదకవర్గం ఈ విశేష సంచికను మరింత సమగ్రం చేసి ప్రచురిస్తున్నది. అభ్యుదయ రచయితల సంఘానికి అంత కన్నా సంతోషకరమైంది ఏముంటుంది. "దారి దీపం" సంపాదకులు డి.వి.వి.ఎస్.వర్మకు, సంపాదకవర్గానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పడం అభ్యుదయ రచయితల సంఘం ధర్మం.

**–ఆర్వీ రామారావ్, గౌరవ సంపాదకులు,**
**రాంభట్ల కృష్ణమూర్తి శత జయంతి విశేష సంచిక**

**ప్రింటు**
**కాపీ కోరే మిత్రులకు విజ్ఞప్తి**

**శ్రీ ఆర్వీ రామారావు గౌరవ సంపాదకులుగా దారి దీపం సంపాదక వర్గం సారధ్యంలో రాంభట్ల శతజయంతి సంచిక వెలువడింది. ఉచితంగా PDF కాపీని అందిస్తున్నాం. Print copy కావలసిన వారు రూ.100 మొత్తాన్ని Daari Deepam 93971 14495@union bank - phone pay చేసి అదే నంబరుకు WhatsAppలో మీ పూర్తి postal address పెట్టండి. Registered postలో కాపీ పంపుతారు.**



# కాంగ్రెస్‌ది స్వయంకృత పరాజయం

తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఆ పార్టీకి కొంత ఊరట మాత్రమే. ఉత్తరాది రాష్ట్రాలలో రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌లో పరాజయం దానికి ఎదురుదెబ్బే. ఎందుకంటే ఈ ఫలితాలు కాంగ్రెస్ భవిష్యత్ మీద, దేశ రాజకీయాల మీద ప్రభావాన్ని చూపుతాయి. ఐదు సంవత్సరాల కింద ఈ మూడు రాష్ట్రాలను కాంగ్రెస్ గెలుచుకుంది. మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీని వీడిన వారితో బీజేపీ అధికారాన్ని పొందింది. రాహుల్‌గాంధీ జోడో యాత్ర దేశ రాజకీయాలలో ఒక కీలక మలుపు అయ్యింది. హిమాచల్‌ప్రదేశ్‌లో దాని గెలుపు తర్వాత కర్నాటకలో సాధించిన విజయం ఈ ప్రభావాన్ని స్థిరపరిచాయి. దీని పర్యవసానంగా విపక్షాల కూటమి 'ఇండియా' ఏర్పడింది. ఈ క్రమం బలపడే దశలో పైమూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అవరోధం కానున్నాయి.

ఈ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి సానుకూల పవనాలు వీస్తున్నాయి. ఆ పరిస్థితిని వినియోగించుకోవడంలో కాంగ్రెస్ పార్టీ తన స్వయంకృతాపరాధాలతో జారవిడుచుకున్నట్లు కనిపిస్తున్నది. మొదటిది ఈ ఎన్నికలలో 'ఇండియా' కూటమిని బలపర్చుకోవడం. స్థిరపర్చుకోవడానికి బదులు తన ఏకచ్ఛత్రాధిపత్యాన్ని సాధించాలన్న దురాశతో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలతో ఎన్నికల ఒప్పందాలను తిరస్కరించింది. ఉమ్మడిగా ఎన్నికల ప్రచారానికి వీలు లేకుండా చేసింది. ఫలితంగా బలపడాల్సిన ఇండియా కూటమి చీలికలు పీలికలుగా ఒకరి మీద మరొకరు పోటీ చేసుకున్నారు. ఇది ఫలితాల మీద ప్రభావం చూపించింది.

రెండవది కాంగ్రెస్ సీనియర్ల పాత్ర. కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో పగ్గాలను సీనియర్ల చేతి నుంచి తొలగించలేకపోయింది. ఈ సీనియర్లు తమ స్వంత ముఠాల నాయకులుగా వ్యవహరించారు. అత్యధిక ఓటర్లుగా వున్న యువతను ఆకర్షించలేకపోయారు. పైగా ఇండియా కూటమితో ఒప్పందాలను వ్యతిరేకించారు. కాంగ్రెస్ సీనియర్ల కొమ్ము కాస్తే.. సీనియర్లు కాంగ్రెస్‌ను నిలువునా ముంచారు. ఈ రాష్ట్రాలలో సీనియర్లు తమ ఆధిపత్యం కోసం పాత కాపులనే ఎన్నికల బరిలోకి దించారు. వారి మీద వ్యతిరేకత ఓటమి పాలు చేసింది.

ఇక మూడోది రాహుల్‌గాంధీ అత్యుత్సాహంగా కులగణన సమస్యను ఎన్నికల నినాదంగా ముందుకు తెచ్చారు. కులగణన అవసరాన్ని ఎవరూ తప్పు పట్టరు. బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో కులగణన ఎన్నికలలో ప్రాధాన్యత వున్నది. ఎందుకంటే అక్కడ చాలా సంవత్సరాలుగా ఈ సమస్య నలుగుతున్నది. బడుగువర్గాల ప్రజలకు అది కొత్త ఆకాంక్షలను కల్పించడం సహజం. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో అలాంటి పరిస్థితి లేదు. పేద, బడుగు వర్గాలకు అది ఇంకా జీవిత సమస్య కాలేదు. ఇలాంటిచోట కులగణన సమస్య ఓటర్లను ప్రభావితం చేయలేకపోయింది. పైగా ఇంత వరకు రాజకీయంగా, ఆర్థికపరంగా అదనపు లబ్ధి పొందుతున్న పైతరగతి వర్గాలకు ఈ నినాదం కంటక ప్రాయం అయ్యింది. దీంతో ఆ నినాదానికి సానుకూలంగా ఉండాల్సిన వర్గాలు స్పందించకపోవడం.. వ్యతిరేక వర్గాలు ప్రతిఘటించడంతో రాహుల్ నినాదం వికటించింది.

ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ స్వయంకృతాపరాధాలే. ఈ ఫలితాలను అధిగమించి తిరిగి ఇండియా కూటమిని కొనసాగించడం అన్నది కాంగ్రెస్ పార్టీ ముందున్న సవాలు. ఈ పరీక్షలో అది నెగ్గితేనే ఇండియా కూటమి ముందుకు సాగుతుంది.

- డీవీవీఎస్ వర్మ

సంపాదకులు, 85006 78977

డిసెంబరు - 2023

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 2 - సంచిక : 3



డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు



వెల : 15 రూపాయలు


## ఈ సంచికలో..


1.కాంగ్రెస్‌ది స్వయంకృత పరాజయం.. - సంపాదకీయం 3

2. కాంగ్రెస్ భవిష్యత్ ఏమిటి ? - ఎ.కృష్ణారావు 5

3. ఏం చేస్తే 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ'? -ఎన్.వేణుగోపాల్ 7

4.రాజకీయ విరాళాలు ప్రజాస్వామ్యానికి హాని - నంటూ బెనర్జీ 9

5.పతన విలువలతో పరిమళిస్తున్న ప్రజాస్వామ్యం! - కె.శ్రీనివాస్ 10

6.ఒకే దేశం - ఒకే ఎలక్షన్ - కేశవ్ 12

7,మన కళ్ళ ముందే కూలిపోతున్న ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామ్యం? -కె.రామచంద్రమూర్తి 13

8.ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం - మాడభూషి శ్రీధర్ 18

9.రాజ్యాంగ రక్షణే దేశభక్తి - 20

10.భారత రాజ్యాంగం : బాబ్రీ మసీదు : బాబా సాహెబ్ - ఎస్.వినయకుమార్ 22

11.అసమానతల అంతమే అంబేద్కర్‌కిచ్చే నివాళి - టి.స్కైలాబ్‌బాబు 24

12.మార్క్స్, అంబేద్కర్లవి కుల, వర్గ జమిలి సిద్ధాంతాలే - అబ్దుల్ నూర్ బాషా 25

13.వైజ్ఞానిక స్వాప్నికుడు జవహర్‌లాల్ నెహ్రూ - డాక్టర్ దేవరాజు మహారాజు 31

14.జీవితమంటే పనేనా ? - డాక్టర్. సీ.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి 33

15.క్రికెట్‌లో భారత్ ఓటమి నన్నేమీ బాధ పెట్టలేదు ! - అవిజిత్ పాథక్ 35

16.ఆకాశమంత అక్షరమూర్తి ఆవంత్స సోమసుందర్ - గౌరవ్ 37

17.ఉద్యమకారులకు మార్గదర్శి డా.చెలికాని - డా.పి.యస్. ప్రకాశరావు 39

18.గురజాడను స్మరించుకుందాం - రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి 42

19. కార్టూన్స్ 43

20. కొత్త పుస్తకాల స్వీకారం 44





కార్టూన్ : సతీష్ ఆచార్య


వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM



దారి దీపం


మాసపత్రిక

మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

# కాంగ్రెస్ భవిష్యత్ ఏమిటి ?



-ఎ.కృష్ణారావు

కాలం ఎంత వేగంగా పయనిస్తోంది. రైలు ప్రయాణంలో చెట్లూ, ఊళ్లూ, మనుషులూ వేగంగా వెనక్కి వెళుతున్నట్లు చరిత్ర ప్రయాణంలో రాజకీయ నాయకులూ, ఘటనలూ కూడా వేగంగా వెనక్కి వెళుతున్నట్లనిపిస్తోంది. ఇంకా తుగ్లక్ రోడ్‌లో కేసీఆర్ నివాసంలోని ఒక గదిలో జయశంకర్, కోదండరామ్ వివిధ పార్టీల నుంచి తెలంగాణకు అనుకూలంగా లేఖలు సేకరించే విషయంపై మాట్లాడుతున్నట్లు, కేసీఆర్ మీడియాతో పాటు రకరకాల వ్యక్తులతో చర్చిస్తున్నట్లు, జంతర్‌మంతర్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ నిరాహార దీక్ష చేస్తున్నట్లు, ఇండియా గేట్ వద్ద చెట్టుకు ఆదిరెడ్డి ఉరేసుకుని ఊగుతున్నట్లు, తెలంగాణ జర్నలిస్టులు మౌలంకర్ హాలులో నిర్వహించిన సభలో గద్దర్ 'పొడుస్తున్న పొద్దు మీద' అంటూ ఆలపిస్తున్నట్లు, పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రే కళ్లు మండిస్తునట్లు అనిపిస్తోంది.

'మా రాము.. యూఎస్‌లో ఉంటాడు. తెలంగాణ రాకపోతే నాకు పోయేది ఏమి లేదు. మావాడు నెలకు 300 డాలర్లు పంపితే కాలు మీద కాలేసుకుని కాలం గడుపుతా' అని కేసీఆర్ ఒక మధ్యాహ్నం డైనింగ్ టేబుల్ వద్ద షార్ట్ వేసుకుని నిలబడ్డ కేటీఆర్‌ను పరిచయం చేసిన దృశ్యమూ ఇంకా కళ్లముందాడుతోంది. ఎంత విన్నా వినాలనిపించే కేసీఆర్ మాటలు, తెలంగాణ యాసలో ఛలోక్తులు, విమర్శలు, ప్రత్యర్థులపై వాగ్బాణాలు, పుస్తకాల లోంచి ఉటంకింపులు ఇంకా గింగురుమంటున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఘట్టంలో లెక్కలేనన్ని దృశ్యాలు, ఘటనలు, వ్యక్తులు ఎన్నో.. దాదాపు రెండు దశాబ్దాలపాటు తెలుగు నేలలో జరిగిన ఉద్యమాలు, వినపడ్డ నినాదాలు, ఆర్తనాదాలు, ఉద్యోగులు, మేధావుల నిరసన ధ్వనులు, ఆత్మహుతి ఆర్తరావాలు ఇంకా ప్రతిధ్వనిస్తూ, ప్రకంపింపచేస్తూ ఉన్నాయి. చితి చల్లారిపోయింది. అస్తికలూ గంగలో కలిశాయి. గత జ్ఞాపకాలను తలుచుకుని బాధపడితే వచ్చేదేమిటి ?

**అసలు భౌగోళిక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందనీ, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, అత్యంత కీలకపాత్ర పోషించిన తెలంగాణ రాష్ట్ర సమితి తన పేరు మార్చుకుని, రూపం మార్చుకుని భారత రాష్ట్ర సమితిగా అవతరిస్తుందని, తెలంగాణ అస్తిత్వవాదం క్రమంగా ఒక చర్చలో లేని అంశంగా మారుతుందని, చివరకు కేసీఆర్ కూడా పరాజయం చెందుతారని, ఢిల్లీలో తుగ్లక్ రోడ్ నివాసం ఖాళీ చేయవలసి వస్తుందని ఆ నాడు ఊహించలేదు. అసలు ఈ పరిణామాలు జరిగాయని ఈనాడు నమ్మశక్యంగా లేదు.**

ఇవాళ దేశంలో అన్ని రాష్ట్రాల్లో జరిగినట్లే తెలంగాణలో కూడా ఎన్నికలు జరిగి పదేళ్లు పరిపాలించిన ఒక పార్టీ పాలన ముగిసింది. అందులో ప్రత్యేకత ఏమీ లేదు. అందరు రాజకీయ నాయకుల్లాగే కేసీఆర్ పాలించి, తన చుట్టూ కొద్ది మందిని పోగేసుకుని ఇష్టారాజ్యంగా పాలన సాగించి, ఒక వ్యక్తి చుట్టూ పార్టీని, ప్రభుత్వాన్ని నడిపించి, పలు ఆరోపణలు, విమర్శలు కూడగట్టుకున్నప్పటికీ తనదైన చరిత్ర కొంత మిగుల్చుకుని నిష్క్రమించారు. అయిదేళ్ల తర్వాత ఆయన, ఆయన పార్టీ పరిస్థితి ఏ విధంగా ఉంటుంది, రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మధ్య ఎంత వరకు ఊపిరి నిలబెట్టుకుంటుందీ అన్నది ఇప్పుడు అసంగతం. అది వారి అస్తిత్వ సమస్య కాని తెలంగాణ అస్తిత్వ సమస్య ఇక ఎంత మాత్రమూ కాదు.

కేసీఆర్ ఆవిర్భావం, నిష్క్రమణ నమ్మశక్యంగా లేనట్లే, అదే సమయంలో నరేంద్రమోదీ దేశ రాజకీయాల్లో ఒక ప్రబలశక్తిగా అవతరించడం, పదేళ్లు గడిచినా ఇప్పటికీ దేశ రాజకీయాలను పూర్తిగా తన చుట్టూ తిప్పుకోవడం, ఎంతో ఘనచరిత్ర గల కాంగ్రెస్ ఇంకా ముక్కుతూ మూల్గుతూ ఉండడం కూడా నమ్మశక్యంగా కనపడడం లేదు. అనేక వివాదాస్పదమైన, అప్రజాస్వామికమైన నిర్ణయాలు, ఏకపక్ష వ్యవహార శైలి, పార్టీని, ప్రభుత్వాన్నీ తనచుట్టూ తిప్పించుకోవడం, వ్యక్తిపూజకు ఆస్కారం కల్పించడం, నాటకీయ హావభావాలు మోహం మొత్తించడం, ప్రతిపక్షాలను, ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం మొదలైనవి ఎన్నో ఉన్నప్పటికీ ఇవాళ నరేంద్రమోదీ అన్న వ్యక్తిని విస్మరించి ప్రజలు ప్రతిపక్షాలను ఆదరించే పరిస్థితి అంతగా కనపడడం లేదు. మూడు రాష్ట్రాల్లో నరేంద్రమోదీ ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థిని ప్రకటించలేదు. ఒక పథకం ప్రకారం స్థానిక నాయకులకు ప్రాధాన్యం కల్పించలేదు. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాత్, మధ్యప్రదేశ్‌లో కమల్‌నాథ్, ఛత్తీస్‌గఢ్‌లో భూపేష్ భగేల్‌కూ నరేంద్రమోదీకి మధ్య పోటీ ఏర్పడిన మాదిరి ఎన్నికలు

## General Election to Assembly Constituencies: Trends & Results Dec-2023

**Mizoram** — Assembly Constituencies: 40
* Status of Top Five Parties

| Parties | Leading/Won |
|---|---|
| ZPM | 27 |
| MNF | 10 |
| BJP | 2 |
| INC | 1 |

**Chhattisgarh** — Assembly Constituencies: 90
* Status of Top Five Parties

| Parties | Leading/Won |
|---|---|
| BJP | 54 |
| INC | 35 |
| GGP | 1 |

**Madhya Pradesh** — Assembly Constituencies: 230
* Status of Top Five Parties

| Parties | Leading/Won |
|---|---|
| BJP | 163 |
| INC | 66 |
| BHRTADVSIP | 1 |

**Rajasthan** — Assembly Constituencies: 199
* Status of Top Five Parties

| Parties | Leading/Won |
|---|---|
| BJP | 115 |
| INC | 69 |
| IND | 8 |
| BHRTADVSIP | 3 |
| BSP | 2 |

**Telangana** — Assembly Constituencies: 119
* Status of Top Five Parties

| Parties | Leading/Won |
|---|---|
| INC | 64 |
| BHRS | 39 |
| BJP | 8 |
| AIMIM | 7 |
| CPI | 1 |

జరిగాయి. ఇవి జాతీయ ఎన్నికలా అన్న భ్రమను మోదీ కల్పించారు. రాహుల్, ప్రియాంక ఎంత తిరిగినప్పటికీ, ఎంత మాట్లాడినప్పటికీ మోదీకి తామే పోటీ అన్నట్లుగా వ్యవహరించ లేకపోయారు. తన నాయకత్వంలో దేశమంతా జిగేల్ జిగేల్ మంటున్నట్లు, జాతీయవాదం, దేశభక్తి తమ స్వంతమే అన్నట్లు, ప్రతిపక్ష నేతలంతా అవినీతి పుట్టలో పురుగులన్నట్లు మోదీ చేసిన ప్రచారాన్ని వమ్ము చేయగల సామర్థ్యం కాంగ్రెస్‌లో ఉన్నట్లు కనపడలేదు. మోదీ, అమిత్ షాలను ఢీకొనగల నాయ కత్వం ప్రతిపక్షాలకు లభించేందుకు ఎంత కాలం పడుతుంది?

మధ్యప్రదేశ్‌లో 20 ఏళ్లుగా ఒక పార్టీ ప్రభుత్వం ఉన్నది. పేదరికం, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు లాంటివి ఎన్నో ఉన్నాయి. అక్కడ ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకతను కాంగ్రెస్ తనకు అనుకూలంగా ఉపయోగించుకోలేకపోయింది. ఛత్తీస్‌గఢ్‌లో భూపేశ్‌బఘేల్ ప్రభుత్వం బాగానే పరిపాలిస్తోందని, బీజేపీ అక్కడ అధికారంలోకి రావడం కష్టమని అనేక మంది తేల్చేశారు. ఇలాంటి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ అధికారం నిలబెట్టుకోలేకపోయింది. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాత్ పథకాలు ప్రజల్లోకి వెళ్లాయని, ఈసారి ప్రభుత్వ వ్యతిరేకతను కాంగ్రెస్ అధిగమిస్తుందని కూడా అంచనాలు వినపడ్డాయి. అయినా తన సానుకూల అంశాల ద్వారా ప్రజలను ఆకట్టుకునే శక్తి కాంగ్రెస్‌లో లేకపోయింది. కాంగ్రెస్ వివిధ బడుగు, బలహీన వర్గాల మైనారిటీల సామాజిక వేదికగా ఉండేందుకు ఎంతో కొంత పనిచేసినా ప్రజల్లోకి తమ భావాలను సమర్థంగా తీసుకువెళ్లలేకపోయింది. అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లో అనేక మంది జాతీయ నేతల్ని, ఎంపీల్నీ బీజేపీ రంగంలోకి దింపి ఒక కొత్త నాయకత్వం ఏర్పడనున్నట్లు భ్రమ కల్పిస్తే కాంగ్రెస్ వృద్ధ నేతలతోనే ప్రజల ముందుకు వెళ్లింది. తెలంగాణలో కూడా కాలం చెల్లిన వృద్ధ నేతలతో ఎన్నికలకు వెళ్లి ఉంటే పరాజయం తప్పేది కాదేమో. అక్కడ రేవంత్‌ను రంగంలోకి దించడం వల్లే ఈ మాత్రం మార్పు కనపడింది. 2014లో ప్రశాంత్ కిషోర్‌ను ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత మోదీ టీమ్ ఆయనను పక్కనపెట్టింది. ఇవాళ మోదీ, అమిత్ షాల కోసం అనేక ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. అసోసియేషన్ ఆఫ్ బిలియన్ మైండ్స్, ఎక్సిస్ మై ఇండియా వంటి అనేక సంస్థలతోపాటు అంతర్గతంగా అనేక బృందాలు బీజేపీ కోసం పనిచేస్తుంటాయి. ప్రకటనలు, వీడియోలు, సర్వేలు, సమాచార సేకరణలు చేసే వారికి ఎక్కడి నుంచి ఎవరు డబ్బిస్తారో తెలియనంతగా పకడ్బందీగా పనులు జరుగుతుం టాయి. ఎన్నికల్లో గెలిస్తే మాత్రం ఘనత మోదీ, అమిత్ షాలే దక్కించుకుంటారు. కాని కాంగ్రెస్‌లో ఇలాంటి పనులు చేసే మేనేజర్లను తలపై పెట్టుకోవడం కనిపిస్తుంది. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తరఫున పనిచేసిన సునీల్ కనుగోలుకు ముఖ్యమంత్రి సలహాదారుగా మాత్రమే కాక కేబినెట్ హోదా ఇచ్చారు. తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్ సర్వేలను, ఎన్నికల వ్యూహ రచనను కూడా ఆయన నిర్వహించారు. రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాత్ డిజైన్ బాక్స్‌డ్‌కు చెందిన నరేశ్ అరోరా చేతుల్లో రాష్ట్ర ఎన్నికల నిర్వహణను అప్పజెప్పారు. అశోక్ గెహ్లాత్ పూర్తిగా తన వల్లే గెలుస్తాడన్న విధంగా నరేశ్ అరోరా వ్యవహ రించారు. ఇతడి ఆధిపత్యం తట్టుకోలేక ఒక దశలో పీసీసీ అధ్యక్షుడు గోవింద్‌సింగ్ కూడా అలిగి ఇంటికి పరిమితమ య్యారు. పార్టీలో పనిచేసే నేతలు, కార్యకర్తలు తగ్గిపోయి, సూక్ష్మ స్థాయిలో ఎన్నికల నిర్వహణ చేయగల సమర్థతను నాయకత్వం కోల్పోయి పూర్తిగా ఏజెన్సీలపై ఆధారపడితే ఏమి జరుగుతుందో మూడు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నిరూపించాయి.

ఈ నేపథ్యంలో 2024లో పరిస్థితి ఎలా ఉంటుంది?

**(మిగతా 8వ పేజీలో)**

# ఏం చేస్తే 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ'?



- ఎన్.వేణుగోపాల్

తెలంగాణ ఎన్నికల ఫలితాలు రాగానే పిసిసి అధ్యక్షుడుగా రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంలో కనీసం తొమ్మిదిసార్లు తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి మాట్లాడారు. 'ప్రజల హక్కులను కాపాడడానికి, పౌరహక్కులను నిలబెట్టడానికి' తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. టీఆర్ఎస్ పాలనలో 'ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడానికి జరిగిన ప్రయత్నాలు తిరిగి రాకుండా' చూస్తామన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తూ కూడా ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి ప్రస్తావించారు. అంటే పార్టీ అధ్యక్షుడిగానూ, ప్రభుత్వాధినేతగానూ కూడా ఆయన 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ'ను తెలంగాణ ప్రజానీకానికి హామీ ఇచ్చారు. మరి, ఆ ప్రజాస్వామ్య పునరుద్ధరణ వాగ్దానం ఎట్లా సాకారమవుతుంది ?

ఈ తొమ్మిదిన్నర సంవత్సరాలలో తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన దారుణంగా జరిగింది. వందలాదిగా వున్న అటువంటి ఉల్లంఘన ఘటనలనూ, పరిణామాలనూ అన్నిటినీ చెప్పుకోనక్కరలేదు. కాని ప్రధాన ధోరణులను గుర్తు చేసుకుంటే, ఆ గతానికి భిన్నమైన భవిష్యత్తును ఎట్లా నిర్మించాలో తెలుస్తుంది. ప్రజాస్వామిక హక్కుల విషయంలో కాంగ్రెస్ గత చరిత్ర అంత గౌరవనీయమైనదేమీ కాదు గాని, ప్రస్తుత హామీల సందర్భంలో భిన్నమైన భవిష్యత్తు నిర్మాణం గురించి చర్చించాలి. హైకోర్టు జోక్యంతో ధర్నాచౌక్ పునరుద్ధరణ జరిగినప్పటికీ, మొదటి నుంచి టీఆర్ఎస్ ప్రభుత్వానికి ధర్నాచౌక్ అనే మాటే కంటగింపుగా ఉండేది. అంటే ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం, నిరసన గళం వినిపించడం అనేవే అయిష్టంగా ఉండేవి. ప్రభుత్వ విధానాల మీదనైనా, మరే విషయం మీదనైనా తమ అభిప్రాయం బహిరంగంగా ప్రకటించే అధికారం, హక్కు ప్రజలకు ఉంటుందని, ప్రభుత్వం ఆ హక్కును కాపాడాలని తెలంగాణ తొలి ప్రభుత్వం అనుకోలేదు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ గురించి మాట్లాడుతున్న ఈ ప్రభుత్వం తప్పని సరిగా ప్రజాభిప్రాయం వ్యక్తమయ్యే అన్ని మార్గాలనూ తెరిచి పెట్టాలి. టీఆర్ఎస్ ప్రభుత్వం సభల మీద, సమావేశాల మీద అప్రకటిత నిషేధాన్ని అమలు చేసింది. చివరికి సంస్మరణ సభల నూ, పుస్తకావిష్కరణ సభలనూ, విద్యార్థుల సభలనూ, మేధో మథనపు సదస్సులనూ అడ్డుకుంది. రాజ్యాంగ అధికరణం 19(1)ని గౌరవించబోనని ఆచరణలో చూపింది. సభ జరగబోయే హాళ్లకు తాళాలు వేయించి పోలీసులను మోహరించింది. ఏ సంస్థలకు, ఎవరెవరు వక్తలుగా ఉండే సభలకు హాలు అద్దెకు ఇవ్వగూడదో జాబితాలు తయారుచేసి హాలు యాజమాన్యాలను బెదిరించింది. చివరికి వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఒక పుస్తకావిష్కరణ సభను, హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఒక పత్రికా సమావేశాన్ని తాళాలు వేసి అడ్డుకుంది. తన ఇంటి ఆవరణలో తమ్ముడి సంస్మరణ సభ జరపదలచిన అన్నను ఒక రోజంతా అక్రమ నిర్బంధంలో ఉంచింది. గత పది సంవత్సరాలలో ఒకటి, రెండు మినహా, అనేక రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు ఊరేగింపులు, బహిరంగ సభలు జరుపుకోవడానికి వీలులేని నిషేధాజ్ఞలు అమలు చేసింది. 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' అంటే ఈ స్థితిని మార్చడమే.

అన్నిటికన్నా ఘోరమైన, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా లేని విషయం, ఏ సంస్థ అయినా ఫలానా రోజున నిరసన ప్రదర్శన చేస్తామని ప్రకటిస్తే ఆ సంస్థ నాయకులనూ, ఆ ప్రదర్శనకు సంఘీభావం ప్రకటించిన వారిని ముందస్తుగా అరెస్టు చేసే దుర్మార్గమైన సంప్రదాయాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పింది. నిరుద్యోగుల ప్రదర్శన జరగనున్న రోజు ఉదయాన కోదండరాం ఇంటి మీద దాడి చేసి, గొడ్డళ్లతో తలుపులు పగులగొట్టి, అరెస్టు చేయడం అటువంటి డజన్ల కొద్దీ ఘటనలకు ఒక ఉదాహరణ మాత్రమే. అలాగే, ముఖ్యమంత్రి, మరొక ముఖ్యమైన మంత్రి ఏ ఊరిని సందర్శిస్తున్నా, ఆ ఊరిలోని డజన్ల కొద్దీ ప్రతిపక్ష పార్టీల, ప్రజాసంఘాల నాయకులను, కార్యకర్తలను ఆ రోజంతా పోలీసు స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించడమో, ఇంటి నుంచి బైటికి రాకుండా వందలాది మంది పోలీసులను మోహరించడమో అలవాటుగా మారింది. ఈ పద్ధతులను తక్షణం రద్దు చేయడమే 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ.'

భిన్నాభిప్రాయం ప్రకటించే పత్రికల మీద, ఛానళ్ల మీద ఆంక్షలు, వాటిని లొంగదీసుకోవడానికి సామ, దాన, భేద దండోపాయాలు వాడడం, తద్వారా ప్రచార మాధ్యమాలలో భిన్నాభిప్రాయాల ఛాయలైనా కనబడకుండా చూడడం టీఆర్ఎస్ ఒక కళగా అభివృద్ధి చేసింది. అలా ఒకవైపు ప్రజాభిప్రాయం, వాస్తవం వినబడకుండా, కనబడకుండా చేసి, మరొకవైపు తమ అబద్ధాలనూ, అర్ధసత్యాలనూ ప్రజల మీదికి వెల్లువలా వదిలింది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించమని అభ్యర్థిస్తున్న, ఆందోళన చేస్తున్న వర్గాల మీద ఉక్కుపాదం మోపి

రాష్ట్రంలో ఒక దశాబ్దంగా ప్రజా సమస్యలు వినబడని స్థితి కల్పించారు. అసలు ఏ సమస్యనైనా పోలీసు బలప్రయోగం ద్వారా మాత్రమే పరిష్కరించగలమని అనుకున్నారు. తొమ్మిదిన్న రేళ్లలో తెలంగాణలో అచ్చమైన పోలీసు రాజ్యం అమలయింది. ఆరు దశాబ్దాల ఆకాంక్షల, పోరాటాల, త్యాగాల పర్యవసానంగా ఏర్పడిన తెలంగాణలో ఆ ఆకాంక్షలను తీర్చడానికి అందిన ప్రజాస్వామిక సదవకాశాన్ని పాలకులు చేజేతులా జార విడుచుకున్నారు. ప్రజాజీవనంలో విధ్వంసం సృష్టించారు. 'ప్రజాస్వామిక పునరుద్ధరణ' అంటే ఆ విధ్వంసాన్ని సరిదిద్దడం.

పోలీసు రాజ్యం, పౌర, ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన తెలంగాణకు కొత్తవి కావు. స్థూలంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నుంచి, ప్రత్యేకంగా 1967 శ్రీకాకుళ విప్లవోద్యమం నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రజలకు, ప్రశ్నించే వారికి దక్కినది పోలీసు రాజ్యమే. పది సంవత్సరాల తెలంగాణ పాలన ఆ సంప్ర దాయాన్ని మార్చలేదు సరిగదా, ఇబ్బడి ముబ్బడిగా పెంచింది. గతంలో లాగే బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలు కొనసాగాయి. 'విప్లవకారులు', 'ఇస్లామిక్ తీవ్రవాదులు', 'నేరస్తులు' అనే పేరుతో ప్రజలను చట్టాతీతంగా, విచారణాతీతంగా కాల్చి చంపడం అధికారిక విధానం అయింది. ఒక సాయుధ విప్లవ పార్టీనీ, ఆరు ప్రజా సంఘాలనూ 1992లో నిషేధించిన ఘన చరిత్ర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానిదైతే, ఆ నిషేధాన్ని కొనసాగించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిది. ఇందులో విద్యార్థి, యువజన, రైతుకూలీ, కార్మిక సంఘాలను కూడా నిషేధించి, ప్రపంచంలో ఎక్కడా జరగని పని చేసినది తెలంగాణ ప్రభుత్వమే. 'ప్రజా స్వామ్య పునరుద్ధరణ' అంటే ఎన్‌కౌంటర్ హత్యల విధానాన్ని ఆపడం, ప్రజా సంస్థల మీద నిషేధాన్ని ఉపసంహరించు కోవడం. తప్పుడు కేసులు పెట్టడంలో తెలంగాణ ప్రభుత్వానిది దుర్మార్గమైన చరిత్ర. ఎటువంటి నేరమూ, చర్యా, క్రియా, పనీ లేకపోయినా, కేవలం మాట, రాత, సైగ, ఉద్దేశం, ఏదో ఒక సంస్థ సభ్యత్వం వంటి వాటిని నేరాలుగా చూసే చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధ చట్టం (యుఎపిఎ)ను అతి ఎక్కువగా, విచ్చలవిడిగా వాడిన రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. ఈ కేసుల్లో నిందితులుగా చూపినవారు ఆదివాసులు, కవులు, రచయితలు, విద్యార్థులు, అధ్యాపకులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, సామా జిక కార్యకర్తలు. మొత్తం ముప్పైకి పైగా ఇటువంటి అబద్ధపు కేసులుండగా, అందులో కనీసం పదమూడు కేసులలో బహి రంగ ప్రజా జీవితంలోని ఆలోచనాపరులను ఇరికించారు. ఒక కేసులో ప్రజా నిరసన తర్వాత ఆరుగురి మీద కేసు ఉపసంహ రించుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది గాని, ఆ ఉపసం హరణ ప్రక్రియే ప్రారంభం కాలేదు. చివరికి ప్రభుత్వం రెండు వారాల్లో దిగిపోనున్నదనగా ఇటువంటి అబద్ధపు కేసుల బనా యింపు జరిగింది. ఈ నిర్బంధకాండకు తోడు ఆదివాసులు, నిరుద్యోగులు, రైతులు, కౌలుదార్లు, విద్యార్థులు, ఆర్టీసీ కార్మి కులు, అసంఘటితరంగ కార్మికులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది వంటి ఎన్నో వర్గాల మీద అణచివేత అమలయింది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే ఈ అప్రజాస్వామిక విధానాలన్నిటినీ, చర్యలన్నిటినీ సమీక్షించడం, సవరించడం, బాధ్యులైన అధికారులను విచారించడం, మళ్ళీ అటువంటి చర్యలు, ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన జరగబోవని హామీ పడడం. గతం కన్నా భిన్నమైన భవిష్యత్తును వాగ్దానం చేసిన కొత్త తెలంగాణ ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని నిలుపుకుంటుందా?

# కాంగ్రెస్ భవిష్యత్ ఏమిటి ?

**(6వ పేజీ తరువాయి)**

ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే హోంమంత్రి అమిత్ షా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ర్యాలీలో పాల్గొని పౌరసత్వ చట్టం అమలును ఎవరూ ఆపలేరని ప్రకటించారు. బీజేపీ నిరంతరం ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే పనిచేస్తుందనడానికి ఇది నిదర్శనం. ఎన్నికల ఫలితాలు వెలువడగానే నరేంద్రమోదీ దీనదయాళ్ మార్గ్‌లోని బీజేపీ కార్యాలయానికి వెళ్లి మూడు రాష్ట్రాల్లో విజయం లోక్‌సభలో బీజేపీ హ్యాట్రిక్‌కు దారి తీస్తుందని ప్రకటిం చారు. ఈ ఫలితాల తర్వాత దేశంలో మెజారిటీ రాజకీయ పరిశీలకులు బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు ఎలాంటి అడ్డంకులూ లేవని ప్రకటించారు. ఒక రకంగా ఈ విజయం ద్వారా దేశంలో ప్రతిపక్షాల భవిష్యత్తును మోదీ అంధకార బంధురం చేయగలిగారు.

**ఇవాళ దేశంలో బీజేపీని వ్యతిరేకించే మేధావులు, ఇతర సామాజిక వర్గాలు, వామపక్షీయులు ఎక్కువగానే కనపడుతున్న ప్పటికీ వారు కాగితపు పులులుగానో, సోషల్ మీడియా సింహాలుగానో కనపడుతున్నారు. కాని బీజేపీ వ్యతిరేక భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయడంలో విఫలమవుతున్నారు. వీరిని నమ్ముకుని రాహుల్, ప్రియాంకలు రంగంలోకి దిగితే లాభం లేదు. భారత్ జోడో యాత్ర వల్ల కొంత కదలిక ఏర్పడినప్పటికీ దాన్ని ప్రజల్లో ఓటు బ్యాంకుగా మలచడంలో కాంగ్రెస్ నేతలు విఫలమయ్యారు. కాంగ్రెస్‌తో ముఖాముఖి తలపడే రాష్ట్రాల్లో ఆ పార్టీని ఓడించడం సులభమని బీజేపీ నిర్ణయించుకున్నట్లు అర్థమవుతోంది. బీజేపీని ముఖాముఖి ఎదుర్కోగల రాష్ట్రాల్లో కాంగ్రెస్ చతికిలపడ్డ తీరు ఇవాళ కాంగ్రెస్ భవిష్యత్‌పై కన్నా దేశ భవిష్యత్ గురించి మేధావులను చింతాక్రాంతులను చేస్తోంది.** ❑

# రాజకీయ విరాళాలు ప్రజాస్వామ్యానికి హాని



- నంటూ బెనర్జీ

సార్వత్రిక ఎన్నికలకు, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు వాణిజ్యవేత్తలు, కార్పొరేట్లు ఇచ్చే విరాళాలు భారతదేశ ప్రజా స్వామ్య వ్యవస్థకు తీరని హాని చేస్తాయి. ఎవరు ఇచ్చింది, ఎవరు తీసుకున్నది తెలియకపోతే, నల్ల డబ్బు రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలలో ఫ్రాన్స్ వ్యవస్థ చాలా మేలైనది. ఆ దేశంలో వ్యాపారవేత్తలు, కార్పొరేట్లు రాజ కీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడాన్ని నిషేధించారు. విరాళాలు ఇచ్చే కుబేరులు వాళ్ల పేర్లు కూడా చెప్పడం లేదు. భారత దేశంలో కార్పొరేట్లు, నల్ల కుబేరులు రాజకీయ పార్టీలకు అపా రంగా విరాళాలు ఇస్తున్నారు. రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ అధికారంలో ఉండే రాజకీయ పార్టీలకు ఎన్నికల నిధులను ఇబ్బడిముబ్బడిగా ఇస్తున్నారు. తమ పనులు చేయించుకునేం దుకు పెద్ద మొత్తాలలో రాజకీయ పార్టీలకు విరాళాలు గుప్పి స్తున్నారు. మన దేశంలో ఎన్నికల బాండ్లను కొనుగోలు చేయడం ద్వారా పరిపాలన చేస్తున్న రాజకీయ పార్టీలకు విరాళాలు 2017 నుంచి ఇవ్వడం ప్రారంభమైంది. విరాళాలు అందుకునే పార్టీల లో బీజేపీకి అత్యధికంగా అంటే కనీసం 75 శాతం అందుతున్నా యని ప్రజలకు తెలిసిందే. ఈ విరాళాలను అనుమతించ కూడదని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టులో ఇంకా విచారణ జరుగుతోంది. అత్యధికంగా విరాళాలు అందుకున్న పార్టీలు ఓట్ల కొనుగోలుకు, ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగినంతమంది ఎంఎల్ఏలు లేకపోతే తమకు కావలసిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన సందర్భాలే ఎక్కువగా ఉంటున్నాయి. ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే అది ప్రజాస్వామ్యమని అనిపించుకుంటుంది.

దాదాపు అన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలలో ఆర్థిక పారదర్శకత ఉండడం కోసం చట్టాలు ఉన్నాయి. ప్రపంచంలో పెద్ద ప్రజా స్వామ్య దేశమైన భారతదేశంలో బహుళ రాజకీయ పార్టీలు న్నాయి. ఈ పార్టీలు ఎన్నికల ప్రచారం కోసం కోట్ల రూపాయలు విరాళాలు వసూలు చేస్తున్నాయి. అయితే వసూళ్లను వెల్లడించ డానికి తిరస్కరిస్తున్నాయి. వందల కోట్ల విరాళాలు వసూలు చేసి వాటిని విచ్చలవిడిగా ప్రచారం కోసం వినియోగిస్తున్నాయి. ఈ విరాళాలతో మద్యం కొనుగోలు చేసి ఓటర్లకు పంచుతూ వారిని తాగుబోతులుగా మారుస్తున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయిల్లో ప్రజా స్వామ్య నైతిక సూత్రాలను ఉల్లంఘించి రాజకీయ పార్టీలు రహస్యంగా వసూలు చేయడాన్ని కొందరు అంగీకరిస్తున్నారు. మరికొందరు అంగీకరించడం లేదు. భారతదేశంలో వాస్తవంగా ప్రధాన పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి ఎన్నికల కమిషన్ విధించిన షరతుకు మించి ఇష్టం వచ్చినట్లు డబ్బు ఖర్చు చేస్తున్నారు. రాజకీయ జీవితంలో ఆర్థిక పారద ర్శకత లేకుండా పోయింది. స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు జరిగే అవకాశమే లేకుండా పోయింది. 2018లో లోకసభలో రాజకీయ పార్టీలకు విరాళాలు, డోనేషన్లకు సంబంధించి ద్రవ్య బిల్లుగా ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి బడా వాణిజ్య వేత్తలు, కార్పొరేట్లు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేయడం బాగా విస్తరించింది. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ, ఎన్నికల బాండ్ల విక్రయం ద్వారా వసూలైన మొత్తంలో నాలుగింట మూడు వంతులు పొందుతున్నది. 2019-20 సంవత్సరంలో ఎన్నికల బాండ్ల ద్వారా బీజేపీకి 76 శాతం విరాళాలు అందాయి. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల బాండ్ల ద్వారా తొమ్మిది శాతం మాత్రమే అందింది. 2019-20లో మొత్తం 3,355 కోట్ల రూపాయలు వసూలైనట్లు అంచనా. 2021-22లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి పశ్చిమ బెంగాల్‌లో 96 శాతం వసూలైన మొత్తంలో లభించింది. అంటే టీఎంసీకి 2021-22లో రూ.545.74 కోట్లు దక్కింది. టీఎంసీకి కేవలం బాండ్ల ద్వారా రూ.528.14 కోట్లు లభించింది. పార్టీకి ఇచ్చే సభ్యత్వం తిరిగి వసూలు చేసే విరాళాలు, ఫీజుల ద్వారా కూడా కొన్ని కోట్లు వసూలు చేశారు.

ఎన్నికల బాండ్లను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ ఇందులో కొన్ని లోపాలు ఉన్నాయని భావించారు. చంద్రచూడ్ అధ్యక్షతన ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఎన్నికల బాండ్ల వ్యవహారంపై విచారణ చేస్తున్నది. కార్పొరేట్లు, నల్ల కుబేరులు ప్రభుత్వంపై బలమైన పట్టుకలిగి ఉండి ఆర్థిక విధానాలను తమకు అనుకూలంగా మార్చేందుకు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేస్తున్నారు. ఈ పద్ధతిని అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రాల లోనూ అనుసరిస్తున్నారు. ఎన్నికైన ప్రభుత్వాలు పేద ప్రజలకు అవసరమైన చట్టాలను లేదా చర్యలను తీసుకోవడం చాలా పరిమితమైంది. ఉచిత రేషన్ వంటివి మాత్రమే పేదలకోసం ప్రవేశపెడుతున్నారు. అవసరం వచ్చినప్పుడు

**(మిగతా 21వ పేజీలో)**

# పతన విలువలతో పరిమళిస్తున్న ప్రజాస్వామ్యం!



- కె.శ్రీనివాస్

అన్నా వో వంద దాంక ఉంటావే.. అని ఆప్యాయంగా అడిగాడు ఆ సీనియర్ నాయకుడు, ఒక వర్ధమాన నాయకుడిని. ఆ సీనియర్ అప్పటికే వో వెయ్యి దాకా ఉంటాడు. 'అంతలేదు గాని, వో పదిరువై తక్కువ' అని చెప్పాడు జూనియర్, ఎదుగుతున్నాను సుమా, గుర్తించమన్నట్టు. ఈ సంభాషణ ఓ పదేళ్ల కిందట జరిగింది. ఇందులోని వందా వేయీ పదీ ఇరువై అన్నీ కోట్ల లెక్కలే. తెలంగాణ సమాజంలో ఆర్థికంగా ఎదుగుతున్న శ్రేణిలో పరస్పర కుశల ప్రశ్నలు, ఒకరినొకరు వేసుకునే అంచనాలూ 'సీఆర్ల'లోనే జరగడం అప్పటికే బాగా అలవాటయింది.

పోరాటాల గర్వాలు కారు స్టీరియోల్లోకి, స్విమ్మింగ్ పూళ్లు ఇళ్ల పెరళ్లలోకి ప్రవహించడం కూడా మొదలైపోయింది. ఎంత నిర్బంధమూ, కల్లోలమూ చేయలేని పని డబ్బు చేసింది. ఈ పదేళ్ల కాలంలో తెలంగాణ ఎగువ మధ్య తరగతి, ఆ పైని జన జీవితంలోకి ధనమూ విలాసమూ మధుమేహం లాగా ఆవరించాయి. అట్టడుగు మనుషులని మాత్రం మద్యం, సుషుప్తి, నిర్లిప్తత దెయ్యాల్లాగా పట్టుకున్నాయి. అధోజగత్తు ఎప్పుడూ ఉన్నది. జులాయితనమూ బాధ్యతారాహిత్యమూ కొత్తవేమీ కాదు. కానీ, అంతకుమించి ఏవో శక్తులు మనుషులని, సమాజాన్ని పతనంలోకి ఆకర్షిస్తున్నాయి. గొప్పచరిత్ర కలిగిన నేలలో ప్రలోభాన్ని, బానిసత్వాన్ని, నేరపూరిత లాలసత్వాన్ని విత్తనాలుగా చల్లుతున్నారు. బహుశా, అన్నిచోట్లా ఇదే పరిస్థితి కావచ్చు. సంస్కారాలు అడుగు ముట్టడం లోకమంతా ఉంది కాబోలు.

**ప్రభుత్వాలు వస్తాయి పోతాయి, నాయకులు గెలుస్తారు ఓడతారు, కానీ ప్రజలే కలుషితమయ్యే కాలం వచ్చినప్పుడు విషవృక్షాలే పెరుగుతాయి. అభివృద్ధి, సంక్షేమం, పథకాలు అంటూ వినిపించే పడికట్టు మాటల వెనుక రాజకీయమైన కపటత్వం, సాంస్కృతికమయిన డొల్లతనం ధ్వనిస్తూనే ఉంటాయి. ఎవరిని ఎన్నుకోవాలి జనం ? ఇంకా మూడు స్తంభాలాట సాగుతూనే ఉన్నది. ఎక్కడా గిట్టుబాటు కానప్పుడు నాలుగోదీ అయిదోదీ ఏదో ఒక పందిరి గుంజ అయినా దొరుకుతుంది. వంగి వంగి రంగు రంగుల శాలువాలు కప్పుకుని వీరికి మెడలు వంగిపోయాయి. ఈ అభ్యర్థులెవరికీ చిన్నపాటి కట్టుబాటు కూడా లేదు. ప్రజల కోసం ఫలానా మంచి పనిచేయాలన్న తపన లేదు. ఒక పార్టీ నుంచి దానికి పూర్తి వ్యతిరేకమైన పార్టీకి, ప్రాంతీయం నుంచి జాతీయానికి, అటూ ఇటూ కూడా దొర్లుకుంటూ వెళ్లగలరు. ఎటు వైపు దుంకాలో తేల్చుకోలేదంటూ గోడ మీదనే నిలబడి ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టగలరు. శాసనసభ్యులు అయితే ఏమి చేయాలో, ఏమి చేయగలరో కూడా వారికి తెలియదు. పార్టీ విధానాలు వాళ్లకు అక్కరలేదు. కొంత భూభాగంలో సామాజిక అధికారాన్ని, జనప్రాతినిధ్యం ద్వారా నిర్ణయాధికారాన్ని సమకూర్చుకుని, వాటిని ధనంలోకి, మరింత ధనంలోకి అనువాదం చేసుకోవడమొక్కటే వారి కార్యక్రమం.**

మునుపు సమకూర్చుకున్న వాటిని, మున్ముందు సంపాదించుకునే వాటిని కాపాడుకోవడమే అసలు లక్ష్యం. ప్రజల ఉమ్మడి సంపదకు కాపలాదారులుగా ఉండవలసిన వారు, కంచె చేను మేసినట్టు బలిసిపోవడమే రాజకీయంగా మారిపోయింది. ఎక్కడయినా ఉలిపికట్టెలు, మినహాయింపులూ ఉంటాయి కానీ, మొత్తం మీద దృశ్యం చూస్తే అన్నిపార్టీలలోనూ ఒకే పరిస్థితి. పార్టీల లోపల చూస్తే దాదాపు అందరూ ఒకే దాహంతో ఆవురావురుమంటున్నారు. అధికార భారత రాష్ట్ర సమితిలో వివిధ అంచెలనాయకుల ఆర్థిక, తదితర స్థితిగతులు గత పదేళ్లలో ఎంతగా పురోభివృద్ధి చెందాయో ఎవరన్నా పరిశోధిస్తే ఆసక్తికరమైన వాస్తవాలు బయటకు వస్తాయి. ప్రజలు వారి అనుభవం నుంచి, వారి కంటికి కనిపించే వాటి నుంచి ఏర్పరచుకున్న అభిప్రాయం మాత్రం స్పష్టమే. ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం ఆ నిష్పత్తిలో ఆవగింజంత కూడా పెరగలేదు. గొప్పగా చెప్పుకుంటున్న తలసరి ఆదాయంలో పెద్ద తలల సగటు వేరు. ఉద్యమ పార్టీగా అధికారంలోకి వచ్చిన చంద్రశేఖరరావు ఏ కారణం చేతనో, ప్రజల విచక్షణ మీద ఆధారపడే రాజకీయ స్పర్థను మొదటి నుంచి ఇష్టపడలేదు. 2014 మొదటి ఎన్నికలలో కూడా ఉద్యమం, రాష్ట్ర సాధన విజయం, చివరకు తన జనాకర్షణ గట్టెక్కించి తీరతాయని ఆయన గట్టిగా నమ్మ లేదు. సామాజిక సమీకరణలు సరే, ధన ప్రవాహమే విజయాలను గ్యారంటీ చేస్తుందని ఆయన

అనుకున్నారు. గెలిచే గుర్రాలను ఎంచుకుని తన దొడ్లో కట్టేసుకున్నారు. తక్కువ పడిన బలాన్ని కొనుక్కున్నారు. ప్రజలకు తనకూ మధ్య సంక్షేమ సంబంధం ఉంటే చాలు అనుకున్నారు. ఈ ఆలోచనా చక్రం 2018 ఎన్నికలలో, ఆ తరువాత ఉప ఎన్నికలలో డబ్బు ఏరులై ప్రవహించడానికి కారణమైంది. ఓటుకు రేటు భారీగా పెరగడమే తెలంగాణ సాధించిన గొప్ప తలసరి విలువ. విధాన అంశాల మీద ప్రజలను ఒప్పించి గెలుచుకోవడం కాక, ఆశ పెట్టడం, ఆవేశాలను రగిలించడమే పరిపాలనగా మారింది. ప్రశ్నించే గొంతులను, ఉద్యమ సహచరులను నయానో భయానో నోరుమూయించాక, తక్కిన ప్రజానీకాన్ని జోలపాడి నిద్రపుచ్చడం తేలికైంది. ఇంతగా చెడ్డా, బీఆర్ఎస్ పాలనలో కొంత మంచి జరిగింది. అయితే, అది పాలకుడు దయదలిచి చేసిన మంచి తప్ప, ప్రజల భాగస్వామ్యంతో జరిగిన మంచి కాదు. నగదు బదిలీ పథకాలను ఉధృతంగా అమలు చేస్తున్న రాష్ట్రాలలో ఒకటిగా ఉన్న తెలంగాణ, మరే దీర్ఘకాలిక, మౌలిక ప్రాజెక్టులు, కార్యక్రమాలు చేపట్టలేని దుస్థితిలో పడిపోయింది.

ఈ సారి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అవే సంక్షేమ నగదు బదిలీ వాగ్దానాలను, మరికొన్ని జోడించి, రంగంలోకి దిగింది. వాగ్దానాలైతే చేయగలదు కానీ, కాంగ్రెస్ తెలంగాణ తలసరి ఓటు బేరాన్ని తట్టుకోగలదా? తెలంగాణ ఉద్యమ కాలంలోను, ప్రత్యేక రాష్ట్రంలోని తొలి రెండు ప్రభుత్వాల హయాంలోను కూడా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితితో పోటీ పడలేకపోయింది. తమ హైకమాండే అనుకూలంగా ఉన్నప్పుడు, క్షేత్రస్థాయిలో మరింత విజృంభించి ఉద్యమ నాయకత్వాన్ని చేతిలోకి తీసుకుని ఉండవలసింది, రాష్ట్రం వచ్చాక అది ఇచ్చింది తామేనని బలంగా చెప్పుకుని ఉండవలసింది. అన్నిటికి మించి కాంగ్రెస్ జెండా కింద ఉన్న వారు అంత సులువుగా అమ్ముడుపోకుండా ఉండవలసింది. ఇప్పుడు తమకు తెలంగాణ గెలుపు ప్రాణావసరం కాబట్టి, అంగ అర్థ బలాలున్న వాళ్లను నేరుగా పేరా గ్లైడర్లతో రంగం మీదకు దింపుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న 'పెద్ద' వ్యక్తులను చూస్తుంటే, వీరందరికి చివరి నిమిషంలో టికెట్లు ఎట్లా దొరుకుతున్నాయో అర్థం కాదు. కొన్నిస్థానాలలో ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవడం ఎందుకంటే, ఆయాచోట్ల ఎవరో ఫిరాయింపు కోసం మీన మేషాలు లెక్క బెడుతున్నారన్న మాట! ఇటువంటి విలువలున్న వాళ్లు, బీఆర్ఎస్‌కు ఒకటీ అరా తక్కువ పడితే, అటువైపు దూకుతారు కదా? అయినా ఈ పాత దొరలంతా కలిసి దొరల తెలంగాణ స్థానంలో ప్రజల తెలంగాణ ఎట్లా తెస్తారు? బీసీలకు ఎక్కువ సీట్లు అని చెప్పి మొండిచెయ్యి చూపడం, ఉద్యమ కారులకు కనీస ప్రాతినిధ్యం లేకపోవడం, పొత్తు కుదడానికి సిద్ధంగా ఉన్న కమ్యూనిస్టుల స్థానాల్లోనే చివరి నిమిషపు అభ్యర్థులను దించడం.. ఇవన్నీ అధిష్ఠానానికి తెలియకుండానే జరుగుతున్నాయని అనుకోవడానికి లేదు. కొత్తగా చేరుతున్న వారు పార్టీకి బాగా 'సహాయ'పడబోతున్నారట. ఎట్లాగో అట్లాగ గెలవడమే ముఖ్యమైనప్పుడు, పరిణామాలు ఇట్లాగే ఉంటాయి! బీఆర్ఎస్ అభ్యర్థులను చాలా ముందుగానే ప్రకటించారు. దాని వెనుక కేసీఆర్ ముందుజాగ్రత్త ఏదో ఉండవచ్చు. కానీ, ఎంపికైన కొందరు అభ్యర్థులు తమకు లభించిన అదనపు సమయాన్ని అనేక విధాలుగా సద్వినియోగం చేసుకుంటున్నారట. అందులో ముఖ్యమైనపని ప్రత్యర్థులను ఎంచుకోవడం. తమ మీద ఏ అభ్యర్థి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే తమకు సదుపాయంగా ఉంటుందో గుర్తించి, వారికి టికెట్ రావడానికి వీళ్లు ప్రయత్నిస్తారన్నమాట. ప్రత్యర్థి గెలిస్తే, ఆ పార్టీలోకి పోవడానికి ఒక దారి ఉంటుంది. ప్రత్యర్థి ఓడిపోతే, అతన్ని తన పార్టీలోకి తీసుకు వెళ్లవచ్చు.

కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మారిపోయింది, కట్టుదిట్టంగా ఉంటోంది. రేవంత్‌రెడ్డి సిఫార్సులు కూడా పనిచేయవు అంటున్నారు కదా అన్న ప్రశ్నలు రావచ్చు. కానీ, అంతమాత్రం తెలియదా, పేరా గ్లైడింగ్ మార్గం ఉంటుంది కదా అని వాళ్లు జాలిగా నవ్వుతారు. ఏ పార్టీ నుంచి గెలిచినా అధికారపార్టీయే అంతిమ లక్ష్యంగా తెలంగాణ రాజకీయ వర్గం పనిచేస్తుందని తెలిసి మనం ఆనందపడవచ్చు. కనుగోలు జాబితాలకు, కొనుగోళ్ల జాబితాకు నడుమ రేఖ చెదిరిపోయిందని అనుమానపడవచ్చు! కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మధ్య లోలకాల్లా తిరుగుతున్న రాజకీయ నేతల్లో చాలా మంది కొంత కాలం పాటు బీజేపీలో తమను తాము పార్క్ చేసుకున్నారు. ప్రయాస పడి అవినీతి భారం మోస్తున్న వారిని తమ వద్దకు రమ్మని, ప్రశాంతిని కలుగజేతునని అచ్ఛేదిన్ స్వచ్ఛ రాజకీయాల పార్టీ వాళ్లను ఆహ్వానించడమే అన్యాయం. వాళ్లు ఏ పార్టీలోకి అయినా ఎందుకు వస్తారో తెలుసును కదా, ఆ అధికారాన్నే వాళ్లకు దూరం చేస్తే ఎట్లా? గెలిచే అవకాశం ఎట్లాగూ లేదు కానీ, కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వకూడదని బీజేపీ స్వయంగా నిర్ణయించుకున్నదని తెలిసే సరికి, ధైర్యం చేసి వాళ్లు రామ్ రామ్ చెబుతున్నారు. ఈడీ, సీబీఐ, ఎన్ఐఏల భయం ఉన్నప్పటికీ, గెలువు జీవుడా అంటూ కొత్త గమ్యాలు చేరుకుంటున్నారు.

**వీళ్ల చేతిలో రాష్ట్రాల భవితవ్యం, దేశ భద్రత సురక్షితంగా ఉంటాయా ? పతనమైపోయిన, కుళ్లిపోయిన, దుర్గంధ భూయిష్ఠమైన ఇటువంటి రాజకీయ వేదికల నుంచి ఏవేవో అద్భుతాలను ఇంకా ఆశిస్తూనే ఉన్నాము. ఈ చెత్తలో నుంచే, కాసింత మెరుగైన చెత్త కోసం చూస్తున్నాము. గత్యంతరం లేదు మరి.** ❑

# ఒకే దేశం - ఒకే ఎలక్షన్



- కేశవ్

ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదం నేడు వినిపిస్తోంది. వినడానికి వినసొంపుగా ఉంది. గతంలో ఒకే దేశం–ఒకే పన్ను అని నిరంతరంగా నినాదం అందించి ప్రజల మెదళ్లను అలా మలచి జీఎస్టీ పరిధిలోకి రాష్ట్రాలను తీసుకొచ్చారు. వివిధ రాష్ట్రాల అమ్మకం పన్నులను రద్దు చేసి దేశం మొత్తం జీఎస్టీ పరిధిలోకి వివిధ స్లాబ్‌ల ద్వారా తీసుకొచ్చారు. ఇదేదో గొప్ప కార్యమని 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో ఎవరూ ముందుకు రాలేదని, ఎవరికీ ఇలాంటి ఆలోచన రాలేదనీ, ఒకే ఒక్క నాయకుడికి ఇలాంటి మంచి ఆలోచనలు వస్తాయని ప్రజలకు నూరిపోశారు. మార్పు అవసరమే. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవస్థలో మార్పులు ఎవరు కాదన్నారు? అయితే, ఈ మార్పులు ఎవరికి మేలు చేస్తాయి? జీఎస్టీ వచ్చిన తర్వాత సాధారణ ప్రజలకు ఏం మేలు జరిగింది? సరుకుల ధరలు ఏమైనా తగ్గాయా? దుంపలైనా, టమాటోలైనా, ఉల్లిపాయలైనా, ఏవైనా సేవల్లో అయినా ధరలు తగ్గాయా? సాధారణ మనిషికి జీఎస్టీకి ముందూ, జీఎస్టీ తర్వాతా ఏ రకమైన జీవితం ఉంది? అందులో తేడా ఏమైనా కనిపించిందా? మెరుగైన జీవితమేదైనా కనిపించిందా? ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే ఏమీ తేడా లేదు. ఇది కేవలం కార్పొరేట్ వర్గం మేలు కోసం చిన్నచిన్న వ్యాపార వర్గాలను దెబ్బ తీయడానికి ఏర్పాటు చేసుకున్న ఒక వ్యూహం. రాష్ట్రాలు కేంద్రం మీద ఆధారపడేలా చేశాయి. సరిగ్గా ఎన్నికల విషయంలో కూడా ఇలాంటి అర్థంపర్థం లేని ప్రతిపాదన నడుస్తోంది. అదేదో పెద్ద విప్లవాత్మకమైన మార్పు అనీ, ఎన్నికల ఖర్చు విపరీతంగా తగ్గిపోతుందనీ, ఆదా అయిన డబ్బుతో పేద ప్రజలకు ఎంతో మేలు చేయొచ్చని, ఇంతకు ముందు ఎవరికీ ఇలాంటి ఆలోచన రాలేదనీ, ఒకే ఒక్క నాయకుడికి మాత్రమే ఇలాంటి మంచి ఆలోచనలు వస్తుంటాయని ప్రజలకు నమ్మించే ప్రయత్నాలు ఆరంభమయ్యాయి.

ఎన్నికలు ఒక్కసారి జరగాలో, వేరువేరుగా జరగాలో మాట్లాడే ముందు భారత రాజ్యాంగం స్వభావం ఎలాంటిది అనే ప్రశ్న రావాలి కదా. భారత రాజ్యాంగం ఫెడరల్ రాజ్యాంగం. ఇక్కడ కేంద్రం పని కేంద్రం చేస్తుంది. రాష్ట్రాల పనులు రాష్ట్రాలు చేస్తాయి. అధికారాలు కేంద్రానికీ ఉన్నాయి. అధికారాలు రాష్ట్రాలకూ ఉన్నాయి. ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ ఉంది. ఎక్కడ, ఎలా, ఎప్పుడు ఎన్నికలు నిర్వహించాలో ఎన్నికల కమిషన్‌కు తెలుసు. దశాబ్దాల అనుభవం ఉంది. మరి ఆకస్మాత్తుగా కేంద్ర ప్రభుత్వానికి ఎందుకీ సమస్య ? ఒకేసారి ఎన్నికలు జీఎస్టీలాగా అమలు చేశారు అనుకుందాం. 2024 నుండి మొత్తం భారతదేశంలో ఒకేసారి ఎన్నికలు జరిపి ప్రభుత్వాలను ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసింది అనుకుందాం. 2029 వరకు నడుస్తాయని ఒక ఊహగా అనుకుందాం. మరి, అంతలోగా కేంద్రంలో అవిశ్వాస తీర్మానం వచ్చి కేంద్ర ప్రభుత్వం 2026లో పడిపోయిందనుకుందాం. అప్పుడేం చేస్తారు? కేంద్రంలో ప్రభుత్వం లేకుండా, పార్లమెంట్ లేకుండా 2029 వరకు ప్రెసిడెంట్ రూల్ నడుపుతారా? లేక, మళ్ళీ దేశం మొత్తం ఎన్నికలు నిర్వహిస్తారా? ఇదే సంఘటన ఏదైనా రాష్ట్రంలో కూడా రావచ్చు కదా. ఫలానా ఎక్స్ వై జెడ్ రాష్ట్రంలో అవిశ్వాస తీర్మానం వచ్చి ఆ రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయిందనుకుందాం. మరి ఆ రాష్ట్రానికి 2029 వరకు వేచి ఉండ మంటారా? అసెంబ్లీ రద్దు చేసి గవర్నర్‌కి అధికారాలు ఇచ్చేసి 2029 వరకు నడుపుతారా? లేదా, ఒకే దేశం.. ఒకే ఎన్నిక అని మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా?. నోట్ల రద్దు చర్యల్లో మనం ఏం చూసామో అదే ఇక్కడ చూస్తాం కదా. లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రానికి సంబంధించిన అంశాలు డామినేట్ చేస్తాయి. రాష్ట్రాల ఎన్నికల్లో రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు డామినేట్ చేస్తాయి. మరి అన్నీ ఒకే గాటిన కట్టేసి ఎన్నికలు నిర్వహిస్తే ఏ అంశాలు డామినేట్ అవుతాయి? కేంద్రానికి ఉన్న ఆర్థిక బలం, మీడియా బలం వల్ల కేంద్రానికి సంబంధించిన అంశాలే డామినేట్ అవుతాయి. ఎంచక్కా దేశం మొత్తం మీద ఒకే దేశం.. ఒకేపార్టీ అని విజయ పతాకాన్ని ఎగరేయొచ్చు కదా. ప్రతిపక్షం దేశం మొత్తం మీద ఎక్కడా ఏ అంగుళంలో కూడా లేకుండా చేయొచ్చు కదా. కాబట్టి, ఇది ఏదో తొందరగా చేపట్టిన చర్య కాదు. చాలా ప్రణాళికతో పావులను కదిపిస్తున్నారు. దేశం మొత్తం తమ భుజస్కందాల్లోకి తీసుకొని రాజ్యాంగం మార్చేసే ప్రయత్నం. ఇప్పుడు కనీసంగానైనా మనం రాజ్యాంగం ద్వారా అనుభవిస్తున్న ప్రాథమిక హక్కుల్ని మింగేయాలి అన్న తహతహ. ప్రత్యర్థి ఉండని ప్రజాస్వామ్యమా? ఒక నాయకుడికి విపరీతంగా పాపులారిటీ పెంచేస్తూ మీడియా భజన చేస్తున్నప్పుడు, ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో మనం ఊహించవచ్చు. రాష్ట్రాల ఫెడరల్ స్వభావం పూర్తిస్థాయిలో దెబ్బతింటుంది. ఎంచక్కా దేశాన్ని ఒకే ఒక్క పెన్ స్ట్రోక్‌తో హిందూ రాష్ట్రంగా మార్చేసే కుటిల ప్రయత్నం కాదా ? మైనారిటీలను పక్కకు తోసెయ్యడం మరింత సులభం అవుతుంది వీరికి. చైతన్యం కావాల్సిన అవసరం ఉందనే ఉంది. ❑

# మన కళ్ల ముందే కూలిపోతున్న ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామ్యం ?



-కె.రామచంద్రమూర్తి

భారత ప్రజాస్వామ్యంపైన నరేంద్రమోదీ చేస్తున్న దాడిని వివరిస్తానంటూ అమెరికా జర్నలిస్టు జాక్ బ్యూచాంప్ సుదీర్ఘమైన వ్యాసాన్ని 'వాక్స్ డాట్ కామ్' లో 21 జూన్ 2023న రాశాడు. 'వాక్స్'లో జాక్ బ్యూచాంప్ సీనియర్ జర్నలిస్టు. అమెరికా లోపలా, బయటా భావజాలానికీ, ప్రజాస్వామ్యానికీ విపత్తు కలిగిందని తాను భావించినప్పుడు కలం దూస్తాడు. 2014లో 'వాక్స్' వెబ్‌సైట్‌లో చేరడానికి ముందు 'టీపీ ఐడియాస్' అనే రాజకీయ ప్రపంచంలో ఆలోచనలు పంచుకునే వెబ్‌సైట్‌లో పనిచేసేవాడు.

అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో అధ్యక్షుడు బైడెన్, ఆయన భార్య జిల్ బైడెన్‌తో కలిసి రాత్రి పూట భోజనం(డిన్నర్) ఆరగించడం అంటే తమాషా కాదు. బైడెన్ అధ్యక్ష భవనమైన శ్వేత భవనంలో (వైట్‌హౌస్)లో ప్రవేశించిన తర్వాత ఫ్రాన్స్, దక్షిన కొరియా అధ్యక్షులకు మాత్రమే ఈ గౌరవం ఇచ్చారు. వాతావరణం గురించి, ఇండో–పెసిఫిక్ పరిస్థితి(చైనా) గురించీ, ఇంకా చాలా విషయాలు బైడెన్, నరేంద్రమోదీ మాట్లాడుకొని ఉంటారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుకుంటారని కానీ, మాట్లాడుకున్నారని కానీ శ్వేత భవనం ప్రతినిధి చెప్పలేదు.

నరేంద్రమోదీ 2014లో ప్రధాని అయినప్పటి నుంచి, ప్రధానంగా 2019లో రెండోసారి గెలిచినప్పటి నుంచి, భారత ప్రజాస్వామ్య వ్యవస్థపైన ఒత్తిడి ఎక్కువయింది. మోదీ ప్రభుత్వం ఎన్నికల పర్యవేక్షణ వ్యవస్థను బలహీనపరిచింది. తనకు అనుకూలంగా తీర్పులు ఇచ్చే విధంగా న్యాయమూర్తులను సుముఖం చేసుకున్నది. చట్టాన్ని అమలుచేసే సంస్థలను ప్రత్యర్థులపైన ప్రయోగించడం నేర్చుకున్నది. భారత మీడియా వ్యవస్థపైన అదుపు సాధించింది.

**కడచిన ఒక్క సంవత్సరంలోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ కింద పేర్కొన్న పనులు చేసింది**

- ప్రధానిపైన ఏదో సరదాగా జోక్ చేసినందుకు ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీకి రెండేళ్ళ జైలు శిక్ష విధించి, పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయించింది.
- కుయుక్తులలో నిష్ణాతుడైన బడా పారిశ్రామికవేత్త (అదానీ) చేత అంత వరకూ స్వతంత్రంగా వ్యవహరిస్తున్న టీవీ చానల్ (ఎన్‌డీ టీవీ)ని కొనుగోలు చేయించింది.
- ప్రభుత్వాన్ని విమర్శించే పోస్టింగులను సోషల్ మీడియా నుంచి తొలగించేందు నిఘా సంఘాన్ని నియమించింది.
- ఢిల్లీ, ముంబయ్‌లలో బీబీసీ కార్యాలయాలపై చట్టాలను అమలు చేసే సంస్థల చేత దాడులు చేయించారు. మోదీని విమర్శిస్తూ డాక్యుమెంటరీ నిర్మించి ప్రదర్శించినందుకు బీబీసీపైన కక్ష తీసుకోవడానికే దాడులు జరిగాయని ప్రజలు చెప్పుకున్నారు.

అధికారంలో ఉండడం వల్ల మోదీ శక్తి పెరిగింది. ఎన్నికలలో విజయాలను ప్రత్యర్థుల నోళ్ళు మూయించేం దుకు వినియోగించుకోవడంలో భారతీయ జనతా పార్టీ ప్రావీణ్యం సంపాదించింది.

2024లో జరగబోయే పార్లమెంటు ఎన్నికలలో కూడా గెలుపు ప్రతిపక్షాలకు అసాధ్యమయ్యే విధంగా పావులు కదిపుతోంది. భారత ప్రజాస్వామ్యానికి ప్రాణభిక్ష పెట్టే ఓటు ఏమి చేస్తుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

**"ప్రతి పెద్ద ఎన్నికలలో ఓటమితో ప్రతిపక్షానికి కిటికీ మూసుకుపోతున్నది" అని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో రాజకీయ శాస్త్రజ్ఞుడు పవిత్ర సూర్యనారాయణ వ్యాఖ్యానించారు.**

ప్రజాస్వామ్యంపైన పడుతున్న ప్రహారం భావజాలపరమైనది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఎన్నికల విభాగం బీజేపీ. ఆర్ఎస్ఎస్ హిందూత్వవాదాన్ని అమలు చేయాలని గట్టిగా కోరుకుంటున్న సంస్థ. మోదీ ఎనిమిదేళ్ళ వయస్సులోనే ఆర్ఎస్ఎస్ సభ్యుడిగా చేరారని ఫ్రాన్స్‌కు చెందిన రాజకీయశాస్త్ర ఆచార్యుడు క్రిస్టోఫే జెఫ్రిలాట్ నాకు చెప్పారు.

హంగరీలో ప్రజాస్వామ్య వ్యవస్థ కుంగిపోయినప్పుడు అంతర్జాతీయంగా చేసిన హడావుడికంటే అధికంగా ఇండియా వంటి పెద్ద దేశంలో (జనాభా ప్రకారం ప్రపంచంలో అతిపెద్ద దేశం) ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లినప్పుడు హాహాకారాలు వినిపించాలి. కానీ ఇండియా భౌగోళికంగా ఉన్న పరిస్థితుల కారణంగా ఆ దేశంపైన ప్రపంచ ప్రజాస్వామిక దేశాలు విమర్శలు అంతగా చేయడం లేదు. ఎదుగుతున్న చైనాను అదుపు చేయడానికి ఇండియాను ఉపయోగించుకోవాలన్న లక్ష్యంతో అమెరికా, పసిఫిక్ సముద్రతీర దేశాలు చూసీ చూడనట్టు నటిస్తున్నాయి.

ఇండియాలో ప్రజాస్వామ్య వ్యవస్థకు జరుగుతున్న అపకారాన్ని

గురించి మాట్లాడటం మోదీకి ఇబ్బందికరంగా పరిణమిస్తుంది కనుక మాట్లాడకుండా ఉండటమే మేలని అమెరికన్ ఎంటర్ ప్రైజ్ ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్ ఫెలోగా పని చేస్తున్న సదానంద్ ధూమే వ్యాఖ్యానించారు.

గుజరాత్‌లో 2002లో ముస్లింలపైన జరిగిన దాడులను ప్రోత్సహించారన్న అభిప్రాయంతో నరేంద్రమోదీ అమెరికాలో అడుగు పెట్టటాన్ని 2005లో నిషేధించారు. ఇప్పుడు ఆయన అమెరికాలో అత్యంత విలువైన అతిథి.

భారత ప్రజాస్వామ్యంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభాన్ని అర్థం చేసుకోవాలంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ గురించి తెలుసు కోవాలి. ఒకప్పుడు గాంధీ నాయకత్వంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కుదురుకున్న రాజకీయ పార్టీ బీజేపీ. దాని వెనుక దన్ను, సిద్ధాంత బలం కలిగిన ఆర్ఎస్ఎస్. కాంగ్రెస్ ఉదారవాద లౌకిక వ్యవస్థను కోరుకుంటే ఆర్ఎస్ఎస్ హిందూ మతవాదాన్ని అనుసరించే భారతదేశాన్ని అపేక్షిస్తున్నది. హిందువుల కోసం, హిందువులు పాలించే 'హిందూ రాష్ట్ర' కావాలని ఆర్ఎస్ఎస్ అభిప్రాయం.

### గోల్వాల్కర్

ఆర్ఎస్ఎస్ నాయకుడు ఎంఎస్ గోల్వాల్కర్ 'మన జాతీయతా నిర్వచనం(అవర్ నేషన్ హుడ్ డిఫైన్డ్)" అనే పుస్తకాన్ని 1939లో రాశారు. "హిందుస్థాన్‌లో ఉన్న విదేశీ జాతులు హిందూ జాతిలో విలీనం కావాలి. ప్రత్యేక ప్రతిపత్తి వాటికి ఉండదు. సాధారణ పౌరులకు ఉండే అధికారాలు కూడా లేకుండా ద్వితీయ శ్రేణి పౌరులుగా వారు బతకాలి" అని రాశారు. ఈ పుస్తకాన్ని ఆర్ఎస్ఎస్ బైబిల్ (పవిత్ర గ్రంథం) గా పిలుస్తారు. జర్మనీలో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీలు ప్రవర్తించిన తీరును గోల్వాల్కర్ ప్రశంసించారు. విభిన్న జాతులు కలిసి మెలసి జీవించడం అసాధ్యమని జర్మన్ అనుభవం స్పష్టం చేస్తున్నదనీ, భారతీయులు జర్మనీ అనుభవం నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలని గోల్వాల్కర్ సందేశం ఇచ్చారు.

వలస పాలన నుంచి విముక్తి పొందిన భారతదేశంలో అటువంటి ఆలోచన చేసే వారి సంఖ్య చాలా తక్కువగా ఉండేది. దేశానికి 1949లో అందజేసిన రాజ్యాంగం లౌకిక వాదానికి పెద్దపీట వేసింది. మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం ఆధారంగా రాజ్యం పౌరుల పట్ల వివక్ష ప్రదర్శించదు అని రాజ్యాంగం హామీ ఇచ్చింది.

ఈ రాజకీయ అవగాహనను భ్రష్టు పట్టించేందుకు ఆర్ఎస్ఎస్ అవిశ్రాంతంగా పనిచేసింది. 1948లో నాథూరామ్ గాడ్సే గాంధీని హత్యచేశాడు. ఇందుకు ప్రేరణ వచ్చింది హిందూత్వ సంస్థ నుంచేనని గాడ్సేనే స్వయంగా చెప్పాడు. భారత ప్రభుత్వం ఆర్ఎస్ఎస్‌ను ఒక సంవత్సరం బహిష్కరించింది. ఈ నీడలో నుంచి ఆర్ఎస్ఎస్ బయటకు వచ్చిన తర్వాత కూడా చాలా సంవత్సరాలు కాంగ్రెస్ ఆధిక్యం కొనసాగింది. 1977 వరకూ దేశంలో జరిగిన ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్ గెలుపొందింది (తమిళనాడులో మినహా. ఆ రాష్ట్రంలో డీఎంకే కాంగ్రెస్‌ను 1967లో ఓడించింది). ఆర్ఎస్ఎస్ రాజకీయ అంగమైన బీజేపీ ఓటు శాతం పది దాటలేదు.

జనసంఘ్ అవతారం చాలించి జనతా పార్టీలో విలీనమైన అనంతరం జనతా చీలినప్పుడు పాత జనసంఘ్ భారతీయ జనతా పార్టీ(బీజేపీ)గా కొత్త అవతారం ఎత్తింది. విష్ణువు ఏడవ అవతారమైన రాముడి గుడి బాబరీ మసీదు కింద ఉన్నదంటూ బీజేపీ హడావిడి చేసి ప్రజల దృష్టిని ఆకర్షించింది. అప్పుడున్న కాంగ్రెస్ వ్యవస్థ హిందువుల కంటే ముస్లింలకు ప్రాధాన్యం ఇస్తున్నదని ప్రచారం చేయడానికి బాబ్రీ మసీదు వివాదాన్ని వినియోగించుకోవచ్చునని బీజేపీ నిర్ణయించుకున్నది. ఈ విభజన ప్రచారం పనిచేసింది. 1984లో లోక్‌సభలో కేవలం రెండు స్థానాలు మాత్రమే గెలుచుకున్న బీజేపీ 1989నాటికి మొత్తం 543 లోక్‌సభ స్థానాలలో 85 స్థానాలను కైవసం చేసుకున్నది.

బీజేపీ 1998లో తొలి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అప్పటి బీజేపీ నాయకత్వంలోని నేషనల్ డెమాక్రాటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ) ప్రభుత్వం వాజపేయి నేతృత్వంలో సజావుగా నడిచింది. భారతదేశం వంటి భిన్నత్వం కలిగిన పెద్ద దేశాన్ని పాలించాలంటే ఏ పార్టీ అయినా ఉదారంగా వ్యవహరించాల్సి ఉంటుందని అనుకున్నారని బ్రౌన్ విశ్వ విద్యాలయానికి చెందిన అశుతోష్ వర్షణే అన్నారు.

**ప్రభుత్వాలు మధ్యస్థంగానే (సెంట్రిస్) ఉండాలనడానికి రెండు కారణాలను అశుతోష్ చెప్పారు. ఇండియా బహు వైవిధ్య భరితమైన దేశం అన్నది మొదటి కారణం. ఈ దేశంలో 22 అధికార భాషలు ఉన్నాయి. 705 జాతులు అధికారికంగా గుర్తింపు పొందినవి ఉన్నాయి. ఆరు పెద్ద మైనారిటీ మతాలు ఉన్నాయి. వేల వర్గాలుగా సమాజాన్ని చీల్చగల కుల వ్యవస్థ ఉండనే ఉన్నది. ఇటువంటి విభజనలతో కూడిన సమాజాన్ని పరిపాలించాలంటే చాలా విషయాలలో రాజీ పడక తప్పదు.**

**రెండవ కారణం ఏమంటే అధికారంలో ఉన్న పార్టీ లేదా కూటమిపైన అనేక విధాలైన నియంత్రణలు ఉంటాయి. ప్రభుత్వాలు యథేచ్ఛగా పని చేయడానికీ, నిర్ణయాలు అమలు చేయడానికీ వీలు లేదు. భారత ప్రభుత్వ స్వభావాన్ని మార్చడం కరుడుకట్టిన బీజేపీ ప్రభుత్వం వల్ల కూడా కాదు.**

అయితే, బీజేపీ నాయకులూ, కార్యకర్తలూ హిందూత్వ భావజాలాన్ని ప్రేమిస్తారని మరచిపోరాదు. గోల్వాల్కర్ రాసిన

విషయాలతో ఏకీభవించబోమని ఆర్ఎస్ఎస్ 2006లో ప్రకటన చేసినప్పటికీ ఆయన అభిలషించిన హిందూరాష్ట్ర సిద్ధాంతమే ఆర్ఎస్ఎస్ ప్రతిపాదిస్తున్నది. "భావజాలం మారలేదు. హిందువులు అధికులనే భావనలో వారున్నారు. ఇతరులను హీనంగా చూడడం వారి అభిమతం" అని జెఫ్రెలాట్ వ్యాఖ్యానించారు.

**ఇటువంటి విశ్వాసం ఉన్నవారిలో నరేంద్రమోదీ అగ్రగణ్యుడు.**

నరేంద్రమోదీ ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న కాలంలో 2002లో ముస్లిం జనాభా ఎక్కువగా నివసించే గోధ్రా ప్రాంతంలో సబర్మతీ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు తగలబడి 59 మంది మరణించారు. దానికి ముస్లింలు కారణమని నిందించారు. గుజరాత్ రాష్ట్రం అంతటా హిందువులు ముస్లింలపైన దాడులు చేశారు. (రైలు తగలబడింది ప్రమావశాత్తు అని భారత ప్రభుత్వం జరిపించిన పరిశోధనలో తర్వాత తేలింది). గుజరాత్ మత కలహాలలో కనీసం రెండు వేల మంది చనిపోయి ఉంటారని మానవ హక్కుల నేతల అంచనా. ఈ హింసాకాండలో భాగంగా 250 నుంచి 330 మంది ముస్లిం బాలికలనూ, మహిళలనూ మానభంగం చేసి హింసించారనీ, అనంతరం చంపివేశారనీ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక పేర్కొన్నది.

ముస్లింలపైన దాడులు చేస్తున్న వారికి అనుకూలంగా మోదీ జోక్యం చేసుకున్నారనేది ఆరోపణ. ముస్లిం మెజారిటీ ఉన్న ప్రాంతాలలో హిందూ మూకలను స్వైర విహారం చేయడానికి అనుమతించాలని పోలీసులతో చెప్పారని అభియోగం. 'మత పరమైన స్వేచ్ఛను ఉల్లంఘించారు" కనుక మోదీకి అమెరికా వీసా ఇవ్వరాదని అమెరికా ప్రభుత్వం 2005లో నిర్ణయించింది. జనాకర్షణ కలిగిన మోదీ రాహుల్ నాయకత్వంలోని అవినీతి భరితమైన, అసమర్థమైన కాంగ్రెస్ పార్టీని 2014లో ఓడించి అధికారంలోకి వచ్చారు. మోదీ ప్రధాని అయిన తర్వాత వీసా నిషేధాన్ని అమెరికా ప్రభుత్వం ఎత్తివేసింది.

ప్రధాని అయిన తర్వాత మోదీకి మౌలికమైన సవాలు కట్టెదుట నిలిచింది. మధ్యేమార్గంగా ప్రభుత్వం వ్యవహరించే విధంగా పరిమితులు ఉన్నప్పుడు తన హిందూత్వ అజెండాను ఎట్లా అమలు చేయాలన్నది ప్రశ్న. ఆ పరిమితులను తొలగించడం ఒక్కటే మార్గం. ఆయన ఎంచుకున్న వ్యూహం భారత ప్రజాస్వామ్య హృదయాన్ని గాయపరుస్తుంది.

**లౌకికవాదానికి అపకారం**

భారత లౌకికవాదాన్నీ, ప్రజాస్వామ్యాన్ని మోదీ కాలరాశారు.

మోదీ ఇండియాలో ఏమి చేశారో అర్థం చేసుకోవాలంటే రెండు అజెండాలను కలిపి అమలు జరిపితే ఏమి అవుతుందో ఊహిస్తే చాలు. ఒక అజెండా మరో అజెండాకు శక్తి ప్రసాదిస్తుంది.

మొదటి అజెండా ఏమంటే ప్రధాన మంత్రిగా హిందూత్వ సిద్ధాంతాన్ని ప్రచారం చేసి హిందువులు – ముస్లింలుగా సమాజాన్నీ, ఓటర్లనూ విభజించడం. న్యాయవ్యవస్థ, పర్యవేక్షక సంస్థలు, స్వేచ్ఛాయుతమైన మీడియా, ప్రతిపక్షాలను బలహీన పరిచే విధంగా తన చేతుల్లో సర్వశక్తులనూ కేంద్రీకృతం చేసుకోవడం రెండో అజెండా.

హిందువులలో ఎంత మంది తన హిందూత్వ వాదాన్ని ఆమోదిస్తారో మోదీ ప్రాబల్యం అంతగా పెరుగుతుంది. ఫలితంగా న్యాయమూర్తులపైనా, ఉన్నతాధికారులపైనా, విలేఖరులపైన యథేచ్ఛగా దాడులు కొనసాగడానికి అవసరమైన శక్తిసామర్థ్యాలు సమకూరుతాయి. ప్రభుత్వాధికారాలనూ, మీడియాను తన గుప్పెటలో ఎంత గట్టిగా బంధిస్తే అంత తేలికగా హిందూత్వ వాదనను ప్రచారం చేయవచ్చు.

ఈ అజెండాల అమలు ఫలితంగా ప్రభుత్వాలు మధ్యస్థంగా వ్యవహరించాలనే నియమం నీరుగారి పోతుంది. అధికారపార్టీకి అనుకూలమైన వ్యవస్థలో ఎన్నికలు జరుగుతూ ఉంటాయి. అధికార పార్టీ గెలుస్తూ ఉంటుంది. ప్రతిపక్షం నిర్వీర్యం అవుతూ వస్తుంది.

మోదీ ఎదుగుదలకు ముందు బీజేపీ ఎన్నికల విజయాలు పరిమితమైనవి. సమాజంలో సంపన్నులూ, కాషాయపార్టీ ఆర్థిక విధానాలనూ, సామాజిక ధోరణులనూ సమర్థించేవారు మాత్రమే బీజేపీకి ఓటు చేసేవారు. విద్యాసంస్థలలోనూ, ప్రభుత్వ ఉద్యోగాలలోనూ రిజర్వేషన్లు అమలు చేసి చారిత్రకంగా పీడనకు గురైనవర్గాల సంక్షేమం కోసం కొనసాగుతున్న ప్రయత్నాలను సహించని అగ్రవర్ణాలవారిలో కొందరు బీజేపీ సమర్థకులలో ఉన్నారు. కులవ్యవస్థను రూపుమాపడానికి జరిగే ప్రయత్నాలనూ, రిజర్వేషన్లనూ బీజేపీ వ్యతిరేకిస్తుంది.

మోదీ హయాంలో బీజేపీ పేద, నిమ్నవర్గాల హిందువులలో కొంతవరకూ వేళ్ళూనింది. కానీ దాని అసలు పునాది అయిన అగ్రవర్ణాలను వదులుకోలేదు. 2019 నాటికి పేద హిందువులు కూడా సంపన్న హిందువులతోపాటు బీజేపీ ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారు.

మోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం హిందూత్వ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో సాధించిన విజయం కీలకమైనది. ఇది కాక ఇతర విషయాలు కూడా ముఖ్యమైనవి ఉన్నాయి. మోదీ, రాష్ట్ర స్థాయి బీజేపీ నాయకులూ హిందూత్వ సిద్ధాంతాన్ని తమ ఉపన్యాసాలలో పదేపదే ఉటంకిస్తున్నారు. ముస్లింల హక్కులకు కావాలనే భంగం కలిగిస్తున్నారు. పొరుగున ఉన్న ముస్లింలు ఏమి చేస్తారోనన్న ఆందోళన హిందువులలో పెరిగే విధంగా మాట్లాడటం, చేయడం బీజేపీ నాయకుల వ్యూహం.

"ఇంత వరకూ బీజేపీ సాధించిన విజయాలు భావజాలానికి సంబంధించినవే. పౌరసత్వ సవరణ చట్టం, కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించే చట్టం, పాఠ్యాంశాలలో భారత చరిత్రలో ముస్లింల పాత్రను తగ్గించడం లేదా ఎత్తివేయడం – అన్నీ బీజేపీ సైద్ధాంతిక పోకడలకు నిదర్శనాలు. (ఇరుగు పొరుగు దేశాలలో నివసిస్తున్న ముస్లిమేతరులకు భారతకు వలసరావడం సులువు చేయడం పౌరసత్వ సవరణ చట్టం ఉద్దేశం.) జమ్మూ-కశ్మీర్ ఒక్కటే ముస్లింలు మెజారిటీ ఉన్న రాష్ట్రం. పాకిస్తాన్ తో వివాదం ఉన్న రాష్ట్రం అదే. 2019లో మోదీ రద్దు చేసే వరకూ జమ్మూ-కశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి ఉండేది.

వాస్తవానికి హిందువులలో విభేదాల పరిష్కారం చేయడం కంటే కూడా ప్రధానమైనది ముస్లింలతో హిందువులకు ఉన్న విభేదాలనే విషయాన్ని ప్రచారం చేయడంలో బీజేపీ రాజ్యశక్తిని వినియోగించింది. ఇటువంటి ప్రచారానికి 'లవ్ జిహాద్' ఒక ఉదాహరణ. హిందువుల అమ్మాయిలను ప్రేమ పేరుతో వంచించి, పెళ్ళి చేసుకొని వారిని ఇస్లాంలోకి మార్చడం ద్వారా దేశంలో మెజారిటీగా ఉన్న హిందువులను మైనారిటీలుగా మార్చాలనే కుట్ర లవ్ జిహాద్ అని ప్రచారం. ఈ కారణంగా కొందరు ముస్లిం యువకులను అరెస్టు చేశారు. ఇదే ఇతివృత్తంతో వచ్చిన సినిమాను (కేరళ స్టోరీ) హిందూత్వవాదులూ, బీజేపీ ప్రభుత్వాలూ ప్రోత్సహించాయి.

ముస్లిం వ్యతిరేకతను ప్రచారం చేయడం వల్ల ప్రజల వైఖరిలో మార్పు వచ్చినట్టు అధ్యయనాలు తెలుపుతున్నాయి. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలను లాగికొట్టి చంపే (లించింగ్) ఘటనల సంఖ్య పెరిగిందని వర్షణే తయారు చేసిన 2022 పరిశోధనాపత్రం స్పష్టం చేసింది. "తమ పైన రాజ్యం చర్య తీసుకోదనే భరోసా నిందితులకు ఉన్నప్పుడే ముస్లింలను కొట్టి చంపడం సాధ్యం అవుతుంది" అని వర్షణే అంటారు.

## ముస్లిం వ్యతిరేకత రగిలించడం

ముస్లిం వ్యతిరేకత రాజేయడం రాజకీయంగా లాభదాయకం. ముస్లింలను చాలా అప్రతిష్ఠాత్మకంగా చిత్రించారు. ఇటీవల కాలంలో మోదీకి ఆమోదం రేటు 75 శాతం వరకూ వెళ్ళింది. హిందువులలో మద్దతు సంపాదించేందుకు భయపూరితమైన వాతావరణాన్ని సృష్టించడంలో మోదీ సఫలీకృతుడైనారు.

"వివిధ రంగాలలో, అన్ని రాష్ట్రాలలో ముస్లింలను చాలా చెడ్డగా చిత్రించడం బీజేపీ చేసిన ముఖ్యమైన నిర్వాకం. లౌకికవాదాన్ని వారు సంపూర్ణంగా విధ్వంసం చేయగలిగారు. మళ్ళీ లౌకికవాదాన్ని నిర్మించడం దాదాపు అసాధ్యం" అని జెఫ్రెలాట్ అన్నారు.

మోదీ అజెండా ఉదారమైనది కాదనడంలో ఏ మాత్రం సందేహం అక్కరలేదు. ముస్లింలూ, ఇతర మైనారిటీలను కాదని హిందువుల హక్కులనే అత్యధికంగా గౌరవించడం ఇందులో భాగమే. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇండియా తల్లివంటిదనే విశ్వాసాన్ని వమ్ము చేయడం లేదనీ, మెజారిటీ హిందువులకోసం వాదిస్తున్నట్టు కేవలం నటిస్తున్నానని నమ్మించడానికి మోదీ ప్రయత్నిస్తున్నారు.

కానీ ఆయన సుదీర్ఘమైన అప్రజాస్వామిక ప్రయాణం ఇందుకు విరుద్ధంగా కనిపిస్తున్నది.

తెలివితేటలు ప్రదర్శిస్తూ చట్టాలు చేయడం మోదీ వ్యూహాలలో ఒకటి. ఎలక్టొరల్ బాండ్లు కొనుగోలు చేయడం ద్వారా పార్టీలకు రహస్యంగా ఎంత విరాళమైనా ఇవ్వవచ్చు. అంటే అధికారపార్టీకి ఎంత విరాళం లభించిందో రహస్యం. ఇతర పార్టీలకు ఎంత విరాళం అందిందో అధికారపార్టీకి తెలిసిపోతుంది.

ఉన్నత పదవులలో నియమించడానికి ప్రభుత్వానికి కలిగిన అధికారాలను వినియోగించడం మరో ఎత్తుగడ. తాను ఆమోదించిన వ్యక్తులను న్యాయమూర్తులుగా నియమించడానికి నిరాకరించడం ద్వారా తనకు అనుకూలమైన సుప్రీంకోర్టు కొలీజియం మోదీకి లభించింది. సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్లను నియమించడం లేదు. సమాచారం అడిగి పుచ్చుకునే వ్యవస్థ నీరుగారి పోయింది. ఆ విధంగా సమాచార హక్కు చట్టానికి గండి కొట్టారు.

మరో వ్యూహం ఏమంటే ప్రభుత్వం తన అధికారాన్ని బాహాటంగా, నిస్సిగ్గుగా వినియోగించి ప్రత్యర్థులను భయపెట్టడం. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ- ఇది అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్ బీఐతో సమానం)ను అధికారంలో ఉన్న రాజకీయవాదులు దుర్వినియోగం చేస్తున్నారనే అపప్రథ ఉన్నది. ఆ దుర్వినియోగం 2014 తర్వాత మితిమీరింది. ఇదివరకటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీబీఐ విచారణ ఎదుర్కొన్న వారిలో 60 శాతంమంది ప్రతిపక్షాలకు చెందినవారుండేవారు. మోదీ హయాంలో ఈ శాతం 95కి పెరిగింది.

ఇటీవల రాహుల్‌కి గుజరాత్ కోర్టు పరువు నష్టం కేసులో రెండేళ్ళు శిక్ష విధించడం, తత్ఫలితంగా ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దు కావడం గమనిస్తే చట్టసభలనూ, న్యాయ వ్యవస్థనూ మోదీ ప్రభుత్వం ఏ విధంగా దుర్వినియో గపరుచుతున్నదో గమనించవచ్చు.

పన్నులకు సంబంధించిన శాఖలు (ఎన్ ఫోర్స్ మెంట డైరెక్టొరేట్-ఈడీ, ఇన్‌కం టాక్స్-ఐటీ) కూడా అదే పాత్ర పోషిస్తున్నాయి. 2019లో మోదీ ద్వేషభరితంగా మాట్లాడినందుకు నోటీసు పంపిన ఎన్నికల సంఘం అధికారిపైన, ఆయన భార్య, సోదరి, కుమారుడిపైన పన్ను దర్యాప్తు సంస్థలు దాడులు నిర్వహించాయి. గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్లలో మోదీ

పాత్రకు సంబంధించి డాక్యుమెంటరీ ప్రదర్శించిన బీబీసీపైన పన్ను సంస్థలు దాడి చేయడం తెలిసిందే.

బీబీసీపైన దాడులు ప్రజాస్వామ్యం నీరుగారుతోందనడానికి మరో ఉదాహరణ. సోషల్ మీడియాలో పోస్టులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్లయితే వాటిని తొలగించేందుకు ఒక కమిటీని నియమించారు. జర్నలిస్టులనూ, మానవ హక్కుల సంస్థల ప్రతినిధులనూ పీడిస్తున్నారు. మీడియా అణచివేత పరోక్షంగా కూడా జరుగుతోంది. మోదీకి సన్నిహితులైన అతిసంపన్నులైన గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ వంటివారు మీడియా సంస్థలను కొనుగోలు చేయడం అందుకు ఒక మార్గం.

మోదీని అదుపు చేసే వ్యవస్థలు బలహీనమైన కొద్దీ హిందూత్వ విధానాలను ప్రభుత్వం అంత అధికంగా అమలు చేయగలుగుతుంది. ఎన్నికల ద్వారా మోదీనీ, బీజేపీనీ ఓడించడం ప్రతిపక్షాలకు అంత కష్టతరం అవుతుంది.

## భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించడం సాధ్యమా?

భారత ప్రజాస్వామ్యం సంక్షోభంలో పడటం ఇదే మొదటిసారి కాదు. అంతర్యుద్ధం పోకడలు స్పష్టంగా కనిపిస్తున్న దశలో మోదీలాగానే ప్రజలలో ప్రాబల్యం కలిగిన కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ ఆత్యయిక పరిస్థితి(ఎమర్జెన్సీ)ని 1975 జూన్ లో ప్రకటించారు. అన్ని ప్రాథమిక హక్కులనూ, స్వేచ్ఛలనూ హరించారు. దాదాపు రెండేళ్ళపాటు భారత నియంతృత్వ పాలనలో మగ్గింది. ఆర్ఎస్ఎస్ నాయకులతో సహా ఇందిరాగాంధీ రాజకీయ ప్రత్యర్థులను అరెస్టు చేసి జైల్లో కుక్కించారు.

మార్చి 1977లో అత్యయిక పరిస్థితిని అకస్మాత్తుగా ఎత్తివేశారు. ఇందిరాగాంధీ ఎన్నికలు ప్రకటించారు. కాంగ్రెస్ ఓడిపోయింది. ఐచ్ఛికంగానే ఇందిర అధికారం నుంచి తప్పుకున్నారు. (తర్వాత జరిగిన ఎన్నికలలో ఘనవిజయం సాధించి మళ్ళీ అధికారంలోకి వచ్చారు.)అప్పటి నుంచి కాంగ్రెస్ ఆధిక్యం గల వ్యవస్థ పోయి ఆరోగ్యకరమైన బహుపార్టీల వ్యవస్థ అమలులోకి వచ్చింది.

మోదీ కూడా అంతే ఆకస్మికంగా, అంతే ఆశ్చర్యకరంగా అధికారం కోల్పోవచ్చునని అనుకోవచ్చునా? నేను మాట్లాడిన ప్రవీణులు ఇతమిత్థంగా చెప్పలేకపోయారు. తక్షణ సమస్యలకు స్పందిస్తూ ఆత్యయిక పరిస్థితిని ఇందిరాగాంధీ విధించారు. ఇందుకు భిన్నంగా మోదీ అనేక సంవత్సరాలుగా వ్యవస్థలను భ్రష్టుపట్టించి ఒక పద్ధతి ప్రకారం అప్రకటిత నియంతృత్వాన్ని ప్రవేశపెట్టారు.

"వారు సమాచారాన్ని నియంత్రించే విధానం, నిధులను అమితంగా సేకరించగల శక్తి, అందుకు విరాళాల సేకరణ పద్ధతులను సవరించిన విధానం చాలా ఆశ్చర్యం కలిగిస్తుంది" అని అంతర్జాతీయ శాంతి కోసం కార్నిజీ ఎండోమెంట్ దక్షిణాసియా కార్యక్రమం సంచాలకులు మిలన్ వైష్ణవ్ అన్నారు.

ప్రస్తుత పరిస్థితిని ఆత్యయిక పరిస్థితితో పోల్చడం సరైనదో కాదో చెప్పలేము కానీ భారత ప్రజాస్వామ్య ఇంకా చచ్చిపోలేదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. 2024లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ట్రంప్ లాగానే, బ్రెజిల్ కు చెందిన జాయిర్ బోల్సోనారో లాగానే మోదీ కూడా పరాజయం పొందవచ్చు.

బీజేపీని ఓడించవచ్చునని ఇటీవల పశ్చిమబెంగాల్ లోనూ, కర్ణాటకలోనూ ప్రజలు నిరూపించారు. భారత సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాలకు బలం ఉంటుంది. జాతీయ స్థాయిలో సైతం ప్రజలకు సందేశం పంపించగల శక్తి ప్రతిపక్షాలకు లేకపోలేదు.

'భారత్ జోడో' పేరుతో రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ 2,200 మైళ్ళు పాదయాత్ర చేశారు. సమాజాన్ని మతంతో విభజించే మోదీ రాజకీయాల పట్ల నిరసనగా ఈ పాదయాత్రను రూపొందించారు. పాదయాత్ర అన్నది భారతీయుల జీవితంలో ఇష్టమైన భాగం. కాంగ్రెస్ పార్టీనీ, ముఖ్యంగా రాహుల్గాంధీని పునఃప్రతిష్ఠించడంలో ఆ పాదయాత్ర విజయం సాధించినట్టు కనిపిస్తోంది.

"పాదయాత్రలో ఆయన జీవించిన విధానం వల్ల, ప్రజలతో అనుబంధం పెంచుకోవడంలో సఫలమైనందువల్ల రాహుల్ కి జనాకర్షణ శక్తి పెరిగింది. కులం ఒక బలమైన అంశంగా పాతుకుపోయిన సమాజంలో దారిలో పోయేవారందరితో కరచాలనం చేయడానికి అతడికి అభ్యంతరం లేదు" అని జెఫ్రెలాట్ అన్నారు.

కనుక 2024 ఎన్నికలు భారత భవిష్యత్తుకు కీలకం కాబోతున్నాయి. అమెరికా ప్రభుత్వం బయటికి ఏమంటున్నదో అనవసరం. "నా ప్రభుత్వ విదేశాంగ విధానానికి మానవ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్యాలు నిజంగా ప్రజలకు మేలు చేస్తున్నాయనే చింతన ప్రధానం" అని బైడెన్ అధికారంలోకి వచ్చిన కొత్తల్లో అన్నారు. కానీ భారత్ విషయంలో అమెరికా అధ్యక్షుడు తన విదేశాంగ విధానంలో ప్రధానమైన అంశాన్నివిస్మరించారు. మోదీ ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలనూ, నిర్ణయాలనూ ప్రశ్నించడానికి బదులు చైనాకు వ్యతిరేకంగా తన వెంట జతగా ఉండేందుకు మోదీని మంచి చేసుకోవడానికే బైడెన్ ప్రాధాన్యం ఇచ్చారు.

"ఇండియా ఉన్నతమైన ప్రజాస్వామ్య ప్రమాణాలకు కట్టుబడి ఉండేట్టు చూడాలనే తాపత్రయం బైడెన్ ప్రభుత్వంలో కనిపించడం లేదు" అని వైష్ణవ్ వ్యాఖ్యానించారు.

"బహుశా ఆంతరంగిక సంభాషణల్లో ఉన్నతాధికారులు మోదీతో ఈ విషయాలు ప్రస్తావిస్తారు" అని

**(మిగతా 21వ పేజీలో)**

# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం



- మాడభూషి శ్రీధర్

మొట్ట మొదటిసారి మనదైన రాజ్యాంగ నియమాల ప్రకారం 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు భారతదేశంలో ప్రతిచోట పండుగ జరుపుకున్నారు. ఎన్నికలంటే నిజంగా పండుగే. అందరికీ భాగస్వామ్యం లభించే పండుగ. అందరికీ తామే ఈ ప్రజాస్వామిక రాజ్యాన్ని నడుపుతున్నామనే సార్వజనీన భావన కలిగించే పండుగ. ఎంతో కొంత భూమి ఉండి ఆ భూమికి శిస్తుకట్టే వారికే బ్రిటిషు పాలకులు ఓటు హక్కు ఇచ్చారు. అందరికీ ఓటు అనేది అప్పుడు అందని ఆకాశ కుసుమం. కనుక డబ్బు, హోదా, సర్కారు వారి బిరుదులు, ప్రాపకం, కులం, మతం, రంగు జాతీయత ప్రాంతీయతతో సంబంధం లేకుండా 21 ఏళ్లు ఉన్న వారందరికీ ఓటు హక్కు లభించడం అనేదే ఒక గొప్ప విజయం. అయితే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు మాత్రమే కాదు. కాని, ఎన్నికలు లేకుండా ప్రజాస్వామ్య ప్రక్రియ ప్రారంభం కావడం కూడా సాధ్యం కాదు. అందరికీ సమానంగా ఓటు హక్కు కల్పించడం, వారు సక్రమంగా ప్రశాంతంగా ఓటు వేయడానికి అనుకూలమైన పరిస్థితులు కల్పించడం, ఓటర్లు ఏ ప్రభావాలకు లోను కాకుండా స్వయంగా స్వతంత్రంగా అన్నీ తెలిసి సొంత చైతన్యంతో నిర్ణయం తీసుకుని ఓటు వేయడానికి ఏర్పాట్లు చేస్తే ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడంలో తొలి విజయం సాధించినట్టే. ప్రతి అయిదేళ్లకొకసారి ఈ విజయాలు సాధిస్తూ ఉండాల్సిందే. అప్పుడే ప్రజాస్వామ్యం నిలబడినట్టు. అంతకల్లోలంగా ఉన్న కాశ్మీరంలో కూడా ఎన్నికలు సక్రమంగా జరగడం, ప్రభుత్వాలు మారడం, అప్పుడప్పుడూ అల్లర్లు జరిగినా ప్రశాంతంగా అభివృద్ధి సాగడం ప్రజాస్వామ్యం విజయాలనే చెప్పాలి. ఓటు వేసే చైతన్యం అందరిలోనూ ఎదగడం అతి ముఖ్యమైన అంశం. ఓటు వయసున్న వారందరికీ ఓటు హక్కు కల్పించడం, వారంతా ఓటు వేయడం, అదీ స్వయం నిర్ణయంతో ఓటు వేయడం జరిగినపుడు సంపూర్ణమైన ప్రజాస్వామ్య విజయం అని ధైర్యంగా చెప్పుకోవచ్చు.

### ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ఎలా?

ఈ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ఎలా ? అది ఎవరి చేతుల్లో ఉంది? అనే ప్రశ్నకు సమాధానం అందరికీ తెలుసు. ఆ బాధ్యత అందరిదీ కనుక. రాజ్యాంగం(భారత సంవిధానం)లో న్యాయ, ప్రభుత్వ శాసనవ్యవస్థల నిర్మాణం జరగడానికి ప్రాతిపదిక ఎన్నికలు. ముందు చట్టసభల ప్రతినిధులను ప్రజలు ఎన్నుకున్న తరువాత, వారి నుంచి ప్రధానమంత్రి, మంత్రివర్గం ఏర్పడుతుంది. ప్రజా ప్రతినిధులే రాష్ట్రపతిని ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. వారి అధ్వర్యంలో న్యాయవ్యవస్థ నిర్మాణం జరుగుతుంది. మొత్తం ప్రభుత్వ నిర్మాణమే ప్రజల ఓట్ల ఆధారంగా సాగుతుంది. ఒక దేశాన్ని ఆ దేశప్రజలు నడుపుకోవడమే ప్రజాస్వామ్యం. అందుకు జనాన్ని సిద్ధం చేయడం పౌరసమాజం బాధ్యత. పత్రికల బాధ్యత. మీడియా బాధ్యత. ఎన్నికలు సక్రమంగా జరిపించడం అనేదే గురుతరమైన బాధ్యత. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో, ప్రభుత్వ అధికారుల నిర్వహణలో ఈ బాధ్యత సక్రమంగా నెరవేరడానికి పౌరులపక్షాన నిలబడవలిసింది విలేకరులు. ఈ హక్కును, రాజ్యాంగాన్ని ప్రజలే పాలించే అవకాశాన్ని కాపాడుకోవలసింది కలాలు, కెమెరాలు కూడా ఓటర్లు జర్నలిస్టులు దాదాపు ఒకేపని చేస్తుంటారు. అదేమంటే తమ భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యాన్ని వినియోగించడమే. ఓటేయడం అంటే తమ అభిమతం తెలపడమే, ఓటర్ల భావ స్వేచ్ఛను కాపాడితే ఆ ఓట్లే పత్రికా స్వేచ్ఛను కాపాడతాయి. అందరూ కలసి భావస్వేచ్ఛను కాపాడుకోవలసిందే. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే వివిధ అంశాలపై మీడియా చేయవలసిందేమిటి? కలాలు రాయవలసిందేమిటి? కెమెరా కన్ను చూడవలసిందేమిటి? కాపలా కాయవలసిన అంశాలు ఏమిటి? ఎన్నికల చట్టాల్లోచెప్పే బాధ్యతలు ఏమిటి?

### అందరికీ ఓటు హక్కు - పోటీ హక్కు : కొన్నిపరిమితులు

అందరికీ ఓటు హక్కు ఉందని చెప్పే రాజ్యాంగం ఆర్టికల్ 325 ప్రతిప్రాదేశిక నియోజక వర్గానికి ఒకే సాధారణ ఓటర్ల జాబితా ఉండాలని నిర్దేశిస్తున్నది. ఇది అసలైన పని. ఈ నియమాన్ని అమలు చేయడం ఒక సమున్నతబాధ్యత. మతం, జాతి, కులం, లేదా వీటిలో ఏ అంశం ఆధారంగా కూడా లింగ వివక్ష చూపకుండా అందరినీ ఓటర్ల జాబితాలో చేర్చాలని ఈ ఆర్టికల్స్ స్పష్టంగా చెప్పింది. ప్రతివ్యక్తికి 18 ఏళ్ల వయసు రాగానే ఎన్నికల్లో పాల్గొనే అవకాశం కల్పించేందుకు ఓటు హక్కు ఇవ్వాలి. వయోజన ఓటు హక్కు భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక నినాదం, విధానం, ఆశయం, ఆ తరువాత ఒక మౌలిక రాజ్యాంగసూత్రం. రాజ్యాంగం ఏర్పడిన

సందర్భంలో 21 సంవత్సరాల వయసున్న ఆడ వారికి మగ వారికి సమానంగా ఓటు హక్కు ఇవ్వాలన్నది ఒక చారిత్రక నిర్ణయం, సమానతకు తొలి మెట్టు అని కాంగ్రెస్ సమావేశాలు రాజ్యాంగ రచనా సభలు చర్చించాయి. రిజిస్టరైన ఓటరుగా ఉండే హక్కును రాజ్యాంగం కల్పిస్తే, రిజిస్టర్ చేసుకునే హక్కును చట్టబద్ధంగా కల్పించింది ప్రజా ప్రాతినిధ్యచట్టం. 1988లో రాజ్యాంగం 61 సవరణ చట్టం ద్వారా వయోజన ఓటు హక్కును 18 సంవత్సరాలకే ఇవ్వాలని రాజీవ్‌గాంధీ పాలనలో పార్లమెంటు నిర్ణయించడం మరో మంచిమార్పు. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, ఆ చట్టం కింద 1960 నియమాల ప్రకారం ఓటుహక్కు ఏ విధంగా నమోదు చేసుకోవాలో వివరించారు. 18 నిండిన భారత పౌరులకు ఇతర అనర్హతలు ఏవీ లేకపోతే ఓటరుగా నమోదు చేసుకునే హక్కు లభిస్తుంది.

ఓటు హక్కు లేని వారికి ఇవ్వడం, అర్హత ఉన్న వారికి ఇవ్వకపోవడం అనే అక్రమాలు జరిగినప్పుడు ఎత్తిచూపవలసింది జర్నలిస్టులు. బోగసు ఓట్లన్నీ ఏరివేయించడం, అర్హులందరికీ ఓటుహక్కు ఇప్పించడం అనేది ఒక బాధ్యత.ఇది ఎన్నికల సమయంలో సాధ్యం కాకపోవచ్చు. ఒకసారి ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత అప్పటికి సిద్ధంగా ఉన్న ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికలు నిర్వహించవలసి ఉంటుంది. అయితే ఆ దశలో కూడా మరీ బోగస్ అని చెప్పడానికి వీలైన ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావలసి ఉంటుంది. ఈ మధ్య ఓటర్ల జాబితా సవరణకు తప్పుల దిద్దుబాటుకు నోటిఫికేషన్ తర్వాత కూడా అవకాశాలు కల్పించడం మంచి పరిణామం. ఓటరుగా ఉండాలంటే కావలసిన అర్హతలు. భారతపౌరులు కావడం, 18 ఏళ్ల వయసు నిండడం, ఆ నియోజకవర్గంలో నివసిస్తూ ఉండడం. అనర్హత లేవీ ఉండకపోవడం. సెక్షన్ 16 ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం మానసిక సమతౌల్యం కోల్పోయినట్టు న్యాయస్థానం తేల్చి చెప్పడం, ఎన్నికల అక్రమాలు లేదా నేరాల్లో బాధ్యుడని రుజువై ఉండడం అసలు అనర్హతలు. ఓటరుగా నమోదు చేయడానికి అతను ఏ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి ఉండకూడదు. ఏ విధమైన ఎన్నికల నేరాలు చేయకూడదు. ఎన్నికల్లో అసమంజసంగా లంచాలు ఇచ్చినా తీసుకున్నా, మరొకరి ఓటు తాము ఓటు వేయించుకునేందుకు ప్రజలను ప్రభావితం చేసినా, ఎన్నికల సమయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణలను రెచ్చగొట్టినా, పోలింగ్ స్టేషన్ నుంచి బ్యాలెట్ పత్రాలు తొలగించినా, నామినేషన్ పేపర్లను, బ్యాలెట్ పత్రాలను పెట్టెలను దుర్మార్గంగా ధ్వంసం చేసినా, ఆ నేరం చేసినట్టు రుజువైతే ఎన్నికల నేరస్తుడవుతాడు. ఆరేళ్లపాటు ఓటు వేయడానికి అనర్హుడవుతాడు. ఈ ఎన్నికల నేరాలకు పాల్పడిన వ్యక్తి శిక్షకు గురైతే ఆ వ్యక్తి తాను ఏ నియోజకవర్గంలోనూ అభ్యర్థిగా ఎన్నిక కావడానికి, సభ్యుడిగా కొనసాగడానికి అనర్హులవుతారు. ఏ ఎన్నికల్లో కూడా ఓటు వేయడానికి వీలుండదు. ఎవరికైనా ఓటు వేయాలని అక్రమంగా ఓటరును ఎవరైనా ప్రభావితం చేస్తే ఆ వ్యక్తి ఓటు హక్కును అప్పడికప్పుడు రద్దు చేసే అధికారం ఎన్నికల అధికారికి ఉంటుంది. మళ్లీ ఏ నేరమూ చేయకపోతే ఆరేళ్ల తరువాత అనర్హత తొలగిపోతుంది.

ఏదయినా నియోజకవర్గంలో సాధారణంగా నివసిస్తూ ఉన్న వ్యక్తికి ఆ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. కనీసం ఉండాలనే నియమం ఏదీ లేదు. ఎంతో కొంతకాలం ఉంటే చాలు. తను నివసిస్తున్న చోట ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు అని చట్టం వివరిస్తున్నది (1950 చట్టం సెక్షన్ 19(ఎ) (బి). తాత్కాలికంగా మరో నగరానికి వెళ్లి ఉంటున్న వారు కూడా అక్కడ నివసిస్తున్నట్టే. వారూ అక్కడ ఓటరు కావచ్చు. 1956లో గోవా ఓటర్ల జాబితా సవరించినపుడు అక్కడ పోర్చుగీసు కాలనీల్లో బందీలుగా ఉన్న భారతీయులకు ఓటు హక్కు ఎందుకు ఇవ్వకూడదనే ప్రశ్న తలెత్తింది. వారికి కూడా ఓటు నమోదు చేయాలని నిర్ణయించారు. సాధారణంగా నివసించడం అంటే ఒక ఇల్లు ఉండి, అక్కడికి నిద్రించడానికి రాత్రికల్లా రావడం. అతనికి అక్కడ నివసించే ఉద్దేశం ఉంటేనే అది నివాసం అవుతుంది. డాక్టర్ మన్మోహన్‌సింగ్ అస్సాంలో ఆ విధంగా నివసించి ఉంటేనే ఆయనకు ఓటు హక్కు ఇవ్వవచ్చునని గౌహతి హైకోర్టు నిర్ణయించింది. దానిపైన ఎన్నికల కమిషన్ సుప్రీం కోర్టుకు నివాసం అంటే అర్థం అదే అయినా, నివసిస్తేనే ఓటు హక్కు ఉంటుందని అదనపు షరతులు విధించి ఓటు హక్కు లేదనే అధికారం తమకు లేదని సుప్రీంకోర్టుకు వివరించింది. అంటే నివాసం లేకపోతే ఓటు ఇవ్వరా అనేది మరోప్రశ్న. ఫుట్‌పాత్ మీద బతికే వ్యక్తి ఈ దేశపౌరుడు కాదా అతనికి ఓటు ఇవ్వబోరా ? అన్నది సవాల్. కనుక నివాసం ఉంటేనే ఓటు హక్కు అంటే డబ్బు, ఇల్లు, సంపద ఆధారంగా ఓటు హక్కును నిర్ణయించినట్టవుతుంది. అది రాజ్యాంగ విరుద్ధం. ఆ నియమాన్ని ఎన్నికల కమిషన్ తనంత తానే తొలగించింది. ఒక నియోజకవర్గంలో సొంత ఇల్లు ఉన్నంత మాత్రానే అక్కడే ఆయన నివసిస్తున్నట్టు భావించాల్సిన అవసరం కూడా లేదు. ఎన్నికైన తరువాత ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజధానుల్లో ఉంటారు. అయితే వారి నివాసం మారిపోతుందా లేదా వారి ఓటు పోతుందా? వారు ఇది వరకు ఎక్కడ ఓటరుగా నమోదయ్యారో అక్కడ వారు నివసిస్తున్నట్టే, అక్కడ వారి ఓటు ఉన్నట్టే. మనం బతికి ఉంటే, ప్రజాస్వామ్యం బతికి ఉండాలంటే మన ఓటు హక్కు బతికి ఉండాలి. ఓటు వేయడం ద్వారా ఈ దేశం, ఈ రాష్ట్రం, ఈ ప్రభుత్వం, జనం వారి జీవనం బతుకుంది. ❑

# రాజ్యాంగ రక్షణే దేశభక్తి

ప్రాచీన భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలతో నిండి వున్నదే భారత రాజ్యాంగం. అందుకే రాజ్యాంగం అనేది ఒక రివల్యూషనరీ డాక్యుమెంట్. కౌంటర్ ఐడియాలజీ. డాక్యుమెంట్ ఆఫ్ నేషనల్ బిల్డింగ్. నేషనల్ రీకన్‌స్ట్రక్షన్ ప్రోగ్రామ్. దేశమంటే ఒక సామాజిక సమ్మేళనం. మన రాజ్యాంగం కూర్పు మనం గమనిస్తే రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది అని అందరికీ తెలుసు. కానీ రాజ్యాంగానికి ఒక రూపురేఖల రావడానికి ఎన్ని నిద్ర లేని రాత్రులు, పుస్తక పఠనం కోసం, రాయడానికి ఖర్చు చేశారో తెలియదు. రాజ్యాంగ రచనా కాలంలో బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పూర్తి సమయాన్ని మేధస్సును రాజ్యాంగ రచనపై కేంద్రీకరించి తన ఆరోగ్యాన్ని సైతం ప్రాణంగా పెట్టి దేశం కోసం, దేశ సేవ కోసం ముందున్నారు. వాటికి ఇప్పటికీ విలువ కట్టలేము. గుండెల్లో దేశభక్తిని నింపుకుని ఒక బాధ్యత గల పౌరుడిగా దేశం కోసం కఠోర శ్రమ చేసి దేశంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమ న్యాయం ప్రజాస్వామ్యం పరిఢవిల్లడానికి తన కుటుంబాన్ని కూడా త్యాగం చేసి సొంత ఆస్తి అంటూ ఏమీ లేకుండా భారత దేశం కోసమే మరణించారు.

భారత రాజ్యాంగాన్ని 395 ఆర్టికల్స్ 8 షెడ్యూళ్ళు (ప్రస్తుతం 12 షెడ్యూళ్ళు) 22 భాగాలతో ప్రపంచ దేశాలలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగంగా రూపొందించడానికి 11 సమావేశాలు 165 రోజులు జరిగాయి. 114 రోజులు ముసాయిదా రాజ్యాంగం గురించి మాట్లాడుకున్నారు. 9 డిసెంబర్ 1946న మొట్ట మొదటి సమావేశం జరిగితే, 29 ఆగస్టు 1947న రాజ్యాంగ రచన సభ డ్రాఫ్టింగ్ కమిటీని ఎన్నుకున్నారు. 7635 ఆర్టికల్స్ సవరణ గూర్చి సభ ముందు ఉంచగా, 2473 ఆర్టికల్స్ చర్చించారు. ప్రపంచంలో ఏదీ ఇది శాశ్వతం కాదని, ప్రతీదీ మార్పు చెందుతూ ఉంటుందని ముందే గమనించి మారుతున్న దేశ సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరించుకునే వెసులుబాటు కల్పించారు. ప్రస్తుతం సెప్టెంబర్ 2023 వరకు 106 సవరణలు జరిగినాయి. కెనడా వంటి దేశాలలో రాజ్యాంగంలోని ఆర్టికల్స్ మార్పు చేసే అధికారం లేదు. ఈ రాజ్యాంగాన్ని రూపొందించడానికి రెండు సంవత్సరాల ఐదు నెలలు పట్టింది. అదే విధంగా ఆస్ట్రేలియాలో 128 ఆర్టికల్స్‌తో రూపొందించుకున్న రాజ్యాంగం తొమ్మిది సంవత్సరాలు పట్టింది. దక్షిణాఫ్రికాలో 153 ఆర్టికల్స్‌తో ఒక సంవత్సర కాలం పట్టింది. అమెరికా అయితే థామస్ జఫర్సన్ నాయకత్వంలో కేవలం 7 ఆర్టికల్స్ నాలుగు నెలల్లో పూర్తి చేశారు.

మన దేశంలో రాజ్యాంగానికి ముందు మెజారిటీ మానవులకు అంటే బహుజనులకు కనీస మానవహక్కులైన కూడు, గుడ్డ, నివాసం, చదువు సంపద లేని మనువాద అప్రజాస్వామ్యంలో సాటి మనుషులను జంతువులకంటే హీనంగా, అంటరాని వారిగా, ముట్టరాని వారిగా, వారు పీల్చిన గాలి, వారి నీడ సైతం అంటరానిదిగా, నోటికి ముంత, ముడ్డికి తాటాకు కట్టి దీనికి కులం అనే కంపును అంట కట్టి భారతదేశ ఆత్మగౌరవాన్ని నడిబజారుకు ఈడ్చి ప్రపంచ దేశాల ముందు తలదించుకునేలా చేశారు. 1925 డిసెంబర్ 25న ఈ మను ధర్మాన్ని బూడిద చేసి యావత్ భారతీయులకు స్వేచ్ఛా వాయువులను అందిస్తూ మనిషి మనిషిగా బతికే హక్కు రాజ్యాంగం ద్వారా మనకు అందించి ప్రపంచదేశాల ముందు తల ఎత్తుకునేలా చేశారు. ప్రజా స్వామ్యాన్ని కేవలం ఒక రూపంగానే కాక ఒక వాస్తవంగా కూడా ఉండాలంటే మొదటిగా సాంఘిక ఆర్థిక లక్ష్యాలను సాధించాలంటే మనం రాజ్యాంగబద్ధ పద్ధతులకు కట్టుబడి ఉండాలి. రక్తపాత పద్ధతులను వదిలి వేయాలి. జాన్ స్టువర్ట్ మిల్ చెప్పినట్లు తన స్వతంత్రాన్ని ఎటువంటి గొప్ప వ్యక్తి పాదాల వద్ద ఉంచకూడదు. అదే విధంగా నమ్మకూడదు. అధికారం ఇవ్వకూడదు. అందువల్ల ఆ వ్యక్తి సంస్థలను/వ్యవస్థలను మార్చి వేసే అవకాశం ఉంది అని అంటాడు.

అదే విధంగా ఐరిష్ దేశభక్తి పరుడు డానియల్ కనేల్ మాట్లాడుతూ ఏ వ్యక్తి తన గౌరవాన్ని కోల్పోయి, ఏ స్త్రీ తన శీలాన్ని కోల్పోయి, ఏ దేశం తన స్వతంత్రాన్ని కోల్పోయి కృతజ్ఞతలు చెల్లించకూడదు అంటారు. బాబాసాహెబ్ అయితే రాజకీయ భక్తి నాయకారాధన దిగజారుడుతనానికి నియంతృత్వానికి దారితీస్తుంది అంటూ ప్రజలు రాజకీయ ప్రజాస్వామ్యంతోనే సంతృప్తి చెందరు. అది సామాజిక ప్రజాస్వామ్యంగా పరివర్తన చెందాలి. సామాజిక ప్రజాస్వామ్య పునాదులు లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు అంటారు. సామాజిక ప్రజాస్వామ్యమంటే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేవి జీవన విధానంగా మార్చుకోవాలి. కులాలు జాతికి వ్యతిరేకం. అవి అసూయ పరస్పర విద్వేషాన్ని

కలిగిస్తాయి. ఒక జాతి ఏర్పడినప్పుడే సౌభ్రాతృత్వం సాధ్యమవుతుంది. సౌభ్రాతృత్వం లేని స్వేచ్ఛ సమానత్వం గోడకు వేసిన సున్నం లాంటిది అని దేశంలో ఆర్థిక, సాంఘిక, న్యాయం ఉండాలి. అంటే పరిశ్రమలను భూమిని జాతీయం చేయాలనీ బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 17 డిసెంబర్ 1946లో రాజ్యాంగ సభలో ప్రసంగిస్తారు. ప్రజాస్వామ్యం అనే ఒక పచ్చని చెట్టు ఎక్కడపడితే అక్కడ ఎదగదు. ఇంగ్లాండ్, అమెరికాలో అది పరిఢవిల్లింది. ఫ్రాన్స్‌లో ఒక మేరకు అభివృద్ధి చెందింది. ఎన్నో దేశాలలో బహిరంగంగా ఖూనీ అయింది. సైనిక ప్రభుత్వాలు ఏర్పడ్డాయి.

**ప్రజాస్వామ్యం విజయం సాధించాలంటే సమాజంలో ఎటువంటి అసమానతలు లేకపోవడం, ప్రతిపక్షాల ఉనికిని గుర్తించడం, మైనారిటీల మీద మెజారిటీ పెత్తనం ఉండకూడదు. సమాజంలో నైతిక విలువలను పెంపొందిస్తూ అన్యాయానికి స్పందించే లక్షణాన్ని కలిగి ఉండే విధంగా ఉండాలి. అందుకే లాస్కీ మహనీయుడు ప్రజాస్వామ్యానికి నైతిక విలువలు అనేవి ఆయువు పట్టు. విలువలు చెదిరిపోతే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంది అంటాడు. ఒకప్పుడు ధనిక రాష్ట్రాలుగా ఉన్నవి ఇప్పుడు అప్పుల రాష్ట్రాలుగా మారుతున్నవి అంటే దానికి నైతిక విలువలు లేని రాజకీయ పార్టీలు రాజకీయ నాయకులే కారణం. దెయ్యాలు హితం బోధించినట్లు ఇప్పుడు రాజ్యాంగాన్ని మార్చాలంటాడు ఒక రాజకీయ నాయకుడు. మరొక రాజకీయ నాయకుడు భారతదేశపు మువ్వన్నెల జెండా మార్చాలంటాడు. మరొకడొచ్చి దేశం పేరు మార్చాలంటాడు.**

దేశంలో రాజకీయ అధికారం చాలా కాలం అల్పజనుల గుత్తాధిపత్యంలో ఉండడం వల్ల సమాజానికి విఘాతం కలిగించే విధంగా తయారయ్యారు. వీళ్ళందరూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సమన్యాయానికి, ప్రజాస్వామ్యానికి బద్ధ వ్యతిరేకులు. దేశానికి శత్రువులు, వీళ్లు అప్రజాస్వామిక నిరంకుశ వాదులు. వీరికి దేశంలో స్థానం లేదు, తిరిగి ప్రజలే సరైన సమయంలో సరిగ్గా బుద్ధి చెబుతారు. భారతదేశంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నదన్నది వాస్తవం. రాజ్యాంగం మార్పు అయినట్లయితే దేశం సార్వభౌమత్వం కోల్పోయి స్వాతంత్ర్యం ప్రమాదంలోకి నెట్టివేయబడివచ్చు. రాజ్యాంగాన్ని సమర్థించేవాళ్ళు, వ్యతిరేకించే వాళ్ళు మధ్య భేదాభిప్రాయాలు వచ్చి దేశ విభజనకు దారితీసి రెండు మూడు దేశాలుగా విడిపోయే అవకాశం ఉండవచ్చు. భారతదేశ సర్వసత్తాక సామ్య వాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యానికి బీటలుపడి సమైక్యతను దెబ్బతీయవచ్చు. మానవ మనుగడకే ప్రమాదకరంగా మారిపోతుంది. యావత్ భారతీయులందరూ ఇంతకన్నా గొప్ప రాజ్యాంగాన్ని మనం ఎవరి నుంచీ కూడా ఆశించలేము. నేను ఎంతో కష్టపడి సాధించిన ఈ హక్కుల గిడారును చేతనైతే ముందుకు తీసుకుని వెళ్ళండి లేదా అక్కడే వదిలి వేయండి. అంతేకానీ వెనుక మాత్రం లాగవద్దు అన్న బాబా సాహెబ్ మాట లు గుర్తెరిగి ప్రతి భారతీయుడు మొదటిగా, చివరిగా బాధ్యత కలిగిన భారతీయుడువలే రాజ్యాంగాన్ని యథార్థంగా అమలు చేసే విధంగా చైతన్యం చెంది భారత రాజ్యాంగాన్ని పరి రక్షించుకోవడమే బాధ్యతగా, ఈ మార్గంలో ఎదురయ్యే దుష్టశక్తులను ఎదుర్కోవడమే దేశసేవ, ఇంతకంటే వేరే మార్గమే లేదు. **(మన తెలంగాణ సౌజన్యంతో)..** ❑

## రాజకీయ విరాళాలు..

**(9వ పేజీ తరువాయి)**పాలకులు చెప్పుకుంటారు. ఓట్లు అవసరమయ్యేప్పటికి తాజాగా 80 కోట్ల మందికి రేషన్ ఉచితంగా ఐదేళ్ల పాటు ఇస్తామని ప్రకటించారు. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం, 2021లో నమోదైన మొత్తం సంపదలో 40.5 శాతాని కంటే ఎక్కువగా ఒక శాతం మంది వద్ద మాత్రమే సంపద మూలుగుతున్నది. ఇండియాలో ప్రజాస్వామ్య, రాజకీయ వ్యవస్థలలో ప్రభుత్వ విధానాలన్నీ సంపన్నులకు, తమకు కావలసిన రాజకీయ పార్టీలకు అనుకూలంగా రూపొందిస్తున్నారు. ప్రభుత్వ విధానాలను తమకు అనుకూలంగా మార్చుకునే సంపన్నులు అపారంగా డబ్బును దాచుకుంటున్నారు. ❑

## మన కళ్ల ముందే కూలిపోతున్న..

**(17వ పేజీ తరువాయి)**

శ్వేతభవనం ప్రతి నిధి ఒకరు వ్యాఖ్యానించారు. “ఈ సమావేశాలలో మేము పరస్పరం గౌరవించుకుంటూ విధానపరమైన భేదాలను ప్రస్తావించి, చర్చిస్తాం” అని ఆ ప్రతినిధి అన్నారు. అణ్వాస్త్రాలు కలిగిన పాకిస్తాన్ తో ఘర్షణ కొనసాగుతుండగా హిందూ జాతీయ వాదానికి భారత దేశం దిగజారడం అమెరికా ప్రయోజనాలకు అనుగుణం కాజాలదు. పరిస్థితులను తీవ్రమైన స్థాయికి తీసుకొని పోతే నష్టబోతారని మోదీకి అమెరికా ప్రభుత్వ అధికారులు చెప్పగలిగితే భారత ప్రధాని వైఖరి ఏ మాత్రమైనా మారుతుందేమో. అయితే, భారత దేశం అనుసరించే విధానాలను మార్చగలిగే శక్తి అమెరికాకు లేదు. 2024లోనూ, ఆ తర్వాతా భారతీయులు ఏమి చేస్తారన్నదానిపైన ఇండియాలో ఏమి జరుగుతుందో ఆధారపడి ఉంటుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటే ప్రపంచానికి మంచిది. పెరుగుతున్న ప్రాబల్యంతో ప్రజాస్వామ్య భారత్ ప్రపంచంలో సకారాత్మక పాత్ర పోషించవచ్చు. ❑

# భారత రాజ్యాంగం : బాబ్రీ మసీదు : బాబా సాహెబ్



- ఎస్.వినయ కుమార్

భారత రాజ్యాంగం : బాబ్రీ మసీదు : బాబాసాహెబ్ కాకతాళీయమో, కాదో గాని భారతరత్న బాబాసాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి రోజే కాషాయ పరివారం బాబ్రీ మసీదును కూల్చింది. భారత రాజ్యాంగమన్నా, చర్చి, మసీదుల న్నా వారికి చెప్పలేనంత కడుపు మంట. దేశ పౌరుల్లో పరమత ద్వేషభావాన్ని పెంచి అధికారంలోకి రావడం కోసం వారు బాబ్రీ మసీదును లక్ష్యం చేసుకొన్నారు. ఇప్పుడు లౌకికతత్వం రాజకీ య ప్రజాస్వామ్యం ప్రబోధించే భారత రాజ్యాంగాన్ని దాని విలు వలను నీరు గార్చే పనిలో ఉన్నారు. సమానత్వం సౌభ్రాతృత్వ పౌరులందరికీ వర్తించే చట్టం, ప్రజలందరికీ జీవించే హక్కు భావప్రకటనా స్వేచ్ఛ వంటి విలువలకు పాడె కడుతున్నారు.

భారత రాజ్యాంగం మతంతో నిమిత్తం లేకుండా దేశంలోని పౌరులందరినీ సమానహోదా కల్పించింది. హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్‌లు కోరుకున్నదే బీజేపీ కోరుకుంటున్నది. భారతదే శం హిందువులదని, ఈ దేశంలో క్రైస్తవులు, ముస్లింలు తమ నివాసాన్ని కొనసాగించాలనుకొంటే రెండో తరగతి పౌరుల్లా, హిందువుకు లోబడి బతకాలని ఆ సంస్థల సిద్ధాంతం. వినాయక్ దామోదర్ సావర్కర్, మాధవ్ సాదాశివ్‌రావ్, గోల్వాల్కర్ చాలా స్పష్టంగానే తమ రాతల్లో ఈ సిద్ధాంతాన్ని ప్రవచించారు. కాని భారత రాజ్యాంగం వారి వాదనను పట్టించుకోలేదు. పౌరులం దరికీ ఒకే విలువ గల ఓటు హక్కునిచ్చింది. కుల మతాలతో నిమిత్తం లేకుండా మహిళతో సహా భారత పౌరులందరికీ ఒకే రీతిగా చట్టాలు అమలవుతాయి. వారసత్వ చట్టాల్లో మాత్రం కొన్ని తేడాలున్నాయి.

భారతీయులందరూ ఒక జాతిగాదంటూ రెండు జాతుల సిద్ధాంతాన్ని మొట్టమొదట ప్రతిపాదించింది సావర్కర్. బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష దరఖాస్తు పెట్టుకొని అండమాన్ జైలు నుండి విడుదలయిన సావర్కర్ బ్రిటిష్ పాలకులకు ఇచ్చిన మాట ప్రకారం స్వాతంత్ర్య పోరాటం నుండి దూరంగా ఉన్నారు. హిందూ మహాసభకు అధ్యక్షుడయ్యాడు. భారతదేశంలో హిందూ ముస్లింలు రెండు జాతులున్నాయని సిద్ధాంతీకరించారు. ముస్లిం లీగ్ అధ్యక్షుడు మహ్మదాలి జిన్నా ఆ తర్వాత అదే వాదనను అందుకొన్నారు. ఫలితం భారతదేశ విభజన. విభజించు పాలిం చు విధానాన్ని వర్తింపజేసిన బ్రిటిష్ వలస పాలకులకు కావ ల్సింది అదే కాగా ఆర్ఎస్ఎస్ దాని పరివారం విభజన పాపాన్ని మొదట మహాత్మాగాంధీ నెత్తికి చుట్టింది. ఇప్పుడు నెహ్రూ నెత్తికి చుడుతున్నారు. మహాత్ముడిపై గౌరవం ఒలకబోస్తూనే స్వాతం త్ర్యోద్యమంలోకి విశాల ప్రజానీకాన్ని సమీకరించిన ఆయన కృషి పై దుప్పటి కప్పి ఆయనను స్వచ్ఛతకు పరిమితం చేశారు. పని లోపనిగా స్వచ్ఛ భారత్ పేర 0.5 శాతం పన్నును జిఎస్‌టికి చేర్చారు.

రాజ్యాంగం రచనా సంఘానికి అంబేద్కర్ అధ్యక్షుడే అయినా అనేకరకాలైన సంప్రదాయవాదులతో కూడింది మన రాజ్యాంగ సభ. ఆ సభలో కొందరు పెద్దలకు హిందూ మహాసభకు ఉండే ఛాందస, ఒంటెత్తు భావనలున్నాయి. అయినప్పటికీ స్వాతంత్రో ద్యమం నాటి విలువలపై ఆధారపడి భారత రాజ్యాంగ నిర్మాణం జరిగింది. కానీ "భారత రాజ్యాంగం మనది కాదు. మువ్వన్నెల జెండా మనది కాదు. భారత రాజ్యాంగం ఒక అతుకుల బొంత. పశ్చిమ దేశాల నుండి అక్కడ కొంత ఇక్కడ కొంత తెచ్చి జోడిం చారు. అది భారత్‌కు పనికి రాదు" అంటూ కాషాయ దళాలు ఈసడిస్తుంటాయి. మువ్వన్నెల జెండా కూడా పశ్చిమ దేశాల తరహాలో ఉంది. మన జెండా కాషాయ రంగులో మధ్యలో ఒక చీలికలతో ఉండాలని వాదిస్తుంటారు. చిత్‌పవన్ బ్రాహ్మణులైన పేష్వా పాలకుల కాషాయ జెండానే మన జాతీయ జెండాగా ఉండాలని వారి అభిమతం.

కుల మతాలతో నిమిత్తం లేకుండా ఒక నేరానికి ఒకే శిక్ష విధించాలని చెప్పే మన చట్టాలు సహజంగానే వారికి జీర్ణం కానివి. వర్ణం ప్రకారం శిక్షలు, హక్కులు, ఆస్తులు ఉండాలని మనుస్మృతి చెప్తుంది. అందుకనే అంబేద్కర్ మనుస్మృతిని మహద్ పోరాటం సందర్భంగా మనుస్మృతిని తగలబెట్టారు. అలాంటి మనుస్మృతి సాంప్రదాయ వాదులకు శిరోధార్యం, మనుస్మృతిని తగలబెడితే వారు విలవిల్లాడుతారు. ఫ్యూడల్ ప్రభువుల ప్రాప కంతో వారి పాత్రతో మతతత్వ పార్టీలైన హిందూ మహాసభ ఆర్ఎస్ఎస్ ముస్లిం లీగ్ పుట్టుకొచ్చాయి. కనుక వాటికి ఇప్పటికీ ఫ్యూడల్ విలువల పట్ల మోజు. ఆ విలువలు కష్టజీవులనే కాదు, మహిళలనూ అణిచి ఉంచాలని చూస్తాయి. భారత రాజ్యాంగం మహిళలకు సమాన పౌరసత్వాన్ని కలిగిస్తోంది. స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా సామాజిక ఆర్థిక రంగాల్లో చేయాల్సిన పోరాటాన్ని, తన వర్గ స్వభావం వల్ల కాంగ్రెస్ నాయకత్వం వాయిదా వేసింది. స్వాతంత్ర్యం వచ్చాక వాటి సంగతి చూసు కోవచ్చని చెప్పింది. కాని స్వాతంత్ర్య భారతంలో కూడా వాటిని

సమగ్ర దృష్టితో చేపట్టలేదు. ఓటు బ్యాంకు రాజకీయాల దృష్టితో క్రమంగా మృధు హిందూత్వను అనుసరించింది. ము స్లింల్లో ప్రజాస్వామిక సంస్కరణల కోసం ప్రయత్నించకుండా సాంప్ర దాయ శక్తులను సంతృప్తి పరిచే విధానాన్ని అనుసరిస్తూ అంబే ద్కర్ చేసిన హెచ్చరికను పెడచెవిన బెట్టారు. తద్వారా ప్రభుత్వా లు మెల మెల్లగా రాజకీయ ప్రజాస్వామ్యానికీ ప్రమాదం తెచ్చి పెట్టాయి. అక్కడో నల్లరాయి ఇక్కడో తెల్లరాయి పేర్చినట్లు భారత రాజ్యాంగాన్ని రూపొందించి ఉంటే ఇంత కష్టపడాల్సిన అవసరం ఉండేది కాదని రాజ్యాంగ సభకు రాజ్యాంగాన్ని సమర్పిస్తూ చెప్పారు. రాజ్యాంగ రూపొందుతున్న సమయంలో సైద్ధాంతికంగా అసమ్మతి తెల్పిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ క్రమశిక్షణకు పరిమితం కాకుండా సభ్యులు చర్చల్లో అనేక విషయాలను ముందుకు తెచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అదే సందర్భంలో ఒక హెచ్చరిక చేశారు.

1950 జనవరి 26తో మనం ఒక వైరుధ్యభరితమైన జీవితం లోకి ప్రవేశిస్తున్నాం. రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుం ది. కాని సామాజిక అర్థిక రంగాల్లో అసమానత ఉంటుంది. రాజకీయాల్లో ఒకరికి ఒకే ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ అన్న సూత్రాన్ని అనుసరిస్తాం. కాని మన సామాజిక, ఆర్థిక నిర్మాణం కారణంగా మనుషులందరికీ ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాక రిస్తాం. ఈ వైరుద్యాల మధ్య మనం ఎంతకాలం ఉండగలం. సామాజిక, అర్థికరంగాల్లో ఎంతకాలం సమానత్వాన్ని నిరాకరిం చగలం. చాలా కాలంపాటు ఈ నిరాకరణ సాగితే మనం రాజ కీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిన వారవుతాం. వీలైనంత త్వరగా మనం ఈ వైరుధ్యాన్ని తొలగించాలి. లేకపోతే మనం ఎంతో కష్టపడి రూపొందించుకొన్న రాజకీయ ప్రజా స్వామ్య నిర్మాణం పేలిపోతుంది." అన్నారు అంబేద్కర్.

మోడీ పాలనలో బీజేపీ తన మతతత్వ విధానాలను బాహా టంగా అమలు చేయడానికి పూనుకొంది. రాజ్యాంగ సంస్థలను తన రాజకీయ ప్రయోజనాలను సాధించే పనిముట్లుగా మార్చు కొంది. ఎన్నికల సంఘం, పోలీసు విభాగాలు వెన్నుముక లేని సంస్థలయ్యాయి. ఎలక్టొరల్ బాండ్లపేర అవినీతికి, అశ్రిత పెట్టుబడిదారులకు ప్రజల సొమ్మును ధారపోసే విధానాలను కాంగ్రెస్ కంటే నిస్సిగ్గుగా అమలు చేస్తోంది. తీవ్రమైన నేర చట్టాల కింద కేసులు బనాయించి ఏండ్ల తరబడి జైళ్లలో పెడు తోంది. ఆ కేసులు విచారణకు సైతం రావు. నిందితులు అలా జైళ్లలో ఉండిపోవాల్సి వస్తుంది. మీడియా స్వేచ్ఛను కొనేసింది. అడ్డగోలు వాదనలకు వార్తలకు సోషల్ మీడియాను పెంచి పోషి స్తోంది. పార్లమెంట్‌ను ఒక ప్రహసనంగా మార్చింది. ప్రతి పక్షంలో ఉండగా చెప్పిన సుద్దులు ఒక్కటీ పాటించదు తనకు అవసరమైన బిల్లులను పేరుకే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి తగిన చర్చకు అవకాశమివ్వకుండా ఆమోదముద్ర వేసుకొంటుంది. రాష్ట్రాల్లోని గవర్నర్లు అధికారిక చొరబాటుదారుల్లా రాష్ట్ర ప్రభు త్వాలను ఇబ్బంది పెడుదున్నారు. మోడీకి, షాకు మాత్రమే మేము జవాబుదారీ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సుప్రీంకోర్టు వాఖ్యలను తీర్పులను పట్టించుకోవడం లేదు. మెజారిటీ మత తత్వం నియంతృత్వం వైపునకు మైనారిటీ మతతత్వం టెర్రరిజం వైపు వెళ్తాయన్న అంచనాలను మోడీ ప్రభుత్వం ఆచరణలో అమలు చేసి చూపెడుతోంది.

రాజ్యాంగసభలో ప్రొ.కె.టి.షా అనే సభ్యుడు రాజ్యాంగం లోని ఆర్టికల్1, క్లాజు1లో సెక్యులర్, ఫెడరల్, సోషలిస్టు అనే పదాలను చేర్చాలని ప్రతిపాదించారు. అంబేద్కర్ ఆ పదాల అవ సరం లేదని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లో అవి భాగం గా రాజ్యాంగ ముసాయిదాల్లో భాగంగా ఉన్నాయని చెప్పారు. న్యాయ ప్రక్రియలో అనుసరించాల్సిన సోషలిస్టు సూత్రాలను, సమానత్వం నిష్పాక్షకత వంటి అంశాలను కూడా ఇదివరకే చేర్చా మని చెప్పారు. లౌకిక విలువకు అంబేద్కర్ గట్టిగా కట్టుబడి ఉన్నారు. న్యాయం – సమానత్వం గురించి బలంగా రాజ్యాంగ ముసాయిదాలో చెప్పామన్నారు. దేశ నిర్మాణం సందర్భంగా అను సరించాల్సిన సౌభ్రాతృత్వంపై ఆయన సభలో అనర్గళంగా మాట్లాడారు.

కాని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి లౌకిక విలువలు, సమానత్వం అన్నవి నచ్చని అంశాలు, అందుకనే పార్లమెంట్ నూతన భవనం ప్రారంభంలో సభ్యులకు ఇచ్చిన రాజ్యాంగ పుస్త కాల ప్రవేశికలో సెక్యులర్, సోషలిస్టు అన్న పదాలను తొలగిం చారు. ఎమర్జెన్సీలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పదాల ను చేర్చారు కనుక ఆ పదాలను తాము తొలగించినట్లు వివరణ ఇచ్చారు. కాని వాస్తవం ఏమిటంటే ఆచరణలో రాజ్యాంగ మూల స్వభావాన్నే బీజేపీ మార్చాలనుకొంటోంది. ప్రభుత్వాన్ని మతంతో కలగాపులం చేస్తోంది. మత సామరస్యం కోసం ప్రాణాలివ్వడా నికి సిద్ధపడిన మహాత్మాగాంధీని చంపిన గాడ్సేను అనధికారికం గా ఆకాశానికి ఎత్తుతోంది. గాంధీ హత్యకేసులో సరైన సాక్ష్యాలు లేక బయటపడిన సావర్కర్ విగ్రహాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్టించింది.

**భారత పౌరులు ఏ మతాన్నయినా అనుసరించవచ్చు, ఏ మతాన్నయినా స్వీకరించవచ్చు. అది ప్రాథమిక హక్కు. అందుకు విరుద్ధంగా బీజేపీ రాష్ట్రాల్లో మత మార్పిడి నిరోధక చట్టాలు తెచ్చారు. మతాంతర వివాహాలకు జిహాదు సాకు చూపి అడ్డుపడి ప్రాథమిక హక్కును హరించి వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగ నిర్మాతలు అశించిన అనుసరించ దల్చుకొన్న మౌలిక విలువలు ఏమిటి? నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరిస్తున్న విలువలేమిటి? ఒకసారి బేరిజు వేసుకోవాల్సిన రోజు ఇది.** ❑

# అసమానతల అంతమే అంబేద్కర్‌కిచ్చే నివాళి



- టి.స్కైలాబ్‌బాబు



'కులం పునాదులపై ఒక జాతిని ఒక నీతిని నిర్మించలేము' అన్నారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్. కులాధారిత సమాజాన్ని కూల దోసి, మానవ సమాజాన్ని నిర్మించాలని ఆయన భావించారు. కానీ నేడు కులాన్ని బలపర్చడం, దాన్ని స్థిరపర్చడం జరుగుతుంది. కులం ఓటు బ్యాంకుకు కేంద్రంగా, పాలక వర్గాలకు పావుగా మారింది. ఆయన విగ్రహాలకు పూలదండలు వేసి దండాలు పెట్టి కీర్తించడం, ఆయన ఆశయాలని మాత్రం అధాపాతలంలోకి తొక్కడం నేడు జరుగుతున్నది. అగ్ర కులాలు కులాన్ని తమ ఆధిపత్యం కోసం, తమకంటే కింది వారిని అణిచివేయడం తాము పైకులస్తులమని గర్వం ప్రదర్శించడానికి ఉపయోగిస్తున్నాయి. అప్పటికే అసమానతలు వున్న కులాల్లో కింది కులాల వారిలో సైతం తమ కులానికి అన్యాయం జరుగుతుందని పాలక వెగలతో రాజీపడుతూ అందులోని ఒక నాయకుడు ప్రయోజనం కోసం మొత్తం తమ కులాన్ని తాకట్టు పెట్టడం చూస్తున్నాం. మనువాదం సృష్టించిన జబ్బు కులమని మనుస్మృతి గ్రంథాన్ని అంబేద్కర్ ఆనాడే తగులబెట్టిన విషయం తెలిసిందే. ఓ వైపు అంబేద్కర్ మాకు స్ఫూర్తి అని చెబుతూ మరోవైపు అన్ని రకాల అసమానతలకు మూలమైన మనుస్మృతి వారసురాలైన బీజేపీ పంచన చేరుకున్నది చూస్తున్నాము. అంబేద్కర్ కుల అసమానతలు, కులం స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, న్యాయం అనే విలువలకు వ్యతిరేకమైనదనీ దానిని సమూలంగా నిర్మూలించి మానవ సమాజ మంతా ఒక్కటిగా ఉండాలన్నారు. సామాజిక ఆర్థిక న్యాయం జరగాలంటే సమాజంలో అంతరాలు అంతం కావాలని చెప్పారు. మన రాజ్యాంగం కుల వివక్ష అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించి, కుల నిర్మూలనకు బాటలు వేయాలన్నది. కానీ ఆ రాజ్యాంగంపై ప్రమాణం చేసి గద్దెనెక్కిన మనువాద బీజేపీ రాజ్యాంగ లక్ష్యాలను నాశనం చేస్తోంది. ఆరెస్సెస్ కనుసన్నల్లో పనిచేస్తూ తమ అంతిమ లక్ష్యమైన మనువాద రాజ్యానికి అడ్డుగా ఉందని రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేయడానికి కుట్రలు చేస్తుంది అందుకోసమే నేడు కుల, మత వైషమ్యాలను పెంచి పోషిస్తుంది. ప్రత్యేకించి బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ వైషమ్యాలు పెట్రేగి పోయాయి. బ్రాహ్మణిజం, క్యాపిటలిజం రెండూ మనదేశానికి శత్రువులని అంబేద్కర్ ఏనాడో చెప్పా డు. సరిగ్గా ఆయన లక్ష్య విరోధులే ఈ దేశాన్ని ఏలడం ఈ దేశ ప్రజల దౌర్భాగ్యం. 1950 జనవరి 26వ తేదీ నుండి అమల్లోకి వచ్చిన కేవలం ఒక శాసన గ్రంథం మాత్రమే కాదు, అది ఒక సోషల్ రెవల్యూషనరీ డాక్యుమెంటు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి అనేక విలువలను ఈ ఆధునిక సమాజంలో వ్యవస్థీకరించే ఆశయాన్ని అందులో ప్రకటించారు. భూమి సమానత్వాన్ని పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్య వాటా స్త్రీ సమానత్వం కోసం ఆయన పేర్కొన్న అంశాలు ఏనాటికైనా విప్లవకరమైనవే. మానవ సమాజం ఒక సమానత్వ సమాజంగా రూపుదిద్దుకొని ఒక పవిత్ర విలువగా నిర్మించటమే దానికి గల విప్లవకర స్వభావం అన్నారు. 1917 రష్యాలో లెనిన్ నాయకత్వంలో ఏర్పడిన సోషలిస్ట్ విప్లవ ప్రభావంనాడు ప్రపంచాన్ని ప్రభావితం చేసింది. ఆ వెలుగులో అంబేద్కర్, లెనిన్, మార్టిన్ లూథర్ కింగ్, జోతి భాపూలే వంటి ఆధునిక తాత్వికుల నుంచీ, ఆధునిక కాల విప్లవ మహోపాధ్యాయుల నుంచీ రెవల్యూషనరీ అంబేద్కర్ స్వీకరిం చారు. అంబేద్కర్ విద్య, వైద్యం ఎల్లవేళలా సంక్షేమ రంగంలో మాత్రమే ఉండాలని చెప్పారు. పాలకులు మాత్రం విద్య వైద్యాన్ని ప్రయివేటు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టారు. దీంతో సామాన్య పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. నిరుపేదలకు సరైన వైద్య మందడం లేదు. అంబేద్కర్ పరిశ్ర మలలో కార్మికులకు యాజమాన్య వాటా ఉండాలని చెబితే నేడు

**(మిగతా 30వ పేజీలో)**

# మార్క్స్, అంబేద్కర్లవి కుల, వర్గ జమిలి సిద్ధాంతాలే



- అబ్దుల్ నూర్ బాషా

భారతదేశ సామాజిక విముక్తి కోసం కారల్ మార్క్స్ సిద్ధాంతంతోపాటు బాబాసాహెబ్ అంబేద్కర్ కుల నిర్మూలన సిద్ధాంతపు జమిలీ అవసరమేనన్న అవగాహన జనంలో రోజు రోజుకీ బలపడుతోంది. కారణం, వారి గమనంలో తేడాలున్నా, ఇద్దరూ లక్షించిన గమ్యం మాత్రం ఒక్కటే. అదే కులరహిత, వర్గ రహిత సమాజం. ఆ మాటకొస్తే, ఎలాంటి పీడనలూ లేని సమ సమాజం. అయితే, కొందరు కమ్యూనిస్ట్, దళిత నేతలే కుల, వర్గ పీడితుల్ని రెండు పాయలుగా విడదీసి, ఏక తాటిపైకి రాకుండా ఎంతగానో కావలి కాస్తున్నారు. భుజం భుజం కలిపి ఆధిపత్య శక్తులపై కొట్లాడవలసిన ఈ రెండు మిత్ర శిబిరాలను కనీస ఐక్య కార్యాచరణ దిశ వైపు కూడా కన్నెత్తి చూడనివ్వడం లేదు. ఇక తమలో తామే విభేదాలు కల్పించుకొని విడగొట్టుకొనే ధోరణి ఎప్పటి నుంచో ఉండనే ఉంది. కమ్యూనిస్టు, దళిత శక్తులు రెండూ కలిసి పోరాడలేక పోవటానికి ఎవరి సాకులు వారికి సిద్ధంగానే ఉన్నాయ్. ముఖ్యంగా, మార్క్స్‌కి కులం గురించి అంతగా అవగాహన లేదని అంబేద్కర్ శిబిరం దబాయిస్తుంటే, అసలు అంబేద్కర్‌కి వర్గం అంటేనే అర్థం తెలియదని కమ్యూనిస్ట్ దళం బల్ల గుద్ది మరీ వాదిస్తోంది. "అలాంటప్పుడు ఈ రెండు శక్తులు కలిసి ఎలా పోరాటం చేస్తాయి?" అంటూ, మైత్రి కోసం తపన పడి మాట్లాడే వారినీ నిగ్గదీస్తున్నాయి కూడా.

వాస్తవానికి, మార్క్స్, అంబేద్కర్ సిద్ధాంతాలు రెండూ ఒకటేనన్న అపోహల్లో ఎవరూ లేరు. అలాగే, ఆ రెండు విరుద్ధ సిద్ధాంతాలను కలిపి మరేదైనా కొత్త తరహా సిద్ధాంతాన్ని ఆవిష్కరించాలనీ ఎవరూ ఉబలాట పడడం లేదు కూడా. ఎవరి సిద్ధాంతాలు వారు ఉంచుకొంటూనే వీలున్నంత మేరకు అయినా మైత్రి పోరాటాలు చేయడంలో ఎంతో గొప్ప శక్తి దాగున్నదనేదే అసలు ఉద్దేశం. లాల్ నీల్ మైత్రి అంటే ఇంతకుమించి మరేమి లేదు. అలా కాకుండా అలవాటు ప్రకారం ఎవరికి వారే దడి కట్టుకు కూసుంటే ఏదో సామెత చెపినట్లు "చేటలో సంసారం దోసిట్లో కొచ్చినట్టు"గానే ఉంటది మరి. ఎవరో శత్రు శక్తులైన మనువాద, కార్పొరేట్ ఫాసిస్టులతో చెలిమి చేసే కన్నా, సోదర శక్తులైన కమ్యూనిస్టులు, అంబేద్కరైట్లు ఐక్య కార్యాచరణ చేస్తే పీడిత జాతులకు పండుగ కాక మరేం ఉంటుంది? అయితే, ప్రస్తుతం ఆ మైత్రి గురించి, ఐక్య పోరాటాల గురించీ కాసేపు అలా పక్కన పెడితే, అసలు మార్క్స్, అంబేద్కర్ల సిద్ధాంతాలు ఎంత గాఢమైన భావ సారూప్యత కలిగినవో, సమకాలీన ప్రాసంగికత కలిగినవో పరిశీలించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

## మార్క్స్‌కి కుల వ్యవస్థపై స్పష్టత ఉంది

కారల్ మార్క్స్ అనగానే వెంటనే మనసుకి తట్టేది పెట్టుబడి దారి వ్యవస్థ, శ్రామికుల దోపిడీ, అదనపు విలువ, వర్గ పోరాటం ఇత్యాది అంశాలు. అంటే అంతా ఆర్థిక అంశాలేనని తోస్తుంది. కుల వ్యవస్థ, కుల దోపిడీ, సాంఘిక అణచివేత ఇత్యాది సామాజిక పదాలు అసలు కనిపించవు. అందువల్ల మార్క్స్‌కు కులం పట్ల లేశ మాత్రమైనా అవగాహన లేదనే ఒక అసంకల్పిత భావన కొందరు మేధావుల్లో సైతం ఏర్పడింది. అయితే వాస్తవం ఏమిటంటే, భారత దేశ కుల వ్యవస్థపై మహాత్మా జోతిబా పూలే, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌లకంటే ఎంతో ముందే లోతుగా అధ్యయనం చేసిన మేధావి కార్ల్ మార్క్స్. ఆయన కులంపై ఎన్నో గ్రంధాలు రాయలేదు. కానీ భారత దేశ కులవ్యవస్థపై కీలక సూత్రీకరణలు చేశాడు. కులం ఎలా పుట్టింది ? ఎలా బలపడింది ? మానవాళికి ఎలాంటి దుష్పరిణామాలు కొని తెచ్చింది? అసలు కుల వ్యవస్థకి అంతం ఎప్పుడు ? వంటి ప్రశ్నలకు నిక్కచ్చి సమాధానాలు ఆయన విశ్లేషణలోనే కనిపిస్తాయి.

## కులం పుట్టుక గురించి

తొలిసారిగా మార్క్స్ ఇండియాలో కులం పుట్టుక, ఆరంభంపై ఎంగిల్స్‌తో కలిసి రాసిన the German Ideology (1845) లో వివరించారు. భారతదేశంలో కులం పుట్టడానికి కారణం పెట్టుబడి దారి విధానపు పూర్వ దశలోనే చోటు చేసుకున్న మొరటు శ్రమ విభజనే (crude division of labour) అంటారు. అంటే అన్ని దేశాలలో లాగానే భారతదేశంలో కూడా తొలుత ఆర్థిక వర్గాలే ఏర్పాటయ్యాయని, ఆ తరువాత దశలో మాత్రమే ఆయా వృత్తులు ఏర్పడి, అవి క్రమేణా అనువంశికమై, ఆ వృత్తి సమూహాలే వర్ణాలుగా, ఆపై కులాలుగా ఏర్పాటు అయినాయనీ అంటారు. ఆ కులాలను స్థిరంగా కొనసాగించ డానికి దోపిడీ శక్తుల ద్వారా స్మృతులు పురాణాలూ ప్రజలపై రుద్దబడ్డాయనీ ఆ విధంగా కుల వ్యవస్థ ఘనీభవించిదనీ స్పష్టంగా విశ్లేషిస్తారు మార్క్స్. అదే విధంగా, కొందరు భావ వాదులైన చరిత్రకారులు కులమే ముందు పుట్టిందని. ఆ

తరువాతనే వర్గం పుట్టినట్లు రాస్తున్నారని, అలాంటి భావనను తాను అంగీకరించబోననీ కొట్టి పారేస్తాడు మార్క్స్. ఆయన మాటల్లో చెప్పాలంటే.. when the crude form of the division of labor, which is to be found among the Indians and Egyptians calls forth the caste system in the state and religion, the historian believes that the caste system is the power which has produced this crude social form. అంతేగాక కులాలు అనేవి ఎలాంటి బలవంతపు శాసనాల ఫలితంగా పుట్టుకు రాలేదంటారు మార్క్స్. తన Poverty of Philosophy(1847)లో ఇలా అంటాడు. under the caste system, there was division of Labour, in the whole of this society, according to fixed rules. Were these rules established by a legislator ? No. originally these laws were born of the conditions of material production. They were raised to the status of laws only much later. (Marx, Engles, Collected works, Vol. 6,page 184.)

కారల్ మార్క్స్ ఈ అన్యాయ, పక్షపాత కుల వ్యవస్థ జరిపిన మోసకారి శ్రమవిభజననూ వ్యతిరేకించాడు.. కులం అనేది "the most decisive impediment to Indias progress and power" అంటాడు తాను 1853లో రాసిన ఒక వ్యాసంలో. అంటే కులం సృష్టించిన పక్షపాత శ్రమ విభజన, క్రింద కులాల శ్రామికుల ఆర్థిక స్థోమతను దారుణంగా దెబ్బ తీస్తుందని మార్క్స్ అభిప్రాయం. అంటే కులానికి ఆర్థిక నిర్ణయక శక్తీ, స్వభావం ఉందని మార్క్స్ అభిప్రాయం. మార్క్స్ విశ్లేషణతో ఏకీభవిస్తూ ప్రసిద్ధ మార్కిసిస్టు మేధావి డి.డి.కోశాంబీ కులం అనేది ఉత్పత్తి సంబంధాలతో నేరుగా ముడిబడినదని వివరించారు. సూటిగా చెప్పాలంటే, తొలి ఉత్పత్తి సమాజంలో నైతే కులము, వర్గము ఒకటేననీ అంటారు.

Caste is an important reflection of the actual relations of production, particularly at the time of its formation.Caste is class at a primitive level of production, a religious method of forming social consciousness in such a manner that the primary producer is deprived of Surplus with the minimum coersion (quoted from the Economic and Political weekly, 26, july, 2008).

మార్క్స్ ఎంగెల్స్ రూపొందించిన కమ్యూనిస్ట్ ప్రణాళిక (1848)లో 'వర్గపోరాటం' అనే పదజాలాన్ని అన్నిరకాల పీడనలు, దోపిడీలు(ఆర్థిక, ఆర్థికేతర) కలిసే ఉన్నాయనే భావం లోనే వాడారు. ప్రణాళిక ప్రారంభంలోనే వాడిన ఈ మాటల్ని బట్టి అదే తెలుస్తోంది. The history of all hitherto existing society, is the history of class struggles. Free man and slave, patrician and plebeian, Lord and serf, guild master and journeyman, in a word, OPPRESSOR AND OPPRESSED, stood in constant opposition to one another.. అనే ఈ ప్రకటనలో కుల, మత, జాతి, తెగ, లింగ తదితర పీడనలన్నీ కలిసే ఉన్నట్లు అవగతం అవుతోంది. అయితే దేశీయ మార్క్స్ వాదులు ఆ స్పిరిట్‌తో దాన్ని ఆచరించకపోవడం, కులాన్ని కూడా వర్గ పోరాటంలో భాగంగా సమ్మిళితం చేసుకోలేకపోవడం, అది వేరే ముచ్చట, వేరేచర్చ. పైవిశ్లేషణ అంతా రెండు ముఖ్య విషయాలు వెల్లడిస్తుంది. ఒకటి, భారత దేశంలో కులాలు, కులం పుట్టుక, మానవ ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపినట్లు మార్క్స్‌కి మంచి స్పష్టతే ఉందని. రెండు, భారతదేశంలో వర్గ వ్యవస్థతో కులవ్యవస్థ కూడా బలంగానే ముడిబడి ఉందని.

## మార్క్స్ ప్రకారం కుల నిర్మూలన ఎలా?

ఇక కుల వ్యవస్థ ఎలా నిర్మూలన అవుతుంది? అనే ప్రాముఖ్యత గల ప్రశ్నకు కూడా మార్క్సిజం సమాధానాన్ని దాచలేదు. దాటవేయనూ లేదు. కుల నిర్మూలన అనేది పెట్టుబడిదారి వ్యవస్థ పూర్తిస్థాయి అభివృద్ధితోనూ, ఆ పై కార్మికవర్గ నేతృత్వం లో జరిగే వర్గ పోరాట విజయంతోను ముడివడి ఉంటుందం టారు. రైల్వే వ్యవస్థ బాగా అభివృద్ధి చెందినపుడు, దీంతోపాటు ఆధునిక పరిశ్రమలు అభివృద్ధి చెందినపుడు, శ్రామికులు ఎలాంటి ఆటంకాలు లేకుండా దేశమంతా స్వేచ్ఛగా తిరగడం, విస్తృతంగా పారిశ్రామిక రంగంలో శ్రామికులు పాల్గొనడం వల్ల ప్రాచీన కులము, కుల వృత్తి విభజన బలహీన పడుతాయని మార్క్స్ అంటారు. మరి భారతదేశంలో రైల్వే వ్యవస్థ అభివృద్ధి చెందినా కులం ఇంకా నిలిచే ఉంది కదా అంటే అది ఒక అపరిపక్వ పెట్టుబడిదారి సమాజం గురించి వచ్చే ప్రశ్నగానే భావించాలి. అలాగే, ఏ అన్యాయ శ్రమ విభజన అయితే కుల వ్యవస్థకు మూలమైందో, అలాంటి పక్షపాత కుల వృత్తి ధర్మం తొలగిపోయి, కులాతీతంగా అందరూ అన్ని రకాల వృత్తులను స్వేచ్ఛగా ఎంచుకునే సౌలభ్యం కేవలం ఒక్క కమ్యూనిస్ట్ సమాజంలో మాత్రమే సాధ్యం అవుతుంది అంటుంది కమ్యూనిజం. చివరిగా, "బూర్జువా వర్గం ఉత్పత్తి చేసే వాటిలోకెల్లా అతి ముఖ్యమైనది ఏదంటే, దానికి గోరీ కట్టే బలమైన కార్మిక వర్గాన్ని. కాబట్టి అది తన మరణ శాసనంని తానే రాసుకుంటుంది. అంతిమ విజయం కార్మిక వర్గానిదే" అంటారు మార్క్స్ కమ్యూనిస్ట్ ప్రణాళికలో. అంటే వర్గము, కులము తదితర దోపిడీ వ్యవస్థలకు అంతిమ పరిష్కారం వర్గం పోరాటమే అంటారు కారల్ మార్క్స్. ఇక మార్క్స్, ఎంగెల్స్ చెప్పిన పునాది-ఉపరి తలం సిద్ధాంతం, మొత్తం భారత కమ్యూనిస్టు శ్రేణుల్లో చాలా

కాలంగానే వక్రీకరణలకు, అపార్థాలకు బలైపోయినట్లు స్వయనా వారిలోనే ఎందరో అంగీకరిస్తారు. పునాది(ఆర్థికం) ఉపరి తలాన్ని (ఆర్థికేతర, సాంఘిక, సాంస్కృతిక అంశాలు) ఎలా ప్రభావితం చేస్తుందో. ఉపరితలం పునాదిని అలాగే ప్రభావితం చేస్తుందని గుర్తించడానికి వీరు చాలా కాలం శ్రమ పడాల్సి వచ్చింది. ఇప్పుడిప్పుడే కొందరు భారత కమ్యూనిస్టు నేతలు కులంని కూడా పునాది అంశంగానే చూడాలనీ, అది కూడా ఉత్పత్తి సంబంధాలను నిర్దేశిస్తుందని గుర్తించడం ఆహ్వానించ దగ్గ పరిణామమే.వాస్తవానికి భారత కమ్యూనిస్టులతో అంబేద్కర్ విభేధించడానికి ఒక బలమైన కారణం వారి యాంత్రిక సైద్ధాంతిక ఆచరణే అని విపులీకరిస్తారు తేల్ తుంబిడే (Anand Teltumbde, The Republic of Caste, Navayana publications, p. 114).

కులం విషయంలో కమ్యూనిస్టులవైపు సాగుతున్న అనాసక్తిని కొందరు సీనియర్ నేతలు, కమ్యూనిస్ట్ సిద్ధాంతకర్తలు ఆనాడే గుర్తించకపోలేదు. ఉదాహరణకు ఈఎమ్ఎస్ నంబూద్రిపాద్ ఇలా రాస్తారు.. **"కులం ఆధారిత, హిందూ మత వ్యవస్థపై రాజీ లేని పోరాటం అవసరం. కుల వ్యవస్థను ధ్వంసం చేయకుండా, సామ్య వాదాన్ని కాదు కదా, కనీసం లౌకిక ప్రజాస్వామ్యం కూడా సాధించలేం. సోషలిజంపై సాగే పోరాటాల్ని కులవ్యవస్థపై పోరు నుంచి విడదీసి చూడలేం"** అంటారు. అలాగే బిటి రణదివే కూడా "హిందూ మతం నిర్దేశించిన భూస్వామ్య విష భావజాలంపైనా పోరాడకపోతే సంస్కరణ వాదంలోనే కూరుకుపోయే ప్రమాదం ఉంది" అంటారు. (Economic and political weekly 26,july 2008)

ఈ విధంగా, భూస్వామ్య వ్యతిరేఖ వర్గ పోరాటబాటలో కుల వ్యతిరేఖ సాంస్కృతిక ఉద్యమాలను జోడించి నడపాలని అప్పుడే అన్ని రకాల దోపిడీలకు పరిష్కారం దొరుకుతుందని భారత కమ్యూనిస్టుల విధానంగా ఉంది. ఈ పందాతో కొందరికి ఏకిభావం ఉండడం, లేకపోవడం గురించి విశ్లేషించడం ఈ వ్యాసం పరిధిలో లేనీ అంశం.

## అంబేద్కర్‌కీ వర్గంపై అవగాహన ఉంది

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కి వర్గంపై కూడా తగిన అవగాహన ఉందనే విషయం చెప్పుకొనే ముందు, అసలు కుల వ్యవస్థ పుట్టుక గురించి మహాత్మా జోతిరావ్ పూలే, అంబేద్కర్ కీ గల అభిపాయాల గురించి మాట్లాడుకొందాం. పూలే అభిప్రాయం మార్క్స్ విశ్లేషణకి కొంచెం భిన్నంగానే ఉన్నట్లు కనిపిస్తుంది. భారతదేశంలో కులాన్ని, విదేశాల నుండి దేశంలోకి చొరబడి, దేశ ప్రజలపై యుద్ధం చేసి విజేతలైన ఆర్యులు రుద్దారని, ఆపై బ్రాహ్మణులైన వారే స్మృతులు పురాణాల బంధకాల్లో బిగించడం ద్వారా కులాన్ని దైవ దత్తమైనదిగా మార్చారని అంటాడు. తన విశేషమైన రచన "గులాంగిరి" కి రాసిన పీఠికలో ఈ మాటలు కనిపిస్తాయి. "శూద్రుడు, మహరీ, అంత్యజ, ఛండాలవగైరా అవమానకరమైన విశేషణాలతో ఆర్యులు వారిని పిలిచేవారు. కొన్నిచోట్ల ఆదివాసుల్ని నిర్బంధం గా వలస పోయేట్లు చేశారు. మరికొన్నిచోట్ల ఒకే దెబ్బన నరికేశారు". అంటూ ఆగ్రహం వెలిబుచ్చుతాడు పూలే. (హైదరాబాద్ బుక్ ట్రస్ట్ తెలుగు ప్రచురణలో) అయితే ఇలా కులం అనేదాన్ని నాటి బ్రాహ్మలు ప్రజలపై రుద్దారని నిర్ధారించినా, ఆ కులం ద్వారా శుద్రాతిసూద్రుల శ్రమనూ, ఉత్పత్తిని బ్రాహ్మణవర్గం కొల్లగొట్టేదని చెప్పడం ద్వారా, ఆచరణలో కులమే వర్గంగా ఉందనే భావం పూలేకి ఉన్నట్టు అర్థం అవుతోంది. అంటే మార్క్స్ చెప్పినట్టు కులం ఉత్పత్తి సంబంధాలతోనే ముడిబడి ఉన్నదని చెప్పకనే చెప్పినట్లే అవుతుంది. ఇక డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పూలే లాగా ఆర్య సిద్ధంతాన్ని అంగీకరించడు. ఆయన ప్రకారం మార్క్స్ ముందే చెప్పినట్లు, మొదట వృత్తి విభజన జరగడం. ఆ వృత్తి అనువంశికమై వర్ణ విభజనకు, అవి కాలక్రమేణా అంతర వివాహ విధానంతోడు అవడం చేత కులం ఏర్పడినట్లు విశ్లేషిస్తారు. అలాగే 'Classes have become castes through imitation and excommunication అంటూ వర్గాలే అనుకరణలు, బహిష్కరణల ద్వారా కులాలుగా మారి పోయాయి అంటాడు. ఇక ఆపై, యధావిధిగా స్మృతులు, పురాణాలూ ఆ వ్యవస్థ ఘనీభవించడానికి దోహద పడ్డాయం టారు. ( writings & speeches Vol.1) అయితే సామాజిక హితమైన శ్రమ విభజనను బందీఖానా లాంటి కుల వృత్తులతో సమానం చేసి చూడడం ఘోరమైన తప్పిదం అవుతుందని అంబేద్కర్ తన "కుల నిర్మూలన" గ్రంథంలో హెచ్చరించడం గమనార్హం. అందుకే "కుల వ్యవస్థ శ్రమ విభజన మాత్రమే కాదు. అది శ్రామికుల విభజన కూడా" అని సూత్రీకరిస్తాడు.

"నాగరిక సమాజానికి శ్రమ విభజన అవసరమే. అయితే శ్రమ విభజనతోబాటు శ్రామికుల విభజన జరగడం, వారి నడుమ అసహజమైన దాటడానికి వీలులేని అడ్డుగోడలు కట్టడం ఏ నాగరిక సమాజంలోనూ లేదు. ఈ కార్మిక విభజన స్వచ్ఛంద మైనట్టిది కాదు. వారి వారి సహజ స్వభావాలను, అభిరుచులను బట్టి చేయబడ్డది కాదు" అంటూ కుల దౌష్ట్యంపై న్యాయమైన ఏవగింపును, వ్యతిరేఖతను వ్యక్తీకరిస్తారు అంబేద్కర్. అందుకే, "మనం కేవలం రాజకీయ సమానత్వంని మాత్రమే కలిగి ఉండరాదు. సాంఘిక, ఆర్థిక సమానతలు పునాదులుగా లేని రాజకీయ సమానత మనలేదు" అంటారు అంబేద్కర్. దీన్నొక ఆలోచన చేయవలసిన విషయంగా అన్ని శిబిరాలూ గమనిం చాలి. అయితే మార్క్స్ వర్గంపై రాసినంత విశదంగా కులంపై రాయడం అప్పటికున్న పరిస్థితుల్లో ఆయనకు సహజంగానే

కుదరలేదు. కారణం స్పష్టమే. కుల నైచ్యాన్నీ, దురహంకారాన్నీ, పీడితులను నిలువునా విభజించే తత్వాన్ని, మార్క్స్ దగ్గరగా చూడడానికి గానీ, అనుభవంలోకి తెచ్చుకోడానికి గానీ సాధ్యం కాని పరిస్థితే ఆనాడు ఉంది. వర్గం అనేది పీడితుల ఐక్యతకు ఆలంబన శక్తి అయితే, కులం అనేది ఐక్య సాధనం కాకపోగా, పీడితులను విడదీసే ఒక విచ్ఛిన్న శక్తిగా అవతరించింది. సరిగ్గా ఈ అంశాన్ని, అవగాహనా పటిమతో వివరమైన రీతిలో పూరించిన మేధావి, తాత్వికుడు, కుల పీడితుడు, సాంస్కృతిక ఉద్యమ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్కడే. అందుకే అంబేద్కర్ కులాలు సంఘటితం కావడాన్ని కోరలేదు. కులాల నిర్మూలనే కోరాడు. అందరికి తారక మంత్రంలా ఒంటబట్టిన అంబేద్కర్ హితోక్తి "కులం పునాదులపై ఒక జాతిని నిర్మించలేరు. ఒక నీతిని నిర్మించలేరు" అనేదాన్ని ఇక్కడ అందరూ స్మరించుకోవాలి. ఈ కీలక విశేషాల్ని బట్టే భారతదేశంలో సామాజిక విముక్తికి మార్క్స్ తోపాటు అంబేద్కర్ అవసరం కూడా తోడు కావాల్సి ఉందని నిర్ధారించుకోవాలి.

### అంబేద్కరికి వర్గంపై స్పష్టత ఉంది

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎంతసేపూ కులవ్యవస్థ, కుల నిర్మూలనపై మాత్రమే ఎంతో రాశారని, అయితే ఆయనకు వర్గమన్నా, వర్గ పోరాటమన్నా అసలు సరిపడని మాటలు అంటూ కొందరు కమ్యూనిస్టులు ఇప్పటికీ గట్టిగానే వాదిస్తారు. అందుకే ఆయనతో కలిసి పోరాటం చేయడం తమకు కుదిరే పనికాదని కూడా తెగేసి చెబుతున్నారు. వాస్తవం ఏమంటే, అంబేద్కర్ భారత సమాజంలో గల వివిధ వర్గాల్ని గుర్తించడమే గాక, ఎన్నో కార్మిక. రైతాంగ పోరాటాల్ని నడిపిన చరిత్ర గల వాడు. దోపిడీ వర్గ వ్యవస్థ నిర్మూలన ఎలా అనే అంశంపై కూడా తన దృక్పథం వివరించిన సందర్భాలూ ఉన్నాయ్.. వాస్తవం ఏమంటే, అంబేద్కర్ గొప్ప అర్థ శాస్త్రవేత్త. ఆయన పిహెచ్‌డి గ్రంథమే THE PROBLEM OF RUPEE అనే ఒక క్లిష్టమైన ఆర్థిక శాస్త్ర అంశం మీద. ఇంతకీ భారతదేశంలోని ఆర్థిక వర్గ వ్యవస్థపై అంబేద్కర్ ఏమన్నాడో వివరంగా చూద్దాం.

### 1. కులము వర్గము జమిలి వ్యవస్థలే

అంబేద్కర్ దృష్టిలో వర్గాన్ని కులం నుండి వేరు పరచలేం. ఎందుకంటే కుల వ్యవస్థ అనేదే దోపిడీ కోసం కనిపెట్టబడింది. 1916లోనే అయన కొలంబియా యూనివర్సిటీకి సమర్పించిన CASTES IN INDIA అనే పరిశోధన పత్రంలో "class and castes are next door neighbors" అని చాలా స్పష్టంగా పేర్కొంటాడు. అంటే కులము వర్గం అనేవి ఈడూ జోడుగా నడిచే మిత్రుశక్తులేనని చెప్పారు. అంటే, గొప్ప కుల పోడికి వీర భోజ్యం, కులం తక్కువోడికి ముష్టి కూడేనని తెలిపోయినట్లే గదా? అంటే ఉత్పత్తి వనరులు అన్నీ పెద్ద కులపోడికీ, రెక్కల కష్టం మాత్రమే శుద్రాతి శూద్రులకన్నమాట. అది కూడా ఒక తరానికి కాదు. తరతరాలకు కూడా. సరిగ్గా ఈ నేపథ్యంలోనే అంబేద్కర్ కులంకి బేషయిన నిర్వచనం చెప్పాడు. A caste is an enclosed class అని. అంటే కులం అంటే కేవలం ఏదో ఒక సాంస్కృతిక అంశం మాత్రమే కాదు. కులానికి వర్గ స్వభావం ఉంది అని స్పష్టం చేశాడు. అందుకే కులం అనేది తన చుట్టూ తాను దడి కట్టుకున్న వర్గమేనయ్యా అన్నాడు. పైగా కులం అనే ఈ బలవంతపు దడులు, తలుపులు ఎలాంటివి అంటే 'పెద్ద' కులాలకి ఆయుధాలుగానూ ఉపయోగపడితే, నిమ్న కులాలకి తమ మొఖం మీదే వేసిన గెంటివేతలుగా అభివర్ణించాడు. some closed the door; others found it closed against them అని కులం పై సూటైన వాస్తవం విప్పి చెప్పాడు అంబేద్కర్. (అంబేద్కర్ రచనలు, సంపుటి 1, పుట 18). అందుకే భారత కార్మిక వర్గానికి ఇద్దరు శత్రువులు ఉన్నారనీ, ఒకరు పెట్టుబడిదారి వ్యవస్థ అనీ మరొకరు బ్రాహ్మనిజం అని స్పష్టపరుస్తాడు అంబేద్కర్.

### 2.కుల-వర్గ పోరాటాలకు అంబేద్కర్ సారధ్యం

ఇంత విశాల అవగాహనను ఒంట పట్టించుకున్న వాడే కాబట్టి, అంబేద్కర్ కులం వర్గ పోరాటాలను అంటే capitalism and brahminismలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు నడిపాడు. వాటిని కమ్యూనిస్టులు బలపరిచారు. కలిసే పోరాడారు. స్వాతంత్ర ఉద్యమ తొలినాళ్ల నుండి 1940ల దాకా ఇలాంటి లాల్ నీల్ మైత్రి అనుబంధం ఆనాడే కొనసాగింద నటంలో అతిశయోక్తి లేదు. (కొన్ని పోరాటల్లో అప్పుడప్పుడు బేదాభిప్రాయాలు వచ్చినా) 1927లో మహద్ చెరువులో దళితులు నీళ్లు తోడుకోవడం కోసం పోరాటం మొదలు, మనుధర్మ శాస్త్రాన్ని బహిరంగా తగలబెట్టడం, అంతకుముందే 1930 లోనే నాసిక్‌లో దళితులు దేవాలయ ప్రవేశం కోసం నిరసన చేసే వరకు కూడా కమ్యూనిస్టులు అంబేద్కరితోనే కలిసి నడిచారు. అలాగే 1938లో కార్మిక ఉద్యమాలపై ప్రభుత్వ దమనకాండ, పారిశ్రామిక వివాదాల చట్టంపైనా, కార్మిక సంఘాల గుర్తింపుకీ కఠిన నిబంధనలు రుద్దడంపైనా అంబేద్కర్‌తో కమ్యూనిస్టులు కలిసే పోరాడడం జరిగిన చరిత్రే కదా ? అప్పుడే వస్త్ర పరిశ్రమలో దళితులపై చూపుతున్న వివక్షకి వ్యతిరేకంగా అంబేద్కర్ గొప్ప పోరాటం నడిపాడు.(అయితే కమ్యూనిస్టులు కొంతవరకే కలిసి పోరాటంలో పాల్గొన్నారు.) రైతులు, కౌలుదార్లనీ హింసించే విధంగా, బలవంతపు శిస్తు వసూళ్లు, వెట్టి చాకిరీని అమలు చేసే ఖోటీ వ్యవస్థ(1920–49)కి వ్యతిరేకంగా మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతంలో కూడా, 10,000 మందికి పైగా రైతులతో అంబేద్కర్ నేతృత్వంలో జరిగిన అసెంబ్లీ యాత్రలో సైతం కమ్యూనిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంకీ

మద్దతుగా కామ్రేడ్ రణదివే నాయకత్వంలో బొంబాయి కార్మిక సంఘాలు సంఘీభావం తెలియచేసాయి. ఇలాంటి పోరాటాలన్నీ అంబేద్కర్-కమ్యూనిస్ట్‌లు కలిసి చేయడం ఒక చారిత్రక వాస్తవం కాగా, రెండవది, అంబేద్కర్ బ్రాహ్మినిజంతోబాటు కాపిటలిజంపై కూడా గట్టి పోరాటాలే నడిపినట్లు అర్థం అవుతోంది.

అన్నిటికన్నా ముఖ్యంగా దళితులకు భూమి లేకుండా అసలు ఆత్మ గౌరవమే ఉండదన్నాడు అంబేద్కర్. అందుకే ఆయన దళితులందరికి భూమితోబాటు, విద్య, ఉపాధి, రిజర్వేషన్లు ఖచ్చితంగా ఉండాలన్నారు. పబ్లిక్ రంగాన్ని కాపాడుకోవాలి అన్నారు. అన్నిటికిమించి ఆయన రాజీ లేని సోషలిస్టు. అందుకే ఆయన స్పష్టంగా స్టేట్ సోషలిజంని ప్రతిపాదించాడు. తాను రాసిన STATES AND MINORITIES(1946) గ్రంధంలో రాజ్యం నాయకత్వంలోనే సోషలిజం ఎలా సాధించాలో వివరించాడు. భూమితో బాటు కీలక పరిశ్రమలన్ని ప్రభుత్వ యాజమాన్యంలోనే నడవాలని, అందరికి ప్రభుత్వమే బీమా సదుపాయాలు కల్పించాలని, భారత రాజ్యాంగంలో కూడా ఇవి ప్రాధమిక హక్కులుగా చోటు చేసుకోవాలని ప్రతిపాదించాడు. ప్రాకులాడాడు. అటు రాజ్యాంగ సభలోని శ్రీమంతులైన సభ్యులకు ఈ సూచన ఎంతో ఇరకాటం కలిగిస్తే, ఇటు కమ్యూనిస్టులకు రాజ్యం నాయకత్వంలో జరిగే సోషలిజం పక్కా పరిహాసాస్పదమైనదని అనిపించింది. ఈ రెండు శిబిరా లూ తన సోషలిస్ట్ ఆలోచనలను అంగీకరించ నిరాకరించాయి. అందుకే తాను సారధ్యం వహించిన భారత రాజ్యాంగంపై ఒక ప్రసంగంలో తానే అయిష్టత, అసంతృప్తిని వ్యక్తపరిచాడు. అంటే అంబేద్కర్‌కు భారత సమాజాన్ని సమస్త దోపిడీ శక్తుల నుంచి విముక్తి చేయాలనే ఒక సంకల్పం, గొప్ప సోషలిస్ట్ సమాజాన్ని, దళిత బహుజనులను ఆత్మ గౌరవంతో జీవించే వ్యవస్థను సాధించాలనే గొప్ప దీక్ష ఉన్నట్లు బోధపడడం లేదా? ఆయన ఆలోచనలు బుట్టదాఖలా కావచ్చు, కమ్యూనిస్టు సిద్ధాంతంతో విభేదించనూ వచ్చు కూడా. అయినా అంబేద్కర్ సోషలిస్ట్ భావాలు లేనివాడు కాకపోడు కదా? అంబేద్కర్ వర్గ పోరాటంకి దూరంగా, ఆర్థిక పోరాటాలకు వ్యతిరేకంగా కాలక్షేపం చేసిన వాడు వాడు కాడు కదా? అసలు అంబేద్కర్‌కి తామే వారసులం అనీ గొప్పలు పలికే కొందరు నాయకాగ్రేసరులే అంబేద్కర్ మార్గాన్ని బొత్తిగా పక్కన పడేసి, కార్పొరేట్, మనువాద శక్తులతో జత కట్టి హెూదాలు పొందడం, వారితో పెట్టుబడులు, ప్రభుత్వ అధికారం పంచుకోడాని కోసం వెంపర్లాడడం.. ఇదే నేటి నిక్క మైన నిజం కావడం ఎంతో అపచారం కదా? ఇది అంబేద్కర్ని అవమానించడమే గానీ అభిమానించడం ఎలా అవుతుంది? అభిమానించడమే నిజమైతే, ఈ దేశంలో నిత్య కళ్యాణంగా సాగే ప్రభుత్వ రంగ నిర్వీర్యం, ప్రైవేటీకరణ దుమారాన్ని అడ్డుకొనే ఆందోళనలు దళిత సారధ్యంలో ఎంతమేరకు కనిపిస్తున్నాయి? కార్మిక, రైతాంగ సంక్షోభాలపై దళిత పోరాటాలు ఎక్కడ బద్దలవుతున్నాయి? కాబట్టి అంబేద్కర్ చాలా గొప్పవాడనో, ఆయనకు వర్గ జ్ఞానం సమృద్ధిగానే ఉందనో వ్యక్తి పూజ చేయడం ఒక్కటే గొప్పకాదు. ఆయన సిద్ధాంత అడుగు జాడల్లో నడవడమూ, వర్గ కుల స్పృహతో పోరాడడమూ ముఖ్యమేనని ఎందరో మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నమాటలూ ఒంట పట్టించుకోవాలి.

### 3.అంబేద్కర్ ప్రకారం వర్గ రహిత సమాజం ఎలా ఏర్పడుతుంది?

కులంని రద్దు పరచుకోకుండా ఏ విప్లవమూ వర్ధిల్లదని అంబేద్కర్ దృఢ అభిప్రాయం. ఒకవేళ అలాంటి విప్లవం సాకారమైనా, విప్లవం తర్వాతనైనా కులభూతం మీకు అడ్డుగానే నిలుస్తుంది గదా? అంటారు అంబేద్కర్. అంటే భారత దేశంలో సామజిక విప్లవం విజయవంతం కాకుండా, రాజకీయ విప్లవాలేవి వర్ధిల్లవనేది ఆయన బలమైన సూత్రీకరణ. అంటే విప్లవానికి అవసరమైన కార్మికవర్గ ఐక్యత కులం రద్దుతో మాత్రమే సాధ్యపడుతుంది అనేది అంబేద్కర్ విశ్లేషణ సారం.

అంత మాత్రాన అంబేద్కర్‌కి ఆర్థిక దోపిడీ శక్తులపై పోరాటం అవసరం లేదని చెప్పడం అస్సలు కాదు. పైగా, ఆర్థిక దోపిడీ శక్తుల్ని ఓడించడం ద్వారా మాత్రమే నిజమైన కార్మికవర్గ విముక్తి లభిస్తుంది అనేది అంబేద్కర్ అభిప్రాయం. ఆయన ఒక ప్రసంగంలో "దేశ శ్రామిక వర్గం నేడు సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి, భూస్వామ్య వ్యవస్థల చేతిలో బందీ అయింది. ఈ పరిస్థితి నుంచి శ్రామిక వర్గం విముక్తి అయితేనే, భారత జాతికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లు"అంటారు. (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రసంగాలు vol1) . కాబట్టి వర్గవ్యవస్థ నిర్మూలన పట్ల అంబేద్కర్‌కి కమ్యూనిస్టులకు ఏమాత్రం తీసిపోనంత విశాల అవగాహన ఉన్నట్లే గదా? (అయనకు మార్క్సిజం సిద్ధాంతం పట్ల, పోరాట రూపాల పట్ల తేడాలు ఉండవచ్చు గాక). నిజమే. అంబేద్కర్ ఏనాడూ మార్క్స్ వాదంకి బద్దుడు కాడు. పైగా అది స్వేచ్ఛా జీవన విధానానికి ఆటంకమని భావించాడు కూడా. అప్పటి బ్రాహ్మణ భారత కమ్యూనిస్టు నేతలు అగ్రకుల, మనువాదులే అన్నాడు. అందుకే వారు పునాది-ఉపరితలం సిద్ధాంతంలోనూ ఆర్థికవాదంలోనూ కూరుకుపోయారని ఆరోపించాడు. అంతకుమించి సోషలిజాన్ని హింసా మార్గంలోనూ, శ్రామికవర్గ నియంతృత్వం ద్వారానూ సాధించాలనే కమ్యూనిస్టుల సిద్ధాంతానికి తాను వ్యతిరేకినని చెప్పాడు.

తాను మార్క్స్‌కి బదులుగా బుద్ధిజం మార్గాన్ని, సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే దృష్టిని స్వాగతిస్తున్నానని చెప్పారు. బహుజన హితాయా, బహుజన సుఖాయ అనే నిర్మలమైన, నిష్పాక్షిక మార్గంని మానవాళికి నిర్దేశించిన బౌద్ధ ధర్మమే నా మార్గం అని ప్రకటించారు అంబేద్కర్ తన మలి దశ విశేష ప్రసంగం/రచన BUDHA OR KARL MARX (1956)లో.

అయితే, విశేషం ఏమిటంటే, అంబేద్కర్‌కి పూర్తిగా మార్క్స్ భావాల పట్ల ఏహ్య భావమే మిగిలిపోయిందనీ చెప్పలేం. ఆయన ఒక సందర్భంలో మాట్లాడుతూ ఎవరు ఏమి చెప్పినా పరిశీలించి అంగీకరించాలి అంటారు.

I am prepared to pick and choose from every one, socialist, communist or other. I do not claim infallibility and as Buddha says, there is nothing infallible; there is nothing final and every is liable to examination (vol. 1, p. 960). ఆ దిశలో భాగంగానే కావచ్చు, రష్యాలో మార్క్సిజం విజయాన్ని కీర్తిస్తూ తన సొంత పత్రికలు, మూకనాయక్, జనతా లలో, గొప్ప వ్యాసాలు రాసారు అంబేద్కర్. అలాగే, మార్క్స్ రాసిన పెట్టుబడి గ్రంధం ఇంకా మరాఠీలోకి అనువాదం జరగకముందే, (1960దాకా జరగలేదు) 1930ల్లోనే అంబేద్కర్ తన జనతా పత్రికలో 'మోల్, మజూరి, బంధ్వల్' (వేతనాలు, శ్రమ, పెట్టుబడి) పేరిట ప్రముఖంగా ప్రచురించారు. (ఆనంద్ తెలతుంబడే పుస్తకం నుండి). పైవిశ్లేషణ రెండు విషయాలు తెలియచేస్తుంది. ఒకటి, అంబేద్కర్‌కి భారతదేశంలోని వర్ణ వ్యవస్థపై మంచి అవగాహన ఉందని, రెండు, భారత దేశంలో కులము వర్గము కలిసే ఉన్నాయని, అందుకే జమిలి పోరాటాలే శరణ్యమని అంబేద్కర్ ఉద్దేశమని, కాబట్టి, మార్క్స్ గానీ అంబేద్కర్ గానీ ఏదో ఒక ఇరుకు మార్గంని ఎంచుకొని తమ చుట్టూ గిరులు గీసుకోలేదు. గిరులు గీస్తున్న వారు ఆయా మహా వృక్షాల పేర్లు చెప్పుకొని స్వార్ధ రాజకీయాలు నడిపే కొందరు దళారీలు మాత్రమే. ఈ దళారీ, స్వప్రయోజన రాజకీయాల ఉచ్చులో పడి పీడిత ప్రజలు శాశ్వత బంధీలు కారాదు. ఇప్పటికైనా లాల్ నీల్ ప్రజాస్వామిక శక్తులు ఐక్యకార్యాచరణ వైపు, మైత్రి భావంతో ముందుకు కదిలితేనే, ప్రస్తుత ఫాసిస్టు మనువాద వ్యవస్థకు ముకుతాడు వేయగలరు. అంతిమంగా దోపిడీ రాజ్యానికి సమాధి కట్టగలరు. అలాగే, లాల్ నీల్ మైత్రి అనేది కేవలం భావజాలం, ప్రచారాలకే పరిమితం అయితే ఎలాంటి ఉపయోగం లేదు. అది కార్యరూపం కూడా దాల్చాలి. ఉభయ శిబిరాలూ పోరాటాల్లోకి దిగితేనే అనుభవాల్లోంచి మైత్రి సాధ్యం అవుతుందనేది గమనించడం అవసరం. లాల్ నీల్ మైత్రి వర్ధిల్లాలి.

# అసమానతల అంతమే ..

**(24వ పేజీ తరువాయి)** కార్మికులకు కనీస వేతనం కూడా ఇవ్వని దుస్థితి. కార్మికులు కనీస వేతనం పిఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, ఉద్యోగ భద్ర త కోసం చేస్తున్న సార్వత్రిక సమ్మెలు చూస్తున్నాం. అయన స్త్రీ సమాన త్వం కోసం హిందూ కోడ్‌బిల్ పెడితే అది ఆమోదం కాకపోవడంతో ఆయన రాజీనామా చేశారు. నేడు మహిళలంటే ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తించే పార్టీ అధికారంలో ఉండడం వల్ల మహిళలపై హింస పెరిగింది. తెలంగాణ ఎన్నికల్లో బీసీ సీఎం అని ప్రకటించారు ఆయనే ఓబీసీ పీఎంగా ఉండి ఓబీసీలకు చేసిందేమీ లేదు. బీసీ కులగణన చేపట్టబోమని సుప్రీంకోర్టుకు సైతం వెళ్లిన ఘనత బీజేపీదే. రాష్ట్రంలో వారి పార్టీ బీసీ అధ్యక్షుడిని తొలగించిన తెలిసిందే. 56 శాతం ఉన్న బీసీలకు బడ్జెట్‌లో కేవలం నాలుగు శాతం నిధులు కేటాయించడం ఇవ్వన్నీ బీజేపీ బీసీలను మోసగించినవి కావా? ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ గురించి తొమ్మిదేండ్లుగా కనీస అపాయింట్ మెంట్ ఇవ్వని మోడీ నేరుగా ఎమ్మార్పీఎస్ సభలో పాల్గొనడం మోసం కాకపోతే ఇంకేమిటి ? గొర్రె కసాయి వాడిని నమ్మినట్లుగానే మందకృష్ణ మోడీని నమ్మడం తద్వారా ఎస్సీలను బీజేపీ ఓటు బ్యాంక్‌గా మార్చడం కోసమేనని స్పష్టమవుతోంది. కుల నిర్మూలన పోరాటం శాంతియుతంగా జరగాలనే కోరుకున్నాం. కానీ హింసను ఒక సాధనంగా మనువాద పాల కవర్గం ఉపయోగిస్తూ ఈ పోరాటాలను అణచివేస్తున్నది. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ లేదు. గత డెబ్బయేండ్లలో వేలాది మందిని హత్య గావించబడ్డారు. ఈ మధ్యకాలంలో జరిగిన కుల దురహంకార హత్యలను మనం ఇంకా మరిచిపోలేదు. పెరుమాండ్ల ప్రణరు, మంథని మధుకర్, అంబోజి నరేష్ హత్యలు అందుకు ఒక ఉదాహరణ. ఇంకా చెప్పాలంటే కులం, భూమి రెండూ విడదీయరాని అంశాలు. ప్రజలు భూమ్మీద హక్కుల కోసం భూస్వాముల సొంత సాయుధ ముఠాలతో పోరాడడంతో వాళ్ల మీద హింసకాండ సాగింది. ఎన్నుకోబడిన పాలకవర్గాలే వెన్నుదన్నుతో భూస్వాములను ప్రోత్సహించడం శోచనీయం. కూలీ రేట్లు పెంచమని అడిగి నందుకు తమిళనాడులోని కీళవేణ్మనిలో సామూహిక హత్యా కాండ, మహారాష్ట్రలో ఖైర్లాంజీ ఊచకోత, ఆంధ్రలో కారంచేడు, చుండూరు, వేంపెంట, పదిరి కుప్పం, లక్షింపేట, జరిగిన హత్యలు అందుకు సాక్ష్యం. సైద్ధాంతికంగా కుల, మత ఫాసి జాలను వ్యతిరేకిస్తూ పోరాడిన వారిని హత మార్చడం కూడా అందులో భాగమే. కల్బుర్గి, దబోల్కర్, గౌరీ లంకేష్, రోహిత్ వేముల వంటి అనేక మందిని పొట్టనెట్టుకున్న సంగతి మరువలేం. ఈ అసమానతల అంతం కోసం సాగే పోరాటంలో అనేక మంది అసువులు బాసారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ రద్దుకు బీజేపీ అనేక కుట్రలు చేస్తోంది. మనుస్మృతిని మన రాజ్యాంగంగా ప్రవేశపెట్టి, దేశాన్ని మత రాజ్యాంగ మార్చాలని భావిస్తోంది. దీనిని అడ్డుకొని రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి. అంబేద్కర్ ఆశయాలను నిలబెట్టడడం, రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రక్షించుకోవడం, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ ఉద్యమం మహోన్నతంగా సాగాలి. అదే మనం అంబేద్కర్‌కు అర్పించే నివాళి. ❑

# వైజ్ఞానిక స్వాప్నికుడు, నిరీశ్వరవాది, తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ



- డాక్టర్ దేవరాజు మహారాజు

వైజ్ఞానిక రంగంలో మన దేశం ఈ రోజు ప్రపంచంలో తలెత్తుకుని నిలబడిందంటే అందుకు కారణం మన తొలి ప్రధాని, హేతువాది పండిట్ జవహర్‌లాల్ నెహ్రూయే. ఆయన వైజ్ఞానిక స్వాప్నికుడు, నిరీశ్వరవాది, గొప్ప దార్శనికుడు. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని త్యాగం చేసిన త్యాగధనులు ఆ కాలంలో ఎంతోమంది ఉన్నారు. ఎవరికీ లేని వైజ్ఞానిక దృక్పథం, పట్టుదల కార్యదీక్ష ఉన్నందు వల్లనే నెహ్రూ ఈ దేశానికి తొలి ప్రధాని, దేశ నిర్మాత కాగలిగారు.

గాంధీజీని జాతిపితగా దేశం గుర్తుంచుకుంది. అలాగే జాతి నిర్మాతగా నెహ్రూని గౌరవించుకుంది. బ్రిటిష్ వారు ఇండియాను వదిలి వెళ్ళిన తర్వాత, ఈ దేశ పరిస్థితి ఎలా ఉంది ? మూడు వందల ఏళ్లు నివాసం వుండి, ఇల్లు ఖాళీ చేసి పోయినట్లుగా అస్తవ్యస్తంగా, చిందర వందరగా, అస్థిరంగా ఉంది. అన్నీ చక్కదిద్దుకుంటూ చాకచక్యంగా అన్ని రంగాల్ని సంఘటితపరుస్తూ దేశాన్ని పునర్నిర్మించారు నెహ్రూ. దేశం నిండా చిన్న చిన్న సంస్థానాలు రాజ్యమేలుతున్నప్పుడు వాటిని ఒక్క తాటిపైకి తెచ్చి విశాల భారతానికి రూపకల్పన చేశారు. సంస్థానాల్ని విలీనం చేసుకున్న ఘనత అంతా వల్లభాయ్ పటేల్‌దేనని ఇప్పటి ప్రభుత్వం చరిత్రను వక్రీకరిస్తూ ఉంది. ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే విషయం అర్థమవుతుంది.

పటేల్‌ను మనం ఏ మాత్రం తక్కువ చేసి మాట్లాడాల్సిన అవసరం లేదు. కాని, ఆయన నెహ్రూ కేబినేట్‌లో హోం మినిస్టర్ మాత్రమే! ప్రధానికి తెలియకుండా ఏ హోం మంత్రి నిర్ణయాలు తీసుకోదు. వాటిని అమలు చేయలేదు. నెహ్రూ అనుమతి, అంగీకారం లేకుండానే పటేల్ - దేశ సమైక్యతకు కృషి చేశారనడం అర్ధసత్యం. అలాగే కాశ్మీర్ విషయంలో నెహ్రూ తప్పు చేశారని నేటి ప్రభుత్వ పెద్దలు డప్పు కొట్టడమూ అర్ధసత్యమే. నిజంగా అది తప్పయితే వారి హోం మంత్రి పటేల్ బాధ్యత కూడా అందులో ప్రధానంగా ఉంటుంది కదా! రాజకీయాలను పక్కనపెట్టి, నెహ్రూజీ ఎందుకు దార్శనికుడ య్యారో చూద్దాం. ముందుచూపుతో ఈ దేశానికి కావల్సినవన్నీ సమకూర్చి వాటిని పటిష్ట పరచడానికి నిరంతరం కృషి చేసిన వాడాయన.

ఆయన దేశ ప్రధానిగా ఉన్న పదిహేడేళ్ల కాలంలో “భారతదేశ ఆధునిక దేవాలయాలు’ అనదగిన ఎన్నో ప్రాజెక్టులు పూర్తి చేశారు. అయన కాలంలోనే అవన్నీ ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. పండిట్ నెహ్రూ వైజ్ఞానిక స్పృహగల ప్రధాని గనుక, ఈ దేశ ప్రజలకు విద్య అవసరమని, మరీ ముఖ్యంగా వైజ్ఞానిక విద్య పరిశోధన చాలా అవసరం అని గుర్తించారు. ఆయన తీసుకున్న చొరవ వల్లనే దేశమంతటా శాస్త్ర పరిశోధన శాలలు విస్తృతంగా అభివృద్ధి అయ్యాయి.



ఇప్పుడు దేశంలో వున్న ప్రముఖ వైజ్ఞానిక సంస్థను దేన్ని తీసుకున్నా, దాని నేపథ్యంలో నెహ్రూయే కనిపిస్తారు. ఉదాహరణకు ప్రస్తుతం విజయదుందుబి మోగిస్తున్న ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ సెంటర్, బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమీ ఎండ్ ట్రాపిన్స్, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్

ఫండమెంటల్ రీసెర్చ్ వంటి ముఖ్యమైన పరిశోధన కేంద్రాల న్నింటికీ రూపకల్పన చేసింది, ప్రారంభించింది, అవి సజావుగా నడవడానికి స్ఫూర్తిని ప్రోత్సాహాన్ని ముఖ్యంగా ఆర్థిక వనరుల్ని సమకూర్చింది మన తొలి ప్రధాని నెహ్రూజీయే. అంతేకాదు, రక్షణ శాఖకు సంబంధించిన ఎన్నో పరిశోధన కేంద్రాలకు నెహ్రూ ఊతమిచ్చారు. డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లాబొరేటరీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లాబొరేటరీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వంటివి మరెన్నో ఉన్నాయి. స్వాతంత్ర్యం లభించిన తొలి నాళ్ళలో భారతదేశ పరిస్థితి–తుపానులో కొట్టుకొచ్చిన మొక్కలాంటిది. దాన్ని నిలకడగా ఉంచి నారు, నీరు పోసి, వేళ్ళు భూమిలో నాటుకునేట్టు చేసి, నిటారుగా నిలబెట్టడం ఆషామాషీ కాదు. ఎంతో అంకితభావం కావాలి. పరాయి పాలనలో అస్థిత్వాన్ని కోల్పోయిన ఈ దేశం సర్వ స్వతంత్రంగా నిలదొక్కుకోవడానికి, ఎదిగి మహావృక్షమై విస్తరించడానికి తొలి నాళ్ళలో నెహ్రూ చేసిన ప్రయత్నం అసామాన్యం. ఆయనలోని వైజ్ఞానిక దృక్పథం, లలిత కళలపై గల మక్కువ, పిల్లలంటే ఉండే ప్రేమ ఆయనతో ఎన్నో మంచి పనులు చేయించింది.

సాహిత్య, సాంస్కృతిక అకాడమీలు, బాలల అకాడమీ వంటి ఇతర జాతీయ సంస్థలన్నింటినీ ప్రారంభించి, నిలబెట్టింది నెహ్రూజీనే. అర్ధ శతాబ్దానికిపైగా నిరంతరం పరిశోధనలకు అంకితమైన ఈ జాతీయ పరిశోధన సంస్థలకు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయించే నిధులే ఇవ్వలేకపోతూ ఉంది. ఇది నేటి దుస్థితి. పైగా ప్రైవేటు సంస్థలు, వ్యక్తుల నుంచి ఆర్థిక వనరులు సంపాదించుకోవాలని సూచిస్తోంది. ఎందుకంటే ఈ ప్రభుత్వానికి యోగులు, సాధువులు, బాబాలు తప్ప వైజ్ఞానికులు కనబడడం లేదు. నెహ్రూజీకి ఉన్న వైజ్ఞానిక దృక్పథం ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలకు నచ్చదు. అందుకే ఆయనను, ఆయన కృషిని తక్కువ చేసి మాట్లాడుతూ ఉంటుంది. వెనక్కి నడిచే వాడికి ముందుకు పోయేవాడు నచ్చడు కదా?

**భాక్రానంగల్, సట్లజ్, హీరాకుడ్, మహానది, నాగార్జునసాగర్ వంటి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణాలన్నీ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడే అయ్యాయి. గంగ, యమున, కావేరి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, కృష్ణా నదులపై ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది ఆయన హయాంలోనే. వాటివల్ల దేశంలో హరిత విప్లవం సాధ్యమైంది. తాగునీరు దొరికింది. సామాన్యుల జీవన ప్రమాణాలు పెరిగాయి. వ్యవసాయ రంగమే కాదు, పారిశ్రామిక రంగంలోనూ నెహ్రూ నేతృత్వంలో ఈ దేశం గణనీయమైన ప్రగతిని సాధించింది. బొకారో, జంషెడ్‌పూర్, రూర్కెలా, హిందుస్థాన్ జింక్ వంటి ఉక్కు పరిశ్రమలు, నాల్కో వంటి అల్యూమినియం పరిశ్రమలు, ఓఎన్‌జీసీ వంటి చమురు కేంద్రాలు, దేశవ్యాప్తంగా ఎన్నో ఓడ రేవులు నెహ్రూ చొరవతో నిర్మాణమై దేశాన్ని అన్ని విధాలా నిలబెట్టాయి. దేశ అవసరాలు పూర్తి చేయడమే కాకుండా ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేసే దశకు చేరుకున్నాయి. వైద్యానికి, ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులు దేశంలోనే తయారు కావాలన్నది ఆయన ఆశయం. దాన్నే సాధించారు కూడా!**

దేశానికి ఊపిరులూదిన పండిట్ నెహ్రూ కృషిని తక్కువ చేసి మాట్లాడేవారు చారిత్రక సత్యాలు తెలుసుకుంటే మంచిది. ఆయన ప్రధానిగావున్న కాలంలో ప్రతిపక్షంలో మహానుభావు లెంతో మంది ఉండేవారు. ఎన్నో విమర్శలు చేసేవారు. అవి పనికొచ్చేవైతే ఆయన తప్పకుండా ఆలోచించేవారు. కార్టూనిస్టు శంకర్‌ను దగ్గరకు పిల్చుకుని "శంకర్ నువ్వు స్వేచ్ఛగా, సహేతుకంగా విమర్శించు. అధికారంలో వున్న మా అహంకారాన్ని ఎప్పటికప్పుడు వదిలిస్తూ ఉండు" అని సలహా ఇచ్చారు. అలాంటి సంస్కారం మరి ఇప్పటి నాయకులకు ఎందుకు లేదూ?

నర్మదా నది పరీవాహక ప్రాంతంలో డెబ్బయి రెండు గ్రామాల్ని ఊడ్చేసి, వేల మంది నిర్వాసితుల్ని పట్టించుకోకుండా ఎత్తయిన పటేల్ విగ్రహం స్థాపించినంత మాత్రాన, అది ఈ దేశంలో తొలి ప్రధాని స్థానాన్ని తగ్గించగలదా ? ఎవరెన్ని చెప్పినా పటేల్ నెహ్రూ దగ్గర పనిచేసిన హోం మినిస్టర్ మాత్రమే ! దార్శనికునిగా, వైజ్ఞానిక ద్రష్టగా పటేల్‌ను ఎవరూ గుర్తుపెట్టుకోలేదు. అయినా ప్రజలు ప్రేమతో, గౌరవంతో తాము ఏర్పాటు చేసుకున్న విగ్రహాల ఎత్తు ముందు, జనాన్ని హింసించి, ప్రభుత్వాలు నెలకొల్పే విగ్రహాల ఎత్తు ఎంత ? ఆలోచిస్తే విషయం చాలా లోతైంది.

స్వాతంత్ర్య సమరంలో తల మునకలై ఉన్న నెహ్రూకు కూతురు ఇందిరను పెంచడం చాలా కష్టమైంది. ఎందుకంటే ఆయన భార్య కమల యవ్వన దశలోనే కన్నుమూశారు. జైలు నుండి ఆయన కూతురికి ఉత్తరాలు రాశారు. అందులో దేశ భూ, భౌతిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల గూర్చి అనేక విషయాలు రాశారు. ఆ ఉత్తరాలే "డిస్కవరీ ఆఫ్ ఇండియా"గా పుస్తకం వెలువడింది. దాని ఆధారంగా చిత్ర దర్శకుడు శ్యాం బెనెగల్ టి.వి. సీరియల్ తీశారు. పిల్లలపై ఆయనకు గల ప్రత్యేకమైన శ్రద్ధ, ప్రేమల వల్ల ఎన్నో సంస్థలకు, ప్రాజెక్టులకు ఆయన రూపుదిద్దారు. చాచా నెహ్రూగా శాశ్వతత్వం పొందారు. ❑

# జీవితమంటే పనేనా ?



- డాక్టర్. సీ.ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి

జీవితం అంటే పని తప్ప ఇంకేమీ ఉండడానికి వీల్లేదని ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ప్రవచించారు. యువత వారానికి 70 గంటలు పనిచేయాలని ఆదేశించినంత పనిచేశారు. నారాయణమూర్తి చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అభివృద్ధికి, ఎక్కువ గంటలు పనికి అవినాభావ సంబంధం ఉందా ? అనే అంశమూ చర్చకొచ్చింది. వ్యక్తి వారానికి ఎన్ని గంటలు పని చేయాలి, ఎన్ని గంటలు పని చేసే దేశాలు అభివృద్ధి చెందాయి ? పని గంటల ఆధారంగానే అభివృద్ధి సాధ్యపడుతుందా ? అనే విషయాలపై వివిధ రకాలైన విశ్లేషణలు వెలువడుతున్నాయి.

ప్రపంచదేశాలతో పోలిస్తే భారత్‌లో ఉత్పాదకత చాలా తక్కువని నారాయణమూర్తి అన్నారు. పని ఉత్పాదకతను మనం మెరుగు పర్చుకోకపోతే, అద్భుత ప్రగతి సాధించిన దేశాలతో పోటీ పడలేమని వారానికి 70 గంటలపాటు పని చేసేందుకు యువత సిద్ధం కావాలని అన్నారు. ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విపరీతంగా చర్చ జరిగింది. మూర్తికి మద్దతుగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు స్పందించారు. ఈ స్పందనల్లోనే ఇన్ఫోసిస్‌లో జరుగుతోన్న శ్రమ దోపిడీ వార్తల్లోకి ఎక్కింది. తక్కువ వేతనాలిస్తూ ఎక్కువ పనిచేయించుకునే సంస్థగా ఇన్ఫోసిస్‌పై కొందరు విమర్శలు చేశారు. ఐటీ కంపెనీల్లో కొత్తవారు, సీఈవోలు అందుకుంటున్న వేతనాలను పోలుస్తూ ఐఏఎస్ అధికారి అశోక్‌ఖేమ్కా చేసిన ట్వీట్ వైరల్ అయ్యింది. 2012లో ఇన్ఫోసిస్ సీఈవోకు ఇస్తున్న వేతనం రూ. 80 లక్షలు కాస్తా 2022 నాటికి రూ. 79 కోట్లకు చేరింది. అదే రీతిలో ఇతర ఐటీ ఉద్యోగులకు ఎందుకు పెరగలేదని గట్టిగానే నిలదీశారు. సంస్థ కోసం సీఈవో ఎంత పని చేస్తున్నారో ఇతర ఉద్యోగులు అంతే పని చేస్తుండగా వారి మధ్య వేతనాల్లో 2,200 రెట్ల వ్యత్యాసం ఎందుకుందని చేసిన ఐఏఎస్ అధికారి చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని లేపాయి.

దేశంలో ఇప్పటికే నిరుద్యోగం తీవ్రస్థాయిలోకి చేరింది. కరోనా దెబ్బ నుంచి ఇప్పటికీ కోలుకోలేపోతోంది. స్వాతంత్ర్యానంత భారతంలో ఇప్పుడున్నంత నిరుద్యోగం మునుపెన్నడూ లేదని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత ఆర్థిక విధానాల కారణంగా తొమ్మిదిన్నరేళ్లలో దాదాపు 14 కోట్ల మంది ఉపాధి అవకాశాల్ని కోలోయినట్టు వివిధ సర్వేల్లో వెల్లడైంది. దీని ఫలితాలు 2023లో విడుదలైన గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో భారత్‌స్థానం దిగజారడం ద్వారా బహిర్గతమయ్యాయి. 125 దేశాల జాబితాతో వెలువడిన ఈ నివేదికలో భారత్‌ది 111 స్థానం. 2021లో 101, 2022లో 107వ స్థానంలో ఉన్న భారత్ స్థితి ఈ ఏడాది మరింత దిగజారింది. ఈ తరుణంలో ఎనిమిది గంటల పనిస్థానంలో నారాయణమూర్తి పేర్కొన్నట్టు 12 గంటల పని అమలైతే షిఫ్టు పద్ధతి పని విధానంలోనూ మార్పు వస్తుంది. ప్రస్తుతమున్న మూడు షిఫ్టుల స్థానంలో రెండు షిఫ్టుల పని అమలవుతుంది. ఇదే జరిగితే ఉద్యోగాలను పోగొట్టుకునే కార్మికుల సంఖ్య కోట్లలోనే





ఉంటుంది. నిరుద్యోగం, ఆకలి సమస్య ఏ స్థాయిలో పెరుగుతుందో అంచనాలకు చిక్కదు.

**అసలు విరామం లేని పని కారణంగానే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. అనధికారికంగా అమలవుతున్న అధిక పనిగంటల కారణంగా కుటుంబంతో గడిపేందుకు సమయం లేకుండా పోతోందనే బాధ అన్ని రకాల ఉద్యోగ, కార్మిక వర్గాల్లోనూ ఉంది. ఇక రోజుకు 12 గంటల సమయం అధికారికమై, కంపెనీల అనధికారిక పనిగంటల్ని అమలుచేస్తే పరిస్థితి ఏమిటనే భయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వ్యాయామం విషయం పక్కన పెడితే కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా సమయం ఇవ్వలేని స్థితి ఏర్పడుతుంది. ఇప్పటికే భారత్‌లోని కార్మికవర్గం తాము సమాజంలో అంతర్భాగం అనే విషయాన్నే మరిచిపోయే స్థితిలోకి నెట్టబడింది. సాధించుకున్న కార్మిక హక్కులను ప్రభుత్వమే కాలరాస్తోంది.**


పని గంటలు తక్కువ కావడం వల్లనే దేశంలో ఉత్పాదకత తక్కువగా ఉందని నారాయణమూర్తి అంటున్నారు. కానీ ఇతర దేశాలతో పోలిస్తే భారత పౌరులే ఎక్కువ గంటలే పని చేస్తున్నారని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్‌ఓ) స్పష్టం చేసింది. ఐఎల్‌ఓ ఇచ్చిన ఒక నివేదిక ప్రకారం కరోనాకు ముందు భారతీయులు ప్రతీ ఏడాది సగటున రెండు వేల గంటలకుపైగా పనిచేశారని వెల్లడించింది. ఇది అభివృద్ధి చెందిన అమెరికా, బ్రెజిల్, జర్మనీలతో పోలిస్తే చాలా ఎక్కువని తెలిపింది. ఐఎల్‌ఓ ప్రకారం ఉత్పాదకతకు ఎక్కువ గంటలు పని చేయడానికి ఎటువంటి సంబంధం లేదని తేలిపోయింది. ఐఎల్‌ఓ ప్రకారం ఉత్పాదకతను పెంచడం అంటే పని గంటలు పెంచడం కాదని నారాయణమూర్తి గ్రహించాలి. చేస్తున్న పని పట్ల నిబద్ధత, అవసరమైన వృత్తి నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారానే ఉత్పాదకత పెరుగుతుంది. నాణ్యమైన పని ఎక్కువ గంటల పనికన్నా మెరుగైన ఫలితాలను ఇస్తోందనేది అభివృద్ధి చెందిన దేశాల అనుభవం. అందుకే చాలా దేశాల్లో నాలుగు రోజుల పని విధానం అనే దిశగా కదులుతున్నాయి. కార్మికుల వేతనాల్లో కోతలు లేకుండా వారానికి నాలుగు రోజులపాటు పని హక్కు కోసం బెల్జియం 2022లోనే తమ చట్టాల్లో మార్పులు చేసింది. ఉత్పాదకతను మరింత పెంచడానికే ఈ చర్యలు తీసుకున్నట్లు బెల్జియం ప్రధానమంత్రి అలెగ్జాండర్ డిక్రూ చెప్పారు. వారంలో నాలుగు రోజులు పని కోసం కృషి చేస్తోన్న '4 డే వీక్ గ్లోబల్' సంస్థ ఆరు నెలలపాటు చేసిన ట్రయల్‌లో పాల్గొన్న 61 కంపెనీల్లో 56 కంపెనీలు నాలుగు రోజుల పని విధానంలోకి వస్తామని చెప్పాయి. వాటిలో 18 కంపెనీలు రోజుల పని విధానాన్ని తాము శాశ్వతంగా అమలు చేస్తామని ప్రకటించాయి.

ప్రపంచ యుద్ధాల నేపథ్యంలో దెబ్బతిన్న జర్మనీ, జపాన్ దేశాల్లో అక్కడి పౌరులు అదనపు గంటలు పనిచేశారని మూర్తి చెప్పారు. ప్రస్తుతం జపాన్‌లో పని గంటల విషయంలో అమలవుతున్న వాస్తవ పరిస్థితిని గమనించి ఉంటే బాగుండేది. పని గంటలకు, ఉత్పాదకతకు సంబంధం లేదనేది అక్కడి పని ప్రదేశాల్లో కార్మికుల విశ్రాంతి కోసం అమలవుతున్న స్లీపర్ సెల్స్ విధానాల్ని గమనిస్తే అర్థమవుతుంది.

భారత్‌లో బలంగా ఉన్న కార్మిక చట్టాలను నీరుగారుస్తున్న మోదీ సర్కారు ఆశలకు అనుగుణంగానే నారాయణమూర్తి ఆ వాఖ్యలు చేసినట్టు కనిపిస్తోంది. ఇందుకు అనుగుణంగా యూపీ, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో ఫ్యాక్టరీల్లో పని సమయాన్ని ఎనిమిది నుంచి 12 గంటలకు పెంచడానికి ప్రభుత్వాలు ప్రయత్నించాయి. కార్మిక వర్గం తిరుగుబాటుతో వెనక్కి తగ్గాయి. వారంలో 70 గంటలు పనిచేయడం వల్ల జరిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. జీవితమంతా పని గంటలే అవడంతో ఒత్తిడి తీవ్రమై చివరకు తాము చేస్తున్న ఉద్యోగం పట్లే విరక్తి కలిగే అవకాశాలు లేకపోలేదు. శారీరక, మానసిక అలసటతో అసలు సహజ పునరుద్ధరణ ప్రక్రియకు ఆటంకం కలుగుతుంది. ఆహారం నియమాలు తప్పుతాయి. ఊబకాయం, కండరాల సమస్యలు, నిరాశ, అలసట, నిర్లిప్తత, నిద్ర లేమి వంటి అనేక సమస్యలను ఎదుర్కోక తప్పదు. జీవితం కోసం పని బదులు పని కోసమే జీవితం అనే చందాన మనిషి ఒక యంత్రంగా తయారవ్వాల్సి వస్తుంది. వారానికి 55 గంటలకంటే ఎక్కువ పని చేసే వారిలో గుండెపోటు సహిత హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం ఎక్కువని నివేదికలు ఉన్నాయి. నారాయణమూర్తి యువకులను ఉద్దేశించి మాత్రమే ఆ వ్యాఖ్యలు చేశారని సమర్థించలేము. యువకులు అధిక పని గంటలను భరించగలరనేది అపోహే అవుతుంది. అలా భావిస్తే దేశ భవిష్యత్తు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టడమే అవుతుంది.

ప్రపంచ ఆనంద సూచీ–2023లో (వరల్డ్ హ్యాపీనెస్ ఇండెక్సు) భారత స్థానం అట్టడుగునే ఉంటోంది. 146 దేశాల జాబితాలో మనది 126 స్థానంలో ఉన్నాం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో సస్టెనబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ విడుదల చేసే ఈ నివేదిక విశ్లేషించిన డేటాలో స్థూల ఉత్పత్తి, ప్రజల ఆయుష్షు, దానగుణం, సామాజిక స్థితి, స్వేచ్ఛ అనేవి ప్రధానంగా ఉన్నాయి. వీటన్నిటిపై పని గంటల ఒత్తిడి పడి ప్రజలకు ఆనందం అనేది అందని ద్రాక్షే అవుతుంది. కాబట్టి మనిషి జీవితంలో పని ఒక భాగం మాత్రమే. పనే జీవితం కారాదని గుర్తిద్దాం. ❑

# క్రికెట్‌లో భారత్ ఓటమి నన్నేమీ బాధ పెట్టలేదు !



- అవిజిత్ పాథక్

క్రికెట్ వ్యామోహంతో నిండిపోయిన సమాజానికి చెందిన వ్యక్తిని కాను నేను. వాస్తవానికి, నాకు ప్రత్యేకించి క్రికెట్ అంటే ఇష్టమేమీ లేదని చెప్పగానే నా స్నేహితులు, దగ్గరి బంధువులు నా వంక చాలా విచిత్రంగా, ఆశ్చర్యంగా చూస్తారు. ఒక రకంగా చిరాకుగా కూడా చూస్తారు. చాలా అరుదుగా నేను ఆ క్రికెట్‌ను చూస్తాను. అత్యంత లాభదాయకమైన, మార్కెట్ ఆధారిత పరిశ్రమస్థాయికి క్రికెట్ క్రీడను కుదించి వేయడం నాకు అసహ్యంగా అనిపిస్తుంది.

మన 'స్టార్' క్రికెటర్లపై కేంద్రీకృతమైన పురాణాలు, వారి ఆకర్షణీయమైన జీవన శైలి, వారి 'వ్యవహారాలు' లేదా కార్పొరేట్–బాలీవుడ్ సంబంధాలతో వారికి గల సాన్నిహి త్యం ఇవన్నీ నన్ను ఆకర్షించవు. పైగా, క్రికెట్‌ను ఒక రకమైన యుద్ధంగా, అంతర్జాతీయ మ్యాచ్‌లో విజయాన్ని సర్జికల్ దాడులతో సరిపోల్చేంత 'జాతీయవాది'గా నేను ఇంకా మారలేదు. ఆదివారం, బయటి వ్యక్తి తరచుగా ఎదుర్కొనే ఒంటరితనం యొక్క తీవ్రత ఎలా వుంటుందో నేను అనుభవించాను. ప్రపంచకప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా, భారత్‌ను ఓడించింది. అయినా, నేనేమీ గుండెలవిసేలా ఏడవలేదు. నా హృదయం కల్లోలం కాలేదు. నేను గాయపడేంతగా నాలో 'జాతీయవాద' అహం (ఇగో) లేదు. బదులుగా, ఆ ఓటమిని నేను చాలా లైట్‌గా తీసుకున్నాను. బాగా నిద్రపోయాను కూడా. అయితే, అసలే ప్రపంచకప్ ఫైనల్లో ఓడిపోయి, దేశ ప్రజలందరూ సామూహికంగా విచారం వ్యక్తం చేస్తూ వున్న తరుణంలో, 'జాతి'గా పిలిచే కొత్త దేవుడిని ఆరాధించడానికి క్రికెట్‌ను ఒక తాంత్రిక పూజ స్థాయికి కుదించి పారేసిన వారితో నా భావాలను పంచుకోవడం అంత సులభమేమీ కాదని నాకు తెలుసు. ఎలాంటి ప్రేమ, అభిమానాలు చూపని నా తీరును, విలువ ఇవ్వని నా తటస్థ వైఖరిని వారు అసహ్యించుకోవచ్చు కూడా. నా జాతీయవాద ప్రామాణికాలను కూడా వారు శంకించవచ్చు, అయినప్పటికీ, క్రికెట్ వ్యామోహాలతో నిండిన సమాజంలో నేనొక బయటివ్యక్తిగా బతకడం అంత సులభమేమీ కాదు. ఇంత ఒంటరితనం ఉన్నప్పటికీ, ఇలా క్రికెట్‌కు బయటి వాడిగా వుండడం కూడా కొంత లాభదాయకమే. ఎలా అంటే,






మన స్టార్ క్రికెటర్లు (నిరంతరంగా ఏదో ఒక ఉత్పత్తికి బ్రాండ్ అంబాసిడర్లుగా వుండేవారు. వివిధ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తులను ప్రజలు కొనుగోలు చేసేలా చూసేందుకు, వాటిని నమ్మించేందుకు ప్రయత్నిస్తూ వుంటారు) నన్ను హిప్నటైజ్ చేయడానికి అనుమతించను. క్రికెట్ పేరుతో జరుగుతున్న దాన్నంతా నేను తీవ్రంగా, పదునుగా విమర్శించగలను. ఇది వారి దేశాభిమానం కాదు, దానికి బదులుగా, వారి హావభావాల్లో, ప్రాక్టీస్‌లో 'నగదు చెల్లింపు' మ్యాజిక్‌ను చూడగలను. మనుషుల్లో స్వార్థాన్ని తప్ప మంచిని చూడని వ్యక్తి(సినిక్)ని అంటూ మీరు నన్ను నిందించినా సరే, ఈ తరహా క్రికెట్ ముఖ్యంగా వ్యాపారం తప్ప మరొకటి కాదన్న విషయాన్ని అయితే నేను మరిచిపోను. ఉదాహరణకు

**మన వంటి దారిద్ర్యంతో బాధపడే దేశంలో విరాట్ కోహ్లి ఐపీఎల్ కెరీర్ ద్వారా ఇప్పటికే రూ.126 కోట్లు సంపాదించాడు. ఐపీఎల్ 2023 వేలానికి సంబంధించి రోహిత్‌శర్మ మార్కెట్ విలువ రూ.16 కోట్లు! పైగా ఇండియా ఛేంజ్ ఫోరమ్ ఇచ్చిన ఒక నివేదిక ప్రకారం, ఎన్ని నియంత్రణా ఆంక్షలు ఉన్నప్పటికీ భారత్‌లో క్రికెట్ బెట్టింగ్, గాంబ్లింగ్ మార్కెట్ గణనీయమైన రీతిలో అభివృద్ధి చెందింది. 2023 చివరి నాటికి ఈ మార్కెట్ విలువ 200 కోట్ల అమెరికన్ డాలర్లు వుంటుందని అంచనా వేయబడింది. టీనేజర్లు, విద్యార్థి, యువత సహా 34 కోట్ల మందికి పైగా భారతీయులు ఈ క్రికెట్ బెట్టింగ్‌లో పాల్గొనడం మంచి విషయమో కాదో నిర్ణయించాల్సింది మనమే.**

వాస్తవానికి, ఈ క్రికెట్ స్టార్లందరూ నిస్వార్థులైన దేశాభిమానులని, మన దేశానికి బేషరతుగా సేవ చేస్తున్నారని చిత్రీకరించడం తెలివి తక్కువతనమే కాగలదు. ప్రపంచకప్ రన్నరప్‌గా భారత బృందానికి దాదాపు రూ.16 కోట్ల నగదు బహుమతి అంతర్జాతీయ క్రికెట్ మండలి నుండి వస్తుందనే విషయం మరిచిపోరాదు. మీరు, నేను మన 'రక్షకుడు'గా విలువనిచ్చే, కార్గిల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సైనిక జవాను వేతనం స్కేలుతో దీన్ని పోల్చి చూడండి. అలాగే, క్రికెట్ ప్రపంచానికి బయటి వ్యక్తిగా, పురుష జాతి ఇగోను పెంచేందుకు ఒక వ్యూహంగా క్రికెట్‌ను ఉపయోగించే రాజకీయాలను కూడా నేను చూడగలను. భారత్, పాకిస్తాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను ఒక యుద్ధం స్థాయికి కుదించే విషపూరితమైన టెలివిజన్ వార్తా చానెళ్ళు వుండడాన్ని మనం చూస్తున్నాం. ఇందులో ఇమిడి వున్న వికారం గురించి ఆలోచించండి. ఈ క్రికెట్ యుద్ధంలో 'జై శ్రీరామ్' అంటూ పెద్ద పెట్టున నినదించడమే మన ఆయుధంగా మారినట్లైతే, మన సమిష్టి క్షీణతను, మన క్రూరమైన ప్రవృత్తులను, ఆత్మ విశ్వాసం లేని మతాన్ని, ఆటను ఆటగా చూడలేని మన నిస్సహాయతను అది వెల్లడిస్తుంది. పాకిస్తానీ క్రికెటర్ సృజనాత్మక నైపుణ్యాలను ప్రశంసించడం ఈ రోజుల్లో ఇబ్బందికరంగా మారిందంటే మనల్ని జాతి వ్యతిరేకిగా ముద్ర వేస్తారేమోననే భయం వుండడమే కారణమా? అటువంటపుడు, భారత్, పాకిస్తాన్లు క్రికెట్ ఆడుతున్నపుడు, అతిగా జాతీయ భావాలు చెలరేగ డమే అన్ని రకాల మానసిక, సాంస్కృతిక దురాక్రమణలకు కారణం అవుతోందంటే ఆశ్చర్యపోనక్కరలేదు. బహుశా, ఈ తరహా క్రికెట్ జాతీయవాదం పట్ల నాకు గల అసౌకర్యమే నన్ను కాపాడి వుంటుంది.

**ఆస్ట్రేలియా భారత్‌ను ఓడించింది. ఈ ఓటమి నన్ను బాధ పెట్టకుండా, వినయానికి సంబంధించిన అతి ముఖ్యమైన పాఠాన్ని నాకు నేర్పింది. అద్భుతమైన నరేంద్రమోడీ స్టేడియం, ప్రధాని నరేంద్రమోడీ, హోం మంత్రి అమిత్ షా, వేలాది మంది అభిమానులు వుండడం, అన్ని రకాల పూజలు, యజ్ఞాలు జరగడం ఇవన్నీ వున్నా, భారత్ విజయాన్ని సాధించలేకపోయింది. ఈ ఓటమి మనకు ఇవ్వాలనుకుంటున్న సందేశం అర్థమేమిటో గ్రహించడానికి మనం సిద్ధంగా వున్నామా?**

ప్రతీదీ అశాశ్వతమేనని ఇది మనకు బోధించింది. నీ విజయం గానీ ఓటమి గానీ ఏదీ శాశ్వతం కాదు. ఈనాడు మీరు హీరో, రేపు మీరు జీరోకు పడిపోవచ్చు! అందువల్లే, ఈ ఓటమిని మనం అత్యంత హుందాగా స్వీకరించాలి, ఆమోదించాలి. అంతేగానీ మాస్ హిస్టీరియాతో లేదా సమిష్టి అవమానంతో కాదు. అలాగే, మన 'ఇగో', అది జాతీయవాదం పేరుతో పవిత్రం చేయబడినా కూడా ఒక భ్రమే. క్రికెట్‌ను సర్జికల్ దాడి స్థాయికి తగ్గించాలను కుంటున్న యోధులందరికీ బహుశా, ఈ ఓటమి ఒక సందేశాన్ని ఇస్తోంది. వారందరినీ హుందాగా వ్యవహరించమని కోరుతోంది. ఆటను ఆటగానే చూడాలంటోంది. సమరశీల జాతీయవాదమనే అద్దాలు వారు చూసే తీరును ఎలా వక్రీకరిస్తున్నాయో అర్థమవుతోంది. అంతర్జాతీయ సంఘీభావం, ఏకత్వమనే భావనను సెలబ్రేట్ చేసుకోవాలని చెబుతోంది. ❑

**(ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో)**

# ఆకాశమంత అక్షరమూర్తి ఆవంత్స సోమసుందర్



(అభ్యుదయ కవి సంక్షిప్త పరిచయం)

- గౌరవ్

**క**వి, **రచయిత :** ఆ కవితావేశానికి బెదిరిపోయిన ప్రభుత్వం ఆయన కవిత్వాన్ని నిషేధించింది. ఐనా, పదుల సంఖ్యలో ఆయన కవితా సంపుటాలు ప్రచురించారు. జీవితమే కవిత్వంగా బతికారు. ఒంటి చేతితో ఏకంగా అక్షరాలా వందకి పైబడి పుస్తకాల్ని ప్రచురించిన వ్యక్తి!

**ఉద్యమకారుడు :** ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ తరపున పీడిత ప్రజానీకం కోసం గొంతెత్తడం మొదలు పారిశుధ్య కార్మికుల సమస్యల వరకూ, అణగారిన వర్గాల పక్షాన న్యాయ పోరాటం చేయడం నుంచి అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షునిగా ఆయన రూపొందించిన కార్యక్రమాల వరకూ అన్నింటా ఆయన ఒక ధిక్కారమే !

**విమర్శకుడు :** గురజాడ, వీరేశలింగం, శ్రీశ్రీ, నారాయణ బాబు, కొ.కు, పురిపండా, తిలక్, చలం, కృష్ణశాస్త్రి, అనిసెట్టి, రవీంద్రనాథ్ టాగూర్, శరత్, హెన్రిన్ హెయినీ, బుద్ధదేవ్ బోస్, సుబ్రహ్మణ్యభారతి, హరిన్‌చటో వంటి మహామహులపై సమగ్రంగా ఒక్కొక్క గ్రంథం సాధికారికంగా రాసిన వ్యక్తి. ఆంగ్లంలో విమర్శ కోసం ఆయన చేసిన అధ్యయనం అద్వితీయం అంటారు !

**అనువాదకుడు :** ప్రఖ్యాత జర్మన్ సాంస్కృతిక శీలి బెర్తోల్ బ్రెష్ట్ 'అమ్మ' నాటకాన్ని, ఎర్నెస్ట్ టోలర్ మందీ – మనిషీ నాటకాన్నీ, తెలుగుచేసిన గొప్ప వ్యక్తి. గోథే మహాకవి రచన శోక తరంగాలు పేరిట అనువదించినాయన. ప్రఖ్యాత మార్క్సిస్ట్ మేధావి క్రిస్టోఫర్ కాడ్వెల్ ఇల్యూజన్ రియాలిటీ 'భ్రాంతి – వాస్తవికత'గా అనువదించిన మహా కృషీవలుడు. మహాకవి షెల్లీ కావ్యాన్నే కాక షెల్లీ జీవితం గురించిన అద్భుతమైన నవల 'ఏరియల్'ని తెలుగు వారికి అందించిన గొప్ప అనువాదకుడు!

**పరిశోధకుడు :** లియొనార్డో డావిన్సీ గురించి శోధించిన వ్యక్తి. కన్యాశుల్కంలో గిరీశం వాడిన పూర్‌రిచ్‌ర్డ్ ఆదుపాదుల్ని వెలికి తీసి తెలుగు సాహిత్యలోకానికి అందించిన వ్యక్తి. నూరు శరత్తులు, ఆ తరం కవితా తరంగాలు, శరచ్చంద్రిక, దేశీ సారస్వతము – సమాజ వాస్తవికత వంటి గ్రంథాలు ఆయనలో శోధనకు ప్రతీకలు !

**ప్రయోగశీలి :** ఆయన రచనలేవీ అచ్చు వేయరాదనీ ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రభుత్వం ప్రెస్సులకి తాఖీదు ఇచ్చిన సందర్భంలో తెనాలిలో ప్రచురించిన ఏకైక కథా సంపుటి 'బానిసల




దేశం'. రష్యా విఫల వామపక్ష ప్రయోగాన్ని 'సీకింగ్ మై బ్రోకెన్ వింగ్స్' అనే ప్రయోగాత్మక కావ్యంగా మల్చిన వ్యక్తి. ఆయన సంపూర్ణ ప్రయోగకావ్యం రక్తాక్షి. భారతీయ పునరుజ్జీవనానికి తోడ్పడిన మహా వ్యక్తుల జీవనరేఖలు 'వెలుతురు తెరువులు!'

**ఉద్వేగి :** అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగానికి మద్దతుగా 'కాహళి', అరసం-విరసం వివాదం గురించి రాష్ట్రమంతా పర్యటించి వచ్చిన ప్రశ్నలు-జవాబుల్ని 'సాహిత్యంలో సంశయ కల్లోలం', ఇంగ్లాండ్ పర్యటన ఆరుద్రగారితో చేసొచ్చి 'ఆంగ్ల సీమలో ఆమని వీణలు', బాబ్రీ మసీదు, మతకలహాల నేపథ్యంలో 'చేతావని', 'రక్షరేఖ' రైల్లో బాంబు దుస్సంఘటన గురించి 'ధూప ఛాయ' కవిగా ఆయనలోని మానవీయ



స్పందనకి చిహ్నాలు

**రసజ్ఞుడు :** 'కవిత్వం కాలాతీత కాంతిరేఖ' ఈనాటికీ ఎందరో కవులకి ఒక దిక్సూచి. 'ఉర్దూ సాహిత్యంలో ఉన్నత శిఖరాలు'హిందుస్తానీ కవిత్వంలో ఆయన పరిచయానికి తార్కాణం. గవాక్షంలో అంతరిక్షం, కెరటాలు – కిరణాలు ఆంగ్ల సాహిత్యంలో ఆయనకున్న గాఢతకు సాక్ష్యాలు. భారతీయ శాస్త్రీయ సంగీతం పై ఆయన సాధికారికతకి ప్రమాణం, 'హంసధ్వని'!

**కార్యశీలి :** 1953లో సంభవించిన వరద ముంపు గ్రామాల్ని స్వయంగా వెళ్ళి చూసి 'గోదావరి జల ప్రళయం' అనే కావ్యం రాసిన కవి. కళాకేళి పత్రిక వ్యవస్థాపకులు. ప్రముఖ తత్వవేత్త జార్జి థామ్సన్‌ని స్వయంగా ఇంగ్లాండ్‌లో కలిసి ముచ్చటించి ఆయన రచన మార్క్సిజం – కవిత్వాన్ని తెలుగులో అనువదించిన మహాకవి. కళాకేళి నికేతన్ ప్రచురల ద్వారా అనేకమంది రచనల్నీ, సో.సు. లిటరరీ ట్రస్ట్ స్థాపించి తద్వారా అనేకమంది ప్రముఖ కవులు, రచయితలు, అనువాదకులు, విమర్శకులు, ఉద్యమకారుల్ని సత్కరించిన వ్యక్తి !

ఇవికాక కలలు – కన్నీళ్ళు, పూలూ–ముళ్ళు పేరిట రెండు భాగాల స్వీయచరిత్ర మరెన్నో విమర్శనా గ్రంథాలు, భాషాసేవ, బృహత్ కావ్యాలు, ప్రయోగ గీతాలు, ప్రసంగాలు, పద్యాలు, పాటలు, బాలల గేయాలు, నవలలు, కవితాసంపుటాలు, కావ్యాలు.. వంటివాట్లో నిరంతర కృషి చేసిన స్నేహశీలి, మానవతా వాది. చనిపోయే వరకూ సాహిత్యంతో సహవాసం చేసిన డా.ఆవంత్స సోమసుందర్ శత జయంతి సమీపిస్తున్న సందర్భంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ స్తబ్ధంగా ఉన్న కవిమిత్రులు, సాహితీ వేత్తలు కాస్త మేల్కొని ఆయన కృషి కోసం కనీసం నేటి తరాలకు తెలిపేందుకైనా కార్యాచరణ రూపొందించాల్సిందిగా మనవి చేస్తూ ఈ చిన్న రైటప్! ❑

## శత జయంత్యుత్సవ సదస్సు

నవంబర్ 19, ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీ సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో చెలికాని భావన రావు సభాసదన్‌లో జరిగిన వజ్రాయుధ మహాకవి, శతాధిక గ్రంథకర్త, కళారత్న డా. ఆవంత్స సోమసుందర్ గారి శత జయంత్యుత్సవ సదస్సు కనుల పండుగగా జరిగింది. సుమారు 120 మందికి పైబడి పాల్గొన్న ఈ సమావేశంలో దాదాపు 50 మంది సో.సు. గారితో గాఢమైన వారి అనుబంధం గూర్చి పంచుకున్నారు! ఢిల్లీ మొదలుకొని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమహేంద్రవరం, కోరుకొండ, పెద్దాపురం, సామర్లకోట, కాకినాడ ఇంకా అనేక ప్రాంతాల నుండి కార్యక్రమం కోసం పనిగట్టుకు వచ్చిన మిత్రులకూ, మొత్తం సదస్సు పూర్తయ్యేవరకూ ఉండి వారి భావాలు పంచుకుని శతజయంత్యుత్సవ ఆతిథ్యం, చిరు సత్కారాలు, స్వీకరించి ఆనందంగా వెళ్ళిన శ్రేయోభిలాషులు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు!

# ఉద్యమకారులకు మార్గదర్శి డా.చెలికాని

('డా.చెలికాని రామారావు జీవన రేఖలు' పుస్తక పరిచయం)

- డా.పి.యస్. ప్రకాశరావు



తొలి పార్లమెంట్ సభ్యులు, ఆదర్శ కమ్యూనిస్టు అయిన డా. చెలికాని రామారావు గారు 1901 జూలై 15న పుట్టారు. 1985 సెప్టెంబర్ 25న మరణించారు. అంటే ఆయన జీవిత కాలం సుమారు 85 ఏళ్ళు. దీన్ని 4 భాగాలుగా విభజించారు. విద్యార్థి దశ, స్వాతంత్ర సమరయోధుడిగా, పార్లమెంటేరియన్ గా, రామారావు గారి వ్యక్తిత్వం. ఇందులో 20 ఏళ్ల విద్యార్థి జీవితాన్నీ, పదవీ విరమణ తరువాత విరామ జీవితాన్నీ మినహాయిస్తే మిగిలిన 36 ఏళ్ల కాలం రామారావు గారు ప్రజల కోసమే వెచ్చించారు. పిఠాపురం బడిలో చదువుకునే రోజుల్లోనే రామారావు గారిపై ప్రధానోపాధ్యాయులైన కూచి నరసింహ పంతులు గారి ప్రభావం పడింది. ఆయన బ్రహ్మ సామాజికులు. అలాగే తెలివైన విద్యార్థులను ప్రోత్సహించే పిఠాపురం రాజా కాకినాడలో రామారావుగారి కాలేజీ చదువుకు చేయూత నిచ్చారు. కానీ, కాకినాడ వెళ్ళాక జాతీయ కార్యక్రమాలు, డాక్టర్ అనీబిసెంట్ ఉపన్యాసాలు ఆయన్ని సానపట్టిన వజ్రంలా తయారుచేశాయి. సహాయ నిరాకరణోద్యమం, త్రివిధ బహిష్కారం, రౌలట్ చట్టం వంటివి ఉద్యమబాట చూపాయి. తన పరీక్షల గురించి మానేసి దేశం ఎదుర్కొంటున్న విషమ పరీక్ష గురించి ఆలోచించడం మొదలు పెట్టారు. ఫలితంగా ఎఫ్.ఏ పరీక్ష ఫెయిలయ్యారు. ఉద్యమంలో తానూ ఒక సమిధను కావాలనుకున్నారు. నిర్ణయించుకున్నారు. నిండా 20 ఏళ్ళ వయసు లేదు. నూనూగు మీసాల నవయవ్వనం.

1921 జనవరి 26వ తేదీ వేకువ జామున కన్నవాళ్ళనూ, ఉన్న ఇంటినీ, పుట్టిన ఊరును, పైచదువులకు పిఠాపురం రాజా ఇచ్చే సాయాన్ని వదిలి, కట్టుబట్టలతో కాలినడకన వెళ్లిపోయి స్వతంత్ర సంగ్రామంలో ప్రవేశించారు. తను వెళ్ళేది పూలబాట కాదని తెలుసు. కడుపు మాడ్చుకోవలసి వస్తుందని తెలుసు. అయినా కర్తవ్యాన్ని వదల్లేదు. కాల్పులు జరిగే సందర్భాలు వచ్చినా కాళ్ళ బేరానికి దిగలేదు. ఉరకలెత్తే వయసులో ఉప్పెనలా పెల్లుబికిన భావ జాలం కొంతవయసు వచ్చాక చప్పున చల్లారిపోవడం కొంత మందిలో చూస్తుంటాం. కానీ ఆయనలో ఉద్యమావేశం వయసుతో బాటు పెరిగిందేకానీ ఏ మాత్రం తగ్గలేదు. కూచి నరసింహం పంతులు గారు, బ్రహ్మర్షి వెంకటరత్నం నాయుడు గారు వంటి ప్రముఖులు కలిగించిన సంఘ సంస్కరణాభిలాష, వందేమాతర ఉద్యమం, ఖాదీ




అభివృద్ధి హరిజనోద్ధరణ, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలతో 1922లో అరెస్టు అయ్యే వరకు విరామం లేకుండా దేశ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గాంధీ సత్యాగ్రహ ఉద్యమాన్ని నిలిపేశాక ఆశ్రమాల స్థాపన, సోషలిస్టు భావాల వ్యాప్తి, అల్లూరి సీతా రామరాజు పోరాటం వంటివి రామారావు గారిలో గాఢ మైన ముద్ర వేశాయి. ఆయన ఆత్మ స్థైర్యాన్ని దెబ్బ తీయాలని ప్రభుత్వం విధించిన జైలు శిక్షలు ఆయనలో రాజకీయ సిద్ధాంతాల అవగాహనకు ఉపయోగపడ్డాయి. తొలిసారి నీలకంఠ బ్రహ్మచారి అనే విప్లవకారుడి పరిచయం వల్ల సామ్య వాద సిద్ధాంతాలతో పరిచయం కలిగింది. రెండోసారి




సుందరయ్య గారితో పరిచయం రామారావు గారి కార్యాచరణకు మెరుగులు దిద్దితే, రామారావు గారి పరిచయం సుందరయ్య గారికి అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు ఆశ్రయం పొందడానికి పనికొచ్చింది.

దేశానికి డొమినియన్ ప్రతిపత్తా ? పూర్ణ స్వరాజ్యమా? అనే చర్చలూ, కాంగ్రెస్ నాయకులలో స్వార్థపరత్వం ఆవేదన కలిగించినా, తాను ఏ లక్ష్యం కోసం ఇల్లు వదిలి పెట్టి వచ్చారో గుర్తుచేసుకుని నిబద్ధతతో నిలబడ్డారు. దేశానికి ఏదైనా చెయ్యాలంటే ఎవరినీ యాచించకుండా ఆర్థికంగా తాను నిలదొక్కుకోవాలని అనుకున్నారు. మధ్యలో ఆపిన చదువు కొనసాగించాలంటే నాలుగు రాళ్ళు సంపాదించాలి. అందుకే నలుగురికీ ట్యూషన్స్ చెప్పారు. హైదరాబాద్‌లో సరోజినీ నాయుడు, ఆమె భర్త గోవిందరాజులు నాయుడుల సాన్నిహిత్యం తో తన ఖాళీ సమయాన్నంతా అక్కడే గడిపారు. అది భావి తెలంగాణ ఉద్యమ నాయకులు స్ఫూర్తి పొందడానికి పనికొచ్చింది. వైద్య పరీక్షల ముందు బులుసు సాంబమూర్తి గారి కోరిక మేరకు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడానికి కాలేజీ వదిలి పెడితే, తల్లి వేరు వెంట పిల్ల వేర్లు వచ్చినట్టు తెలంగాణ నుంచి వంద మంది యువకులు ఆయనను అనుసరించారు. ప్రభుత్వం జైళ్లలో పెట్టి ఉక్కులాంటి ఆయన దృఢ సంకల్పాన్ని రవంత కూడా కదల్చలేకపోయింది. పోలీసు వారి ఇళ్ళకెళ్ళి ఖద్దరు అమ్మడం ఆయన తెగింపుకి నిదర్శనం. పోరాటం వ్యక్తుల ప్రాతిపదికగా కాకుండా సిద్ధాంత ప్రాతిపదికగా జరపాలనుకోవడం ఆయనలో కలిగిన గొప్ప మార్పు. క్షయ వ్యాధిపై డిప్లొమా చేయటానికి బెంగళూరు వెళ్ళిన రామారావు గారు వైద్య విద్యార్థినిగా ఉన్న కమలమ్మ గారిని కలిశారు. పరిచయం పెళ్ళికి దారితీసింది. రాజోలు తాలూకా వైద్య అధికారిణిగా ఉన్న కమలమ్మగారు బదిలీపై రామచంద్రపురం హాస్పిటల్‌కు రావడంతో ఆమె ఉద్యోగానికీ, తన రాజకీయాలకూ వీలుగా ఉంటుందని భావించారు. అజ్ఞాతంలో ఉన్న నాయకుల కుటుంబాలకు ఆమె ఆశ్రయం ఇస్తుండేవారు. రామారావు గారు చేసిన ఆర్థిక సాయాల్లో అధిక వాటా ఆమెదే. పార్టీ కార్యకర్తలకు శిక్షణా తరగతుల బోధన, రెండవ ప్రపంచ యుద్ధం ప్రజా యుద్ధమని ప్రకటించడం సోవియట్ యూనియన్‌పై హిట్లర్ దాడిని మరొక సహచరునితో కలిసి ఖండించడం ఆయనలోని ప్రగతిశీల దృష్టికి నిదర్శనం.

**కమ్యూనిస్టులనూ, కమ్యూనిస్ట్ అభిమానులను కాంగ్రెస్ ప్రభుత్వాలు హింసించినపుడు, జైళ్లలో పెట్టినపుడూ వారి కుటుంబాలను ఆదుకుంటూ, కార్యకర్తల మనోధైర్యాన్నీ, ఆరోగ్యాన్నీ కాపాడేవారు. 'కమ్యూనిస్టులు దేశద్రోహులు' అనే కాంగ్రెస్ వారు చెలికాని రామారావు గారి విషయం వచ్చేసరికి కిక్కురుమనే వారు కాదు. ఎన్‌జీవోల సమ్మె, బకింగ్ హామ్, కర్ణాటక మిల్స్, రైల్వే వర్కర్ల సమ్మె రాష్ట్రస్థాయిలో చేయిస్తే, రామారావు గారు రామచంద్రపురంలో వ్యవసాయ కార్మికుల పోరాటాలు, పందలపాక నూలు మిల్లు, చేనేత కార్మికుల పోరాటాలు**

**వంటివి ఆయన ఉద్యమస్ఫూర్తికి నిదర్శనం.**

రామారావు గారికి కొడుకు పుట్టాక ఇక సంతానం వద్దనుకున్నారు. కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం మేరకు ఆ రోజుల్లో ఎంతో మందికి ఆయన సంతాన నిరోధక ఆపరేషన్లు చేశారు. నాటి వైద్యులలో ఈ ఆపరేషన్లు చేయగలిగే వ్యక్తీ, ఉచితంగా చేసిన వ్యక్తీ రామారావు గారే.

1952లో తొలి పార్లమెంట్ ఎన్నికల వేళ అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండి ప్రచారానికి వెళ్లకుండానే పార్లమెంట్ సభ్యుని గా ఎన్నికయ్యారు. పార్లమెంటేరియన్‌గా నెహ్రూ వంటి వారి మెప్పును పొందారు. ప్రజా సమస్యలతో బాటు సభ్యుల యోగక్షేమాలు చూసేవారు. అల్లూరి సీతారామరాజు సహచరు డైన గాము(గాం) మల్లుదొర పార్లమెంట్ సభ్యుడే అయినా అల వెన్సులూ ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తెలిసి ఆయన్ని నెహ్రూ దగ్గరకు స్వయంగా తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చేశారు.

బ్రహ్మ సమాజం ప్రభావంతో స్త్రీ విద్య అంతంతమాత్రంగా ఉన్న ఆ రోజుల్లో ఆయన సోదరి కుమార్తెను కుటుంబంలో మొదటి మహిళా డాక్టర్‌ని చేశారు. అంతేకాదు తన సోదరుడి చేతా సోదరి చేతా స్త్రీ విద్యను అంగీకరింపజేసి ఆ ఇద్దరికీ అంతర్వర్ణ, అంతర్రాష్ట్ర, వివాహాలు జరిపించడానికి ఒప్పించి రామారావు గారు మాటల మనిషి కాదు చేతల మనిషి అని రుజువు చేశారు. స్త్రీకి ఆర్థిక స్వాతంత్రం ఉండాలని నమ్మిన రామారావు గారు దానిపై పార్లమెంటులో వాదించడమే కాదు, కమలమ్మ గారి ఆర్థిక స్వాతంత్రాన్ని ఎప్పుడూ గౌరవిస్తూ ఉండేవారు. ఇద్దరూ వైద్యులే అయినా రామారావు గారి పేషెంట్లు పేద ప్రజలూ, స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలే కాబట్టి ఆయనకు సేవ ఎక్కువ సేవింగ్స్ తక్కువ అయింది. ఒకవేళ పదో పరకో వచ్చినా దాన్ని కూడా తిరిగి పేదల మందులకో ఆహారానికో ఖర్చు పెట్టేసే వారు. తన సొంత ఖర్చులో ఎంత పొదుపరో ఇతరులకు ఖర్చు పెట్టడంలో అంత దుబారా చేసేవారు. ఒక గృహస్థుగా వేల మందికి ఆతిథ్యమిచ్చారు. అనేక మంది విప్లవకారుల కుటుంబాలను తన ఇంట్లో ఉంచుకుని వారి పురుళ్ళూ, వైద్యాలు చేశారు.


రామారావుగారు నాడు తొలి పార్లమెంటులో లేవనెత్తిన సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు ఈనాటికీ అలాగే ఉన్నాయి. అంతేకాదు అలా సమాజ శ్రేయస్సు గురించి మాట్లాడే నాయకులు ఈనాడు మనకు పార్లమెంట్‌లో లేరంటే అతిశయోక్తి కాదు. ప్రజా ప్రతినిధులకు జీత భత్యాలు ఎలా ఉండాలి? పాలకులలోని కమ్యూనిస్టు వ్యతిరేకత సామ్రాజ్య వాదులకు ఎలా ఉపయోగపడుతుంది ? ఇనుము, ఉక్కు, మోటార్ స్పిరిట్, పెట్రోలియం వంటివి పన్ను పరిధి నుంచి తప్పిస్తే ఎవరు ప్రయోజనం పొందుతారు? ఇంకా.. పోలీసుల ఎదురుకాల్పులు, మూఢ నమ్మకాలు, మత్తుపానీయాలు, మన వైద్య చికిత్సలోని డొల్లతనం, భూ సంస్కరణల అమలు చేయాల్సిన ఆవశ్యకత, మన ప్రణాళికలు, నదీ జలాల సమస్య, రాష్ట్రాల పునర్విభజన, స్త్రీల వారసత్వ హక్కులు, ఆహార కల్తీ, ముందస్తు నిర్బంధాలు, మందుల మాయాజాలం ఇలా పార్లమెంట్‌లో ఆయన లేవనెత్తిన సమస్యల గురించి చెప్పాలంటే ఒక ఉద్గ్రంథం తయారవుతుంది. 'రామారావు గారి వ్యక్తిత్వం' అనే చివరి అధ్యాయంలో ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలను వ్యక్తిగత జీవితంలో ఎలా అమలులో పెట్టారో చెప్పిన వివరాలున్నాయి. కుటుంబ సభ్యులతో ఆయన వ్యవహారశైలి, చరమదశలో తన జీవిత భాగస్వామిపట్ల చూపిన ఆప్యాయత, ఆయన ఆహారపు అలవాట్లు, సన్నిహితులతో సంభాషించిన పద్ధతి, ఆయన సన్నిహితులూ అభిమానులూ ఉచితంగా వైద్య సేవలు పొందిన విధానం, శ్రామికులపట్ల చూపిన గౌరవాద రాలు చాలా చక్కగా వివరించారు.

సంఘ సంస్కరణ, విప్లవభావాల సమ్మేళనం అయిన రామారావు గారు భౌతికవాదిగా, కమ్యూనిస్టుగా పరిణామం చెందారు. ఆజన్మాంతం ఆదర్శజీవితాన్ని గడిపి భావితరాలవారికి ఆదర్శంగా నిలిచి తన 84వ యేట(25-09-1985) తుదిశ్వాస విడిచారు. ఆయన స్వాతంత్రం కోసం ఇల్లు విడిచి వెళుతూ 25-01-1921 న తన అన్నగారికి రాసిన లేఖలో "జీవిత పరమావధి గూర్చి తలంచిన యెడల ఒక మహోద్యమమునకు మానవుని జీవితము సర్పించుట బహు సార్థకము" అని రాశారు. దానిని అక్షరాలా పాటించారు.

**కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు గారు ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో "నేడు జాతీయోద్యమ విలువలు వెనుకపట్టు పట్టినవి. డబ్బు, అధికారం అనేవి రాజకీయ జీవితాన్ని కలుషితం చేస్తున్నవి. దేశం ఎదుర్కొన్న ఇట్టి క్లిష్టపరిస్థితుల్లో డాక్టరు చెలికాని వెంకటరామారావు గారి ఆదర్శ జీవితాన్ని స్మరించుకోటం ఎంతైనా అవసరం" అన్నారు. నేడు శిలా శాసనాలు ఈ పలుకులు. 95 పేజీల ఈ పుస్తకంలో 16 పేజీలలో ముద్రించిన అరుదైన చక్కని ఫోటోలు ఈ పుస్తకం విలువను పెంచాయి. పైగా వీటిలో ఇంతకు ముందు పాఠక మిత్రులు చూడనివి కూడా ఉన్నాయి.** ❑


ప్రచురణ : డా.చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ, రామచంద్రపురం. వెల : అమూల్యం. ప్రతులకు ఫోన్ : 98493 48162

# గురజాడను స్మరించుకుందాం




- రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి

గురజాడ అప్పారావు గారి 108వ వర్ధంతి సందర్భంగా సామాజిక మార్పును కోరే వాళ్ళందరి తరపునా నివాళులు అర్పిస్తున్నాను. ఎందుకంటే.




- గురజాడ కాలంకంటే ముందు నడిచిన రచయిత.
- ఆయన గొప్ప మానవీయ భారతదేశం స్వాప్నికుడు.
- ఆయన అసలైన ప్రజాస్వామిక సమాజ దార్శనికుడు.
- ఆయన తన కాలానికే లౌకిక వ్యవస్థ కాంక్షాపరుడు.
- ఆయన సమాజంలోనూ, సాహిత్యంలోనూ సమూలమైన మార్పును కోరుకున్నారు.
- ఆయన మానవ ఐక్యతను అభిలషించారు.
- ఆయన ప్రేమ పునాది మీద మన సమాజం పునర్నిర్మాణం కావాలని ప్రతిపాదించారు.
- ఆయన మానవ ప్రేమికుడు.
- ఆయన దృష్టిలో మనిషినే విముక్తి ప్రదాత.
- దేశమంటే భౌగోళిక విశేషాలు కాదనీ, దేశమంటే మనుషులనీ, దేశాన్ని ప్రేమించడమంటే దేశంలోని మనుషులను ప్రేమించడమని స్పష్టంగా చెప్పారు.
- ప్రకృతిలో సంభవించే విచిత్ర పరిణామాలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలని, వాటిని చూసి భయపడరాదనీ ధైర్యం చెప్పారు.
- కుల మత రహిత సమాజం ఆయన స్వప్నం
- మత మౌఢ్యం చీల్చి చెండాడారు.
- రాళ్ళకు మొక్కి ప్రయోజనం లేదన్నారు.
- స్త్రీలు చైతన్య వంతులు కావాలని ప్రబోధించారు
- స్త్రీలు పురుషాధిక్యత మీద తిరుగుబాటు చేయాలని చెప్పారు.
- స్త్రీలు తమను తామే సంరక్షించుకోవాలని సూచించారు.
- స్త్రీలు మానవజాతి చరిత్రను తిరిగిరచిస్తారని చాటి చెప్పారు.
- స్త్రీలు వంటలక్కల పదవి నుంచి విముక్తులై సామాజిక కృషిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.
- కులాంతర వివాహాలను సమర్థించారు.
- కుల వ్యవస్థ అధార్మికమైందని చాటి చెప్పారు.
- దళితులను మనుషులుగా గౌరవించమన్నారు.
- అంతా చెడనుకుంటున్న దానిలో మంచిని చూడమన్నారు.
- కేవలం పుస్తక జ్ఞానంతో ఉద్యమాలు నడపడం అశాస్త్రీయ మని, జీవితానుభవంలో నుంచి ఉద్యమాలు పుట్టుకు రావాలని పిలుపునిచ్చారు.
- బౌద్ధాన్ని దేశం నుంచి తరిమి వేయడమే మతపరమైన ఆత్మహత్య అన్నారు.
- భార్యాభర్తల మధ్య దేవుడు, భక్తురాలు సంబంధాలు పోయి, స్నేహ సంబంధాలు నెలకొనాలని చెప్పారు.
- సాహిత్యం వర్తమాన సమాజ జీవితాన్ని సమకాలిక ప్రజల భాషలో చిత్రించాలని అభిప్రాయపడ్డారు.
- సాహిత్యం సమాజంలోని జాతికి తలవంపులు తెచ్చే అంశాలను ఎత్తి చూపి ఉన్నత నైతిక విలువలను ప్రతిపాదించాలని ఆకాంక్షించారు.
- విద్యావంతుల అవకాశవాదాన్ని ఎండగట్టారు.
- గురువుల నిజాయితీ లేనితనాన్ని ఎత్తిచూపారు.
- విద్యా వ్యవస్థలో కాలం చెల్లిన అంశాలను తీసేయాలని సూచించారు.
- తెలుగు భాష ఏ భావాన్ని చెప్పడానికైనా తగినదేనని రుజువు చేశారు.
- శ్రమను కీర్తించి సోమరితనాన్ని అధిక్షేపించారు.
- విశ్రాంతి వర్గ ఆగడాలను తీక్షణంగా విమర్శకు పెట్టారు.
- సామాజిక పరివర్తన లక్ష్యంగా రచనలు చేసిన మహా రచయిత గురజాడ తెలుగు జాతిని మేల్కొల్పిన వైతాళికుడు. ఆయన ఏ భారతీయ రచయితకూ, అప్పటి ఏ పాశ్చాత్య రచయితకు తీసిపోని రచయిత. నాకు ఆదర్శప్రాయుడు గురజాడ. ఆయనకు నా నివాళులు. ❑




నరేంద్రజాలం

డైవర్షన్








మతమైతే ఓకే !

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 2 - Issue No : 3 December 2023








## కొత్త పుస్తకాలు స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatal Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.